ఆదివారం
18•8•2019
కరీంనగర్
• వెల. రూ.8
• సంపుటి 9 • సంచిక 54
• పేజీలు: 14 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




# వేగంగా యాదాద్రి



శనివారం యాదాద్రి ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, స్తపతి ఆనందసాయి కూడా ఉన్నారు

### యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు • రెండుమూడు నెలల్లో పూర్తిచేయాలి

- ప్రతివారం పనుల పురోగతిపై పర్యవేక్షణ • మంత్రి ప్రశాంత్‌రెడ్డి నేరుగా పర్యవేక్షిస్తారు
- ఆలయానికి కొత్తగా ప్రారంభోత్సవం లేదు • అభివృద్ధి పనులకు 692 కోట్ల వ్యయం
- ఫిబ్రవరిలో మహా సుదర్శనయాగం • అప్పటిలోగా కాటేజీలు పూర్తవ్వాలి
- యాదాద్రిపై సమీక్షలో సీఎం కేసీఆర్.. పనుల పురోగతిని పరిశీలించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

యాదాద్రి దేవస్థానం పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ప్రధాన దేవాలయం పనులు తుదిదశకు చేరుకున్నాయని, మిగిలిన కొద్దిపాటి పనులను రాబోయే రెండు, మూడునెలల్లో పూర్తిచేయాలని చెప్పారు. ప్రధాన దేవాలయం పనుల కోసం ఇప్పటివరకు రూ.235 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. భూసేకరణ, రహదారుల నిర్మాణం, దేవస్థాన నిర్వహణ తదితర ఖర్చులన్నీ కలిపి ఇప్పటివరకు రూ.692 కోట్ల వ్యయం అయినట్లు చెప్పారు. వచ్చే ఫిబ్రవరిలో యాదాద్రిలో మహా సుదర్శనయాగం నిర్వహించాలని తలపెట్టినందున ఈలోగా కాటేజీల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన పూర్తికావాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ శనివారం యాదాద్రి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. దాదాపు రెండున్నర గంటలపాటు ఆలయప్రాంగణమంతా కలియతిరిగారు. మండుటెండను లెక్కచేయకుండా ప్రతి నిర్మాణాన్ని నిశితంగా పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ప్రధాన దేవాలయం, గోపురాలు, క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు, ధ్వజస్తంభం, ఆళ్వారుస్వాముల విగ్రహాలు, ద్వారపాలకుల విగ్రహాలు, గర్భగుడి ప్రాంతం, శయనమందిరం, అంతఃప్రాకారాలు, హుండీ లెక్కింపు ప్రాంతం, స్వామివారి పుష్కరిణి, శివాలయం, తెప్పోత్సవం నిర్వహించే చెరువు తదితర నిర్మాణాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రధాన ఆలయం చుట్టూ మాడవీధుల నిర్మాణంలోనూ, గుడి అంతర్గత పనుల్లోనూ జాప్యం జరుగుతున్నదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం దాదాపు ఆరుగంటలపాటు అధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొత్తగా నిర్మిస్తున్నది కాదని, అందుకే ఎలాంటి ప్రారంభోత్సవం ఉండబోదని స్పష్టంచేశారు. పునరుద్ధరణ పనులన్నీ పూర్తయిన తర్వాత శాస్త్రోక్తంగా పూజలు, దర్శనాలు యథావిధిగా పాత పద్ధతిలోనే కొనసాగుతాయని చెప్పారు.

> ‘ప్రధాన ఆలయమున్న గుట్టకింది భాగంలో ప్రస్తుత గండి చెరువును తెప్పోత్సవం నిర్వహించేందుకు వీలుగా తీర్చిదిద్దాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఈ చెరువును నింపేందుకు అనువుగా కాల్వ నిర్మించాలి. మైసూర్ బృందావన్‌గార్డెన్‌లా తీర్చిదిద్దబోతున్న బస్వాపూర్ చెరువు ప్రాంతంలో అధునాతన హరిత రెస్టారెంట్, కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి.
> – ముఖ్యమంత్రి కేసీఆర్

**పనులపై నిర్లక్ష్యం వద్దు**

యాదాద్రి దేవస్థాన పునరుద్ధరణ పనుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు. ‘ప్రధాన ఆలయం పనుల్లో సింహభాగం పూర్తయింది. కొద్దిపాటి పనులే మిగిలాయి. ఆ పనులపై నిర్లక్ష్యం వహించొద్దు. యుద్ధప్రాతిపదికన

మిగతా 2వ పేజీలో

## స్వచ్ఛత దర్పణ్‌లో

# తెలంగాణకు అగ్రస్థానం

### మొదటి ర్యాంకులో నిలిచిన ఆరుజిల్లాలు

- జాబితాలో వరంగల్ అర్బన్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్
- 700 జిల్లాల ర్యాంకులను విడుదలచేసిన కేంద్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్‌లో తెలంగాణ సత్తాచాటింది. స్వచ్ఛత దర్పణ్ మూడోదశ ర్యాంకుల్లో ఆరు జిల్లాలు తొలిస్థానంలో నిలిచాయి. దేశవ్యాప్తంగా 700 జిల్లాల స్వచ్ఛత దర్పణ్ –3 ర్యాంకుల వివరాలను కేంద్ర తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యశాఖ శనివారం విడుదల చేసింది. మొదటి ర్యాంకులో వరంగల్ అర్బన్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలు ఉన్నాయి. గుజరాత్‌లోని ద్వారక, హర్యానాలోని రేవరీ జిల్లాలు కూడా తొలిస్థానంలో నిలిచాయి. పూర్తిస్థాయిలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పరిశీలన, నిర్వహణ, జియోట్యాగింగ్, సామూహిక మరుగుదొడ్లు, సేంద్రియ ఎరువుల తయారీకితీసిన గుంతలు,




ఇంకుడుగుంతలు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై అవగాహన పెంచడం వంటి అంశాల్లో ఉత్తమ పనితీరును దేశవ్యాప్తంగా బేరీజువేసి స్వచ్ఛత దర్పణ్ –3 ర్యాంకులను ప్రకటించారు.

**రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సత్ఫలితాలు**

2011 జనాభా లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో గ్రామీణ కుటుంబాల సంఖ్య 42,33,614గా ఉన్నది. 2014 వరకు 11,56,286 కుటుంబాలకు మాత్రమే మరుగుదొడ్డి సౌకర్యం ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నది. మరుగుదొడ్ల

మిగతా 3వ పేజీలో

## నేడు, రేపు ఓ మోస్తరు వర్షాలు

పశ్చిమబెంగాల్‌లో ఉపరితల ఆవర్తనం

నేడు అల్పపీడనంగా మారే అవకాశం ■ హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

2

# మానేరుకు కాళేశ్వరం

### కొనసాగుతున్న నీటి ఎత్తిపోతలు

నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో నిరంతరంగా నడుస్తున్న మోటర్లు

మధ్యమానేరుకు తరలుతున్న జలాలు

**హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–2లో నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. నంది (నందిమేడారం), గాయత్రి (లక్ష్మీపూర్) పంప్‌హౌస్‌లలో మోటర్లు నిరంతరంగా నడుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి ఆరోప్యాకేజీ పెద్దపల్లి జిల్లా నంది పంప్‌హౌస్‌లోని 1, 2, 3 మోటర్ల ద్వారా నంది రిజర్వాయర్‌ను నింపుతున్న అధికారులు, తాజాగా శనివారం ఉదయం 10.30 గంటల నుంచి నంది పంప్‌హౌస్‌లో మూడో మోటర్‌ను ఆఫ్‌చేసి, నాలుగో మోటర్‌ను ఆన్‌చేశారు. ఇక్కడినుంచి వచ్చే నీరు ఏడో ప్యాకేజీ నంది రిజర్వాయర్‌కు చేరుతుండగా, ఎప్పటికప్పుడు ఎనిమిదో ప్యాకేజీ కరీంనగర్ జిల్లా రామడుగు గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. శనివారం ఆరు గేట్లు తెరిచి నీటిని విడుదలచేశారు. గాయత్రి పంప్‌హౌస్‌లో గత ఆదివారం నుంచి రెండు బాహుబలి మోటర్లను విడుతలవారీగా వెట్ ట్రయల్‌రన్ చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఐదో మోటర్, రాత్రి 7 గంటల నుంచి నాలుగో మోటర్ నిరంతరంగా నడిపిస్తూ, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు జలాశయానికి నీటిని తరలిస్తున్నారు. వరదకాల్వ ద్వారా ప్రాజెక్టుకు నీళ్లు చేరుతుండగా, గాయత్రి పంప్‌హౌస్ నుంచి 1.4 టీఎంసీలు వచ్చినట్లు మధ్యమానేరు ఈఈ అశోక్‌కుమార్ చెప్పారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు మిడ్‌మానేరు స్లూయిజ్ గేట్ల నుంచి నీటిని వదలగా, శనివారానికి ఎల్ఎండీకి స్వల్పంగా వరద వచ్చింది.

**గోదావరి వరద తగ్గుముఖం**

గోదావరి వరద కొంత తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ఒక్కసారిగా గోదావరిలో ప్రవాహం పెరిగిన క్రమంలో పేరూరు దగ్గర తొమ్మిదిన్నర లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం

మిగతా 3వ పేజీలో



కరీంనగర్ జిల్లా గాయత్రి పంప్‌హౌస్ వద్ద డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న జలాలు

## ఇక నిల్వల దిశగా..

మూడునాలుగు రోజుల్లో తగ్గనున్న వరద ప్రవాహం

- కృష్ణాబేసిన్‌లో ఎగువ ప్రాజెక్టులకు తగ్గిన ఇన్‌ఫ్లో
- జలాశయాలను నింపే పనిలో అధికారులు
- ప్రాజెక్టుల వద్ద అవుట్‌ఫ్లోల నియంత్రణ

3

## ధర్మగంట


# ఇనాం భూములు అన్యాక్రాంతం

9

ఇతరుల పేరిట పట్టాచేసిన రెవెన్యూ అధికారులు

- ఐదు దశాబ్దాలుగా తిరుగుతున్న మంచిర్యాల జిల్లా బాధితులు
- కోర్టుకు వెళ్లండంటూ రెవెన్యూ సిబ్బంది ఉచిత సలహా
- ‘ధర్మగంట’ను ఆశ్రయించిన లబ్ధిదారుల వారసులు




**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 79.00 | రిటైల్ లైవ్ | 101.00 |
| డ్రెస్‌డ్ | 146.00 | స్కిన్‌లెస్ | 167.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 337.00 | రంగారెడ్డి | 337.00 |
| మెదక్ | 337.00 | కరీంనగర్ | 340.00 |
| వరంగల్ | 340.00 | చిల్లర ధర | 3.95 |

• సండే స్పెషల్



# పొప్పడి ఆకుతో డెంగీకి చెక్!

- మూడుపూటలా రసంతో ప్లేట్‌లెట్స్ పెరుగుదల ■ ఆకులోని క్షారగుణంతో డెంగీ వైరస్ నాశనం
- యాంటీవైరస్‌లా పనిచేస్తుందంటున్న ఆయుర్వేదం ■ మార్కెట్‌లో అందుబాటులోకి ఆకు రసం ట్యాబ్లెట్లు

మానవాళికి ప్రకృతి ప్రసాదించిన అనేక వరాల్లో పొప్పడి (బొప్పాయి) ఒకటి. దీని పండ్లు అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తే, పొప్పడి ఆకు దివ్య ఔషధంగా పనిచేస్తూ ప్రాణాలను కాపాడేశక్తి కలిగి ఉన్నది! రోజుల వ్యవధిలోనే ప్రాణాలను హరించే భయంకరమైన డెంగీ జ్వరానికి పొప్పడి ఆకు విరుగుడుగా పనిచేస్తున్నది! అల్లోపతి వైద్యం దీన్ని ధ్రువీకరించకపోయినా, పొప్పడి ఆకు రసాన్ని తీసుకున్నవారిలో ప్లేట్‌లెట్స్ సంఖ్య పెరుగుతున్నది.

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

పొప్పడి పండు అనేక రకాలుగా ప్రయోజనకారి. ఇది ప్రమాదకరమైన క్యాన్సర్‌తోపాటు మధుమేహం, కొలెస్ట్రాల్ నివారణతోపాటు అనేక అనారోగ్య సమస్యలను దూరంచేస్తుందని అధ్యయనాల్లో తేలింది. దీని ఆకులు కూడా పూర్తిగా ఔషధగుణాలు కలిగి ఉన్నాయి. రోజుల వ్యవధిలోనే శరీరంలోని రక్తకణాలు (ప్లేట్‌లెట్స్) తగ్గిపోయి ప్రాణాలు కోల్పోవడానికి కారణమవుతున్న డెంగీ జ్వరానికి పొప్పడి ఆకులు విరుగుడుగా పనిచేస్తున్నాయి. అడిస్ ఈజిప్టి అనే ఆడ దోమ కుట్టడంతో డెంగీ వైరస్ మనిషి శరీరంలోకి ప్రవేశించి రక్తకణాలను హరిస్తుంది. డెంగీ జ్వరానికి వెంటనే చికిత్స తీసుకోకుంటే శరీరంలోని రక్తకణాలు తగ్గి మరణం సంభవిస్తుంది. సాధారణంగా మానవ శరీరంలో లక్షన్నర నుంచి నాలుగున్నర లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కంటే తగ్గుతున్నకొద్దీ రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయే ప్రమాదమున్నది. ప్లేట్‌లెట్స్ సంఖ్య పెంచేందుకు ఆరోగ్యవంతుల రక్తం నుంచి సేకరించి రోగికి ఎక్కిస్తున్నారు. ఇది ఖర్చుతో

మిగతా 2వ పేజీలో



యాదాద్రి కొండపై బాలాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి సేవలో పాల్గొని హారతి తీసుకుంటున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్



శనివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ పునరుద్ధరణ పనులు పరిశీలించి ఆర్కిటెక్ట్ ఆనందసాయికి సూచనలుచేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఆలయ ఈవో గీత తదితరులు ఉన్నారు.



యాదాద్రి తిరుమాడ వీధుల్లో నిర్మాణ శిల్పసౌందర్యాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# వేగంగా యాదాద్రి

మొదటిపేజీ తరువాయి...

పనులు పూర్తిచేయాలి. ఇకపై రహదారుల, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రతివారం యాదాద్రిలో పర్యటించి, పనుల పురోగతిని నేరుగా పర్యవేక్షిస్తారు. ప్రధాన ఆలయం పనులతోపాటు రింగురోడ్డు నిర్మాణం, ప్రెసిడెన్షియల్ సూట్స్, కాటేజీలు, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులన్నీ రాబోయే 2-3 నెలల్లో పూర్తిచేయాలి. టెంపుల్‌సిటీలో 250 కాటేజీలు నిర్మించాలి. దీనికోసం దాదాపు రూ.400 కోట్ల విరాళాలు ఇవ్వడానికి వివిధ కార్పొరేట్ సంస్థలు, దాతలు సిద్ధంగా ఉన్నారు. కాబట్టి వెంటనే కాటేజీల డిజైన్లు రూపొందించాలి. కాటేజీల నిర్మాణం ప్రారంభించాలి. భూసేకరణ త్వరగా పూర్తిచేసి ప్రధాన రహదారులన్నీ వెడల్పుగా నిర్మించాలి' అని సీఎం కేసీఆర్ చెప్పారు. 'ప్రధాన ఆలయమున్న గుట్టకింది భాగంలో ప్రస్తుత గండి చెరువును తెప్పోత్సవం నిర్వహించేందుకు వీలుగా తీర్చిదిద్దాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఈ చెరువును నింపేందుకు అనువుగా కాల్వ నిర్మించాలి. చెరువు కిందిభాగంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా కల్యాణకట్టలు, నీటి కొలనులు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటుచేయాలి. గుట్టకింది భాగంలోనే బస్టాండు, ఆటోస్టాండ్, పార్కింగ్, ఫైర్ స్టేషన్, పోలీస్ ఔట్‌పోస్టు, అన్నదాన సత్రాలు ఏర్పాటుచేయాలి. ఈ పనులన్నీ వెంటనే చేపట్టి త్వరగా పూర్తిచేయాలి. మైసూర్ బృందావన్‌గార్డెన్‌లా తీర్చిదిద్దబోతున్న బస్వాపూర్ చెరువు ప్రాంతంలో అధునాతన హరిత రెస్టారెంట్, కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. పునరుద్ధరణ పనులు పూర్తయిన తర్వాత బస్సుల ద్వారా భక్తులను గుట్టపైకి చేర్చాలి. దీనికోసం గుట్టపైన బస్‌బే నిర్మించాలి' అని సీఎం కేసీఆర్ సూచించారు.



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ ముఖమండపంలో నిర్మాణాలను పరిశీలించి సూచనలిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

### యాగానికి ఏర్పాట్లు చేయాలి

వచ్చే ఫిబ్రవరిలో యాదాద్రిలో మహా సుదర్శనయాగం నిర్వహించాలని భావిస్తున్నట్టు సీఎం కేసీఆర్ తెలిపారు. 'మూడువేల మంది రుత్వికులు, మూడువేల మంది వేదపారాయణదారులు, మరో మూడువేల మంది సహాయకులు ఇందులో పాల్గొంటారు. 1,048 కుండాలు ఏర్పాటుచేసి యాగం నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు, వివిధరాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ఇతర ప్రముఖులు, 45 దేశాల నుంచి వేదపండితులు, అర్చకులు, దేశ నలుమూలల నుంచి ప్రతీరోజు లక్షలమంది భక్తులు తరలివస్తారు. వీరందరికీ కావాల్సిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది' అని సీఎం చెప్పారు. ప్రధాన ఆలయ పునరుద్ధరణ పనుల కోసం రూ.235 కోట్లు, రహదారుల నిర్మాణానికి భూసేకరణ జరుపడానికి రూ.109 కోట్లు, టెంపుల్ సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.103 కోట్లు వ్యయంచేశాం. ఆలయ అభివృద్ధి, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ అభివృద్ధి, టెంపుల్ సిటీ నిర్మాణం, దేవాలయ నిర్మాణం, భక్తులకు ఏర్పాట్లు తదితర పనుల కోసం ఇప్పటివరకు రూ.692 కోట్లు వెచ్చించాం' అని సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్, వైటీడీఏ స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు, ఆలయ ఈవో గీత, ఆలయ శిల్పి ఆనంద్‌సాయి, ప్రభుత్వ నిర్మాణ సలహాదారుడు సుధాకర్ తేజ, ఆర్ అండ్‌బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఎం కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అణువణువూ పరిశీలించిన సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ శనివారం యాదాద్రిలో సుమారు తొమ్మిది గంటలపాటు గడిపారు. పునరుద్ధరణ పనులను నిశితంగా పరిశీలించారు. ఉదయం 11.30 గంటలకు యాదాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి రాత్రి 8:15 గంటల వరకు యాదాద్రిలోనే ఉండి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూడుగంటలపాటు యాదాద్రి నిర్మాణాలను పరిశీలించారు. దాదాపు ఆరుగంటలపాటు పునరుద్ధరణ పనులపై సమీక్ష నిర్వహించారు. తొలుత యాదాద్రి చుట్టూ ప్రగతి రథంలో సుమారు 20 నిమిషాలపాటు పర్యటించారు. రింగ్‌రోడ్డు, ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మాణం, స్వామివారి తెప్పోత్సవం కోసం నిర్మితమవుతున్న గండి చెరువును, రింగ్‌రోడ్డు సర్కిల్, పార్కులను పరిశీలించారు. మినీబస్సులో యాదాద్రి కొండపైకి చేరుకొని బాలాలయంలో లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం ప్రధానాలయం ఉన్న ప్రాంతంలో 14.5 ఎకరాల్లో ప్రధాన పునరుద్ధరణ పనులను పరిశీలించారు. గత ఫిబ్రవరి మూడోతేదీన యాదాద్రికి వచ్చిన సీఎం కేసీఆర్, ఆరు నెలల వ్యవధిలో రెండోసారి పర్యటించారు.

# వినోద్‌కుమార్‌కు అభినందనల వెల్లువ



రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను అభినందిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో మాజీ ఎంపీలు సీతారాంనాయక్, గుండు సుధారాణి తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన బోయినపల్లి వినోద్‌కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని వినోద్‌కుమార్ నివాసానికి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికాసంఘం ఉపాధ్యక్ష పదవి కీలకమైనదని అన్నారు. వినోద్‌కుమార్‌ను కలిసి అభినందించినవారిలో రాజ్యసభసభ్యుడు బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, నవీన్‌రావు, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, రసమయి బాలకిషన్, భాస్కర్‌రావు, ఆరూరి రమేశ్, దాసరి మనోహర్‌రెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్, గుండు సుధారాణి, జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, నేషనల్ లేబర్ కో ఆపరేటివ్స్ ఫెడరేషన్‌బోర్డు సభ్యురాలు దండుగుల రాజ్యలక్ష్మి తదితరులున్నారు. టీఎస్‌ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ దామోదర్‌గుప్తా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అక్బర్‌హుస్సేన్, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ లోక బాపురెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, రాష్ట్ర వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి, టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, టీఎస్‌టీఎస్సీ మాజీ చైర్మన్ రాకేశ్, మహిళా ప్రతినిధులు ముక్తవరం సుశీలారెడ్డి, మూల విజయారెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ తదితరులు అభినందించినవారిలో ఉన్నారు. సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ఉన్నత విద్యామండలి సభ్యుడు నర్సింహారెడ్డి తదితరులు బోయినపల్లిని అభినందించారు. టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, కరీంనగర్ అధ్యక్షుడు ఎం జగదీశ్వర్ తదితరులు వినోద్‌కుమార్‌ను అభినందించి శాలువాతో సన్మానించారు.

# రైల్వే బడ్జెట్‌ను పునరుద్ధరించాలి: వినోద్

**ఖైరతాబాద్:** రెండేండ్ల క్రితం రద్దుచేసిన రైల్వే బడ్జెట్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రైల్వే బడ్జెట్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ ఆడిటోరియంలో శనివారం రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అలసత్వం వల్ల తెలంగాణలోని జిల్లా కేంద్రాలకు రైలు రవాణా వ్యవస్థ లేకపోయిందని విమర్శించారు. ఈ సదస్సులో రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్, మాజీ ఎంపీలు గుండు సుధారాణి, సీతారాంనాయక్, అరుణోదయ విమలక్క తదితరులు పాల్గొన్నారు.

**ఐఈఐ శతవసంతోత్సవాలకు సీఎం కేసీఆర్**

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా శతవసంతోత్సవాలకు సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఐఈఐ కార్యదర్శి టీ అంజయ్య తెలిపారు. ఈ విషయంలో చొరవ చూపాలని మంత్రి కొప్పుల ఈశ్వర్, బీ వినోద్‌కుమార్‌కు విజ్ఞప్తిచేశారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.03 గంటలకు

సూర్యాస్తమయం: 6.37 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, తదియ, నక్షత్రం: పూర్వాభాద్ర సాయంత్రం 4.55 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, అమృతఘడియలు: ఉదయం 7.55 నుంచి 9.31 వరకు, రాహుకాలం: సాయంత్రం 5.02 నుంచి 6.37 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.56 నుంచి 5.46 వరకు, వర్జ్యం: లేదు.

# సొంతింటి కల తీర్చడమే ధ్యేయం



శనివారం కామారెడ్డి జిల్లా పాత బాన్సువాడలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

## బాన్సువాడలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభోత్సవంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లు పేదల ఆత్మగౌరవానికి చిహ్నాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని పాత బాన్సువాడలో రూ.2.8 కోట్ల వ్యయంతో నిర్మించిన 40 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేవని, ఒక్క టీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇస్తున్నదని చెప్పారు. బాన్సువాడ నియోజకవర్గానికి నాలుగు వేల ఇండ్లు మంజూరయ్యాయని, ఇందులో ఇప్పటివరకు వెయ్యికిపైగా నిర్మించి పేదలకు అందించామని తెలిపారు. అనంతరం స్పీకర్ పోచారం స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం చిత్రపటాలకు హరిజనవాడ యూత్ సభ్యులు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు.

# నేడు, రేపు ఓ మోస్తరు వర్షాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పశ్చిమబెంగాల్, దానిని ఆనుకుని ఉన్న బంగ్లాదేశ్ ప్రాంతాల్లో 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఇది పశ్చిమబెంగాల్, దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నదని చెప్పారు. వీటి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల ఆది, సోమవారాల్లో ఓ మోస్తరు వర్షాలు కురువొచ్చని పేర్కొన్నారు. కాగా, శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా మహబూబాబాద్‌లో 5 సెం.మీ.వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లా నూతనకల్, మహబూబాబాద్ జిల్లా బయ్యారం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లిలో 3 సెం.మీ. చొప్పున, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు, అశ్వాపురం, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్, ఖమ్మం జిల్లా కూసుమంచిలో 2 సెం.మీ. చొప్పున వర్షం పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన**

రాగల 24 గంటల్లో గ్రేటర్‌లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అధికారులు తెలిపారు.

**లోకం పోకడ**



# పొప్పడి ఆకుతో డెంగీకి చెక్!

మొదటిపేజీ తరువాయి...

కూడుకున్న పని. డెంగీ ప్రమాద తీవ్రత తెలుసుకొనేందుకు అనేక రకాల పరీక్షలు అవసరమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో డెంగీ జ్వరంతో దవాఖానకు వెళ్లిన రోగి, లక్షల రూపాయలు ఖర్చుపెడితే తప్ప నయమయ్యే పరిస్థితిలేదు. కానీ, ప్రకృతి ప్రసాదించిన పొప్పడి ఆకులతో డెంగీ జ్వరాన్ని జయించవచ్చు. రక్తకణాలను తగ్గించే లేదా ఉత్పత్తికాకుండా అడ్డుకునే డెంగీ వైరస్‌ను పొప్పడి ఆకుల్లోని క్షారగుణం క్షీణింపచేస్తుందని ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ తెలిపారు. ఆకులోని పాపిన్, కార్పైన్ ఎంజైమ్స్ రక్తకణాల ఉత్పత్తికి తోడ్పడుతాయి. పొప్పడి ఆకులను శుభ్రంచేసి రసం తీసి నిత్యం 20 నుంచి 30 ఎంఎల్ చొప్పున మూడుపూటలా తీసుకొంటే ఫలితం ఉంటుంది. క్యారిపిల్, పెపియరో తదితర పేర్లతో ట్యాబ్లెట్లు సైతం మార్కెట్లో లభిస్తున్నాయి. ఆకు రసంతో ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతుందని, డెంగీ జ్వరం తగ్గడానికి పూర్తిస్థాయి చికిత్స అవసరమని వైద్యులు చెప్తున్నారు.



ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో పొప్పడి ఆకులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్

### యాంటీవైరస్‌లా పనిచేస్తుంది

సాధారణంగా పొప్పడి ఆకులో విటమిన్ -కేతోపాటు క్షారగుణం ఉంటుంది. విటమిన్-కే శరీరంలో ఐరన్ సంగ్రహణాన్ని పెంచి రక్తకణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. క్షారగుణం యాంటీవైరస్‌లా పనిచేస్తుంది. పొప్పడి ఆకులు త్రాంబోసైటోపీనియాను (ప్లేట్‌లెట్లు తగ్గిపోయే స్థితి) నయం చేస్తుంది.

**- డాక్టర్ రవీందర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యకళాశాల ప్రిన్సిపాల్**

### అది మాత్రమే చికిత్స కాదు



పొప్పడి ఆకు రసంతో ప్లేట్‌లెట్ల సంఖ్య పెరిగి డెంగీ నయమవుతుందని నిర్ధారించలేదు. కానీ, ఇటీవలి అధ్యయనాల్లో పొప్పడి ఆకు రసంతో 10 నుంచి 20 శాతం ఉపశమనం కలుగుతున్నదని తేలింది. డెంగీ రోగికి పొప్పడి రసం తాగించడమే చికిత్స కాదు. ప్రభుత్వ వైద్యులెవరూ దీన్ని సూచించడంలేదు. అలాగని ఆ రసం తీసుకుంటే వచ్చే నష్టమూ లేదు.

**- డాక్టర్ కొండల్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, ఉస్మానియా దవాఖాన**

# 14 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పలువురు కమిషనర్లను బదిలీచేస్తూ శనివారం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. టీ కృష్ణమోహన్‌రెడ్డి నార్సింగి నుంచి బండ్లగూడ, బీ సుమన్‌రావు జీహెచ్‌ఎంసీ నుంచి మీర్‌పేట, సీ సత్యబాబు మిర్యాలగూడ నుంచి బడంగ్‌పేట్, కే అలివేలు మంగతాయారు జీహెచ్‌ఎంసీ నుంచి పీర్జాదిగూడ, ఎన్ శంకర్ మణికొండ నుంచి బోడుప్పల్, సీ అరుణకుమారి ఇబ్రహీంపట్నం నుంచి జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. జీ శ్రీనివాస్‌రెడ్డి బడంగ్‌పేట్ నుంచి నార్సింగి, ఎస్ జయంత్ జీహెచ్‌ఎంసీ నుంచి మణికొండ, ఇషాక్ ఏబీ ఖాన్ నిజాంపేట నుంచి ఇబ్రహీంపట్నం, జీ రఘు జవహర్‌నగర్ నుంచి పోచారం, వీ సమ్మయ్య మెదక్ నుంచి సిరిసిల్ల, కే శ్రీహరి మీర్‌పేట నుంచి మెదక్ మున్సిపాలిటీకి, ఏ వాణి (పీర్జాదిగూడ), ఆర్ ఉపేందర్‌రెడ్డి (బోడుప్పల్) ఇద్దరినీ జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు.



శనివారం జుడిషియల్ అకాడమీలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

## మానవ అక్రమరవాణాను అడ్డుకోవాలి

### హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మానవ అక్రమరవాణాను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్' అనే అంశంపై శనివారం రాష్ట్ర జుడిషియల్ అకాడమీలో నిర్వహించిన జుడిషియల్ అధికారుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఆధునికయుగంలో మనుషుల అక్రమరవాణా కొనసాగడం అమానుషమన్నారు. చట్టాల్లోని నిబంధనలను సక్రమంగా అమలుచేయడం ద్వారా ఈ సమస్యను ఎదుర్కోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు, జస్టిస్ పీ నవీన్‌రావు, యునిసెఫ్ పిల్లల భద్రత నిపుణులు సోనీజార్జ్, రోడ్డు భద్రత అథారిటీ చైర్మన్ డీజీ టీ కృష్ణప్రసాద్, ఐఏఎస్‌లు ఎం జగదీశ్వర్, అహ్మద్ నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

## నౌలీ ప్రాజెక్టుకు ఒప్పుకోం

- కర్ణాటక ప్రతిపాదనతో ఆర్డీఎస్‌పై తీవ్రప్రభావం
- తుంగభద్ర బోర్డు సమావేశంలో తెలంగాణ స్పష్టీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తుంగభద్ర నదిపై నౌలీ గ్రామం వద్ద 40 టీఎంసీల సామర్థ్యంతో కర్ణాటక ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ప్రాజెక్టుకు ఒప్పుకోబోమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టంచేసింది. రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్)కు బచావత్ ట్రిబ్యునల్ 15.90 టీఎంసీల నీటిని కేటాయించినప్పటికీ.. ఐదారు టీఎంసీలకు మించి రావడంలేదని, ఈ నేపథ్యంలో నౌలీ ప్రాజెక్టును నిర్మిస్తే ఆర్డీఎస్‌పై తీవ్రమైన ప్రభావం పడుతుందని తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు శనివారం బెంగళూరులో జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో పేర్కొన్నారు. తుంగభద్ర బోర్డు చైర్మన్ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మురళీధర్‌రావు మాట్లాడుతూ.. సముద్రమట్టానికి 1,625 అడుగుల ఎత్తున నిర్మించతలపెట్టిన నౌలీ ప్రాజెక్టుకు ఒప్పుకొనే ప్రసక్తేలేదని, తొలుత ఆర్డీఎస్‌కు కేటాయించిన 15.90 టీఎంసీల నీరుపై తెలంగాణకు పూర్తి భరోసా ఇవ్వాలని తేల్చిచెప్పారు. దీనిపై బోర్డు చైర్మన్ తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ అభిప్రాయాన్ని తీసుకున్నారు. తుంగభద్రపై కర్ణాటక ఎన్ని ప్రాజెక్టులను నిర్మించిందనే వివరాలను అందజేయలేదని తెలంగాణ ఈఎన్సీ చెప్పారు. నౌలీ ప్రాజెక్టు వల్ల తమ వాటాకూ నష్టం వాటిల్లుతుందని ఏపీ జలవనరులశాఖ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ సమావేశంలో బోర్డు కార్యదర్శి నాగమోహన్, కేంద్ర జలవనరులశాఖ అధికారి జగన్‌మోహన్‌గుప్తా (ఫైనాన్స్) పాల్గొన్నారు.



# ఇక నిల్వల దిశగా..

### జలాశయాలను నింపే పనిలో అధికారులు ■ ఎగువ ప్రాజెక్టులకు తగ్గిన ఇన్‌ఫ్లో ■ అవుట్‌ఫ్లోను నియంత్రిస్తున్న ఇంజినీర్లు

- ఆల్మట్టి, నారాయణపుర, జూరాలకు తగ్గిన వరద
- శ్రీశైలం వద్ద మాత్రం కొనసాగుతున్న భారీ ఇన్‌ఫ్లో
- పులిచింతల, ప్రకాశం బరాజ్‌ల వద్ద కృష్ణమ్మ పరవళ్లు
- మూడునాలుగు రోజుల్లో తగ్గనున్న వరద ప్రవాహం



శనివారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమీపంలో సందర్శకుల తాకిడి పెరగడంతో స్తంభించిన ట్రాఫిక్



సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో కిలోమీటర్ మేర వ్యాపించిన కృష్ణమ్మ

**హైదరాబాద్/ మహబూబ్‌నగర్, నల్లగొండ ప్రధాన ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:**

కృష్ణానదిపై ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. భీమా నదికి కూడా వరదఉధృతి తగ్గుతున్నది. ఫలితంగా జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు తగ్గుతున్నాయి. కృష్ణాబేసిన్‌లలోని నదులన్నింటిలో వరద తగ్గుతున్నదని, ఆదివారానికి మరింత తగ్గే అవకాశం ఉన్నదని సీడబ్ల్యూసీ పేర్కొంటున్నది. ఈ నేపథ్యంలో లోటు నిల్వను భర్తీచేసేందుకు ఆయా ప్రాజెక్టుల అధికారులు చర్యలు ప్రారంభించనున్నారు. ఆల్మట్టి, నారాయణపుర, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులను పూర్తిస్థాయి నీటిమట్టానికి తీసుకువచ్చేందుకు మరికొన్ని టీఎంసీలు నిల్వ చేయాల్సి ఉన్నది. తుంగభద్ర డ్యామ్‌లో పూర్తిస్థాయిలో నీటి నిల్వ, నీటిమట్టాలను కొనసాగిస్తున్నారు. ఎగువనుంచి ఇంకా వరద వచ్చే అవకాశం ఉన్నందున శ్రీశైలం ప్రాజెక్టు రాత్రి 11 గంటల సమయానికి 881.80 అడుగుల వద్ద దాదాపు 198 టీఎంసీల సామర్థ్యంతో ఉంచారు. మూడునాలుగు రోజుల క్రితం వరకు కృష్ణ, భీమా, తుంగభద్ర నుంచి వచ్చిన వరద ప్రభావం శ్రీశైలం వద్ద ఇంకా కనిపిస్తున్నది. రాత్రి 11 గంటలకు 7.95 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నా.. ఎగువ నుంచి వరద తగ్గుతున్నందున రాబోయే మూడునాలుగు రోజుల్లో శ్రీశైలానికి సైతం వరద తగ్గే అవకాశం కనిపిస్తున్నదని అధికారులు చెప్తున్నారు. ఈ సీజన్‌లో 20 రోజుల వ్యవధిలోనే జూరాల నుంచి 673 టీఎంసీల జలాలు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరాయి. గత ఏడాది మొత్తంగా వరద 330 టీఎంసీలు మాత్రమే కావటం గమనార్హం. ఇంకా అక్టోబర్ వరకు వరద వచ్చే అవకాశం ఉన్నందున ఈసారి జూరాల నుంచి రికార్డుస్థాయిలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద జలాలు వెళ్లే అవకాశం కనిపిస్తున్నది. నాగార్జునసాగర్ డ్యాం క్రస్ట్‌గేట్ల ద్వారా ఆరురోజులపాటు 200 టీఎంసీల నీటిని విడుదలచేశారు. ఇదిలాఉంటే.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు శనివారం కూడా సందర్శకులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. ఆదివారం ఈ సంఖ్యమరింత పెరుగొచ్చు.

### జలసాగరం

నాగార్జునసాగర్‌కు శ్రీశైలం నుంచి భారీగానే వరద కొనసాగుతున్నది. ప్రస్తుతం జలాశయంలో 312.05 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యానికిగాను 302 టీఎంసీల నిల్వను నిర్వహిస్తున్న అధికారులు దాదాపు 16-17 వేల క్యూసెక్కులను తాగు, సాగునీటికి వినియోగిస్తున్నారు. దాదాపు 6 లక్షల క్యూసెక్కులకు పైగా వరదను దిగువకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టులో 36.46 టీఎంసీల నిల్వ (పూర్తిస్థాయి సామర్థ్యం 45.77 టీఎంసీలు)ను నిర్వహిస్తూ దిగువన ప్రకాశం బరాజ్‌కు 6.62 లక్షల క్యూసెక్కులకుపైగా విడుదల చేస్తున్నారు. ప్రకాశం బరాజ్‌కు మరో రెండుమూడ్రోజులపాటు భారీ వరద కొనసాగే అవకాశాలున్నాయని అధికారులు చెప్తున్నారు. వారం వ్యవధిలోనే దాదాపు 155 టీఎంసీలకుపైగా జలాలు సముద్రంలో కలిశాయి.

### ముంపుబారిన ఏపీ గ్రామాలు

ప్రకాశం బరాజ్‌కు వచ్చిన నీటిని వచ్చినట్టే వదులుతుండటంతో గుంటూరు, కృష్ణాజిల్లాల్లోని దాదాపు 87 గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నదీపరివాహక ప్రాంతంలోని గ్రామాలన్నీ జలదిగ్బంధమయ్యాయి. ఏపీ ప్రభుత్వం సహాయ చర్యలను ముమ్మరం చేసింది.

**కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో శనివారంనాటి నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1700.59 | 129.72 | 106.83 | 4,45,200 | 4,20,000 |
| నారాయణపుర | 1615.00 | 1607.61 | 37.64 | 28.06 | 3,80,000 | 3,42,040 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 12,351 | 8,450 |
| జూరాల | 1045.00 | 1041.73 | 9.66 | 7.81 | 5,48,000 | 5,39,971 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.86 | 78,726 | 78,676 |
| శ్రీశైలం | 885.00 | 881.80 | 215.81 | 197.91 | 7,95,608 | 6,57,932 |
| నాగార్జునసాగర్ | 590.00 | 586.40 | 312.052 | 302.39 | 7,53,665 | 6,09,637 |
| పులిచింతల | 175.00 | 169.28 | 45.77 | 36.46 | 6,62,537 | 6,62,537 |



బడ్జెట్ ప్రతిపాదనలపై శనివారం వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

## బడ్జెట్ ప్రతిపాదనలు పంపండి

### శాఖలవారీగా అధికారులకు సీఎస్ జోషి ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అన్ని ప్రభుత్వ శాఖలు 2019-20 ఏడాది బడ్జెట్ కేటాయింపులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే ఆర్థికశాఖకు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. శనివారం బడ్జెట్ ప్రతిపాదనలపై వివిధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బడ్జెట్ సమావేశాలు సెప్టెంబర్‌లో జరిగే అవకాశం ఉన్నదని, సీఎం కేసీఆర్ త్వరలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి శాఖ ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రులతో సమీక్షలు పూర్తిచేసి ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రతిపాదనలలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలను ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు వివరించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్‌తివారీ, చిత్రా రామచంద్రన్, అధర్‌సిన్హా, సోమేశ్‌కుమార్, శాంతకుమారి, ముఖ్యకార్యదర్శులు సునీల్‌శర్మ, జయేశ్‌రంజన్, పార్థసారథి, వికాస్‌రాజ్, సవ్యసాచి ఘోష్, కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, జనార్దన్‌రెడ్డి, బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా, నిరంజన్‌రావు, వాణిజ్య పన్నులు, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్ బొజ్జా, ప్రొటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆబ్కారీశాఖ అంచనాలపై సమీక్ష**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆబ్కారీ శాఖ బడ్జెట్ అంచనాలపై శనివారం హైదరాబాద్‌లోని ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఆబ్కారీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్, ఉన్నతాధికారులు అజయ్‌రావు, హరికిషన్, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

## మానేరుకు కాళేశ్వరం


మొదటిపేజీ తరువాయి...


కొనసాగింది. శనివారం ఉదయానికి అది ఏడున్నర లక్షల క్యూసెక్కులకు తగ్గింది. శుక్రవారం ధవళేశ్వరం దగ్గర మూడున్నర లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో మాత్రమే నమోదైనా.. శుక్రవారం ఎగువన వరద పెరుగటంతో శనివారం ఇన్‌ఫ్లో ఐదున్నర లక్షల క్యూసెక్కులకు పెరిగింది. అధికారులు అంతేమేర సముద్రంలోకి నీటిని పంపిస్తున్నారు. ఈ నీటిసంవత్సరంలో శనివారం ఉదయం వరకు 1418 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి. కాగా ఎగువన ఉన్న గోదావరి ప్రాజెక్టులకు స్వల్పంగానే వరద వస్తున్నది. శ్రీరాంసాగర్‌కు శనివారం సాయంత్రం ఆరు గంటలకు చుక్క కూడా వరద నమోదుకాలేదు. కడెంకు 1384 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తుండగా.. ఎల్లంపల్లికి ఇన్‌ఫ్లో ఏమాత్రం లేదని అధికారులు పేర్కొన్నారు.

**గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులలో శనివారంనాటి నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| సింగూరు | 1717.93 | 1670.46 | 29.91 | 0.46 | 0 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.37 | 17.80 | 0.14 | 0 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1062.90 | 90.31 | 17.18 | 0 | 389 |
| లోయర్‌మానేరు | 920.00 | 882.90 | 24.07 | 3.55 | 634 | 206 |
| మిడ్‌మానేరు | 1043.31 | 997.70 | 25.873 | 4.50 | 6348 | 83 |
| కడెం | 700.00 | 697.15 | 7.60 | 6.88 | 1384 | 818 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.61 | 20.18 | 19.09 | 0 | 0 |



శనివారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని లోయర్ మానేరు డ్యాం

### భద్రాద్రి వద్ద తగ్గుతున్న వరద

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ పాల్వంచ రూరల్:** భద్రాచలం వద్ద గోదావరిలో నీటిప్రవాహం శనివారం మరింత తగ్గింది. శుక్రవారం రాత్రి 37.9 అడుగుల వద్ద ఉన్న గోదావరి శనివారం ఉదయానికి 32.9 అడుగులకు చేరుకున్నది. క్రమక్రమంగా గంటగంటకు తగ్గుతూ సాయంత్రం 4 గంటల సమయానికి 31.1 అడుగులకు చేరి నిలకడగా ప్రవహిస్తున్నది. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిధిలోని కిన్నెరసానిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు అధికారులు నాలుగు గేట్లు ఎత్తి 16వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీచేశారు.

## పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

### వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్



జ్యోతిప్రజ్వలనతో ట్రస్మా సమావేశాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

**ముకరంపుర:** పేదప్రజలకు మెరుగైన వైద్యమందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని దాసరి విజయగార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు తగ్గడానికి ప్రభుత్వం కారణం కాదన్నారు. అంతకుముందు ట్రస్మా నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా యాదగిరి శేఖర్‌రావు (కరీంనగర్), ప్రధాన కార్యదర్శిగా ఎస్ మధుసూదన్ (హైదరాబాద్) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుంకె రవిశంకర్, కరీంనగర్ జెడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ పాల్గొన్నారు.

## తెలంగాణకు అగ్రస్థానం


మొదటిపేజీ తరువాయి...


నిర్మాణం, వాడకాన్ని దాదాపు 100 శాతానికి తీసుకొచ్చింది. పెరిగిన కుటుంబాల సంఖ్యకు అనుగుణంగా కొత్త మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందని కేంద్ర ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ నిరంతర పర్యవేక్షణతో ఇప్పుడు స్వచ్ఛత దర్పణ్‌లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది.

### సమిష్టికృషితోనే సాధ్యమైంది

పల్లెలు పరిశుభ్రంగా ఉండాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టిన కార్యాచరణతో మంచి ఫలితాలు వస్తున్నాయి. స్వచ్ఛత దర్పణ్‌లో రాష్ట్రం మంచి తీరు కనబరిచిందని కేంద్ర సర్వేతో తేలింది. జాతీయస్థాయిలో అగ్రస్థానంలో ఎనిమిది జిల్లాలుంటే, అందులో ఆరు జిల్లాలు రాష్ట్రానివే కావడం గర్వకారణం. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టికృషితోనే ఇది సాధ్యమైంది. మరుగుదొడ్ల నిర్మాణంతోపాటువాటి వినియోగంపై అవగాహన కల్పించాం. స్వచ్ఛతదర్పణ్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ సిబ్బంది, డీఆర్డీఏ సిబ్బందికి అభినందనలు.

-ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి

## నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

- ప్రొఫెసర్ నితిన్‌కుమార్ త్రిపాఠి
- ఘనంగా నిట్ 17వ స్నాతకోత్సవం
- 1,528 మందికి పట్టాల ప్రదానం




నిట్ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నితిన్‌కుమార్ త్రిపాఠి

**నిట్‌క్యాంపస్(వరంగల్):** మనలోని ఉత్పాదక సామర్థ్యాన్ని వెలికితీసి, నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని, విద్యార్థి దశలో కొత్త మార్గాలను అన్వేషించాలని నిట్ పూర్వ విద్యార్థి, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ థాయ్‌లాండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నితిన్‌కుమార్ త్రిపాఠి అన్నారు. వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ(నిట్) 17వ స్నాతకోత్సవం శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి నితిన్ కుమార్ త్రిపాఠి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నిట్‌లో 90 శాతం ప్లేస్‌మెంట్‌తో మెరుగైన రికార్డును నెలకొల్పిందని, నిట్ పూర్వ విద్యార్థిగా గర్వపడుతున్నట్టు త్రిపాఠి పేర్కొన్నారు. డైరెక్టర్ ఎన్వీ రమణారావు మాట్లాడుతూ తొంభైకిపైగా పరిశ్రమలతో విద్య, పరిశోధనాంశాల్లో పలు ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. అమెరికా, తైవాన్, మలేషియా, జపాన్ దేశాల్లోని యూనివర్సిటీలతో కూడా ఒప్పందాలు చేసుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా 1,528 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీన్లు కేవీ జయకుమార్, పీ ఆనంద్‌రాజ్, ఎల్ఆర్‌జీ రెడ్డి, వైపైడిశెట్టి, డీవీఎస్ఎస్ శివశర్మ, జీ రాజేశ్‌కుమార్, రిజిస్ట్రార్ ఎస్ గోవర్ధన్‌రావుతోపాటు స్నాతకోత్సవ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



జీవన్‌దాన్ సదస్సులో మాట్లాడుతున్న గాంధీ వైద్యశాల ప్రొఫెసర్ హరిప్రసాద్

## ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ వైద్యం

- గాంధీ వైద్యశాల ప్రొఫెసర్ హరిప్రసాద్
- సిరిసిల్ల జిల్లా దవాఖానలోని డయాలసిస్ సెంటర్ సందర్శన

**సిరిసిల్లటౌన్:** రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందుతున్నాయని గాంధీ వైద్యశాల ప్రొఫెసర్ హరిప్రసాద్ కొనియాడారు. శనివారం సిరిసిల్ల జిల్లా దవాఖానలోని డయాలసిస్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం కిడ్నీ బాధితుల కోసం ఏర్పాటుచేసిన 'జీవన్‌దాన్' అవగాహన సదస్సులో హరిప్రసాద్ మాట్లాడుతూ.. సిరిసిల్లలోని డయాలసిస్ సెంటర్ సేవలు అద్భుతమని కితాబిచ్చారు. గతంలో సిరిసిల్లకు చెందిన కిడ్నీ బాధితులు చికిత్స కోసం కరీంనగర్, హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేదని, ఆ సమయంలో సరైన వసతులు లేక వారు అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక చొరువతో సిరిసిల్ల వైద్యశాలకు డయాలసిస్ సెంటర్ మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భానుప్రకాశ్, టెక్నికల్ ఇన్‌చార్జి కిశోర్, డాక్టర్ అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర నిధులు రావడం లేదు

### ఎంపీ నామాతో మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లితో ఎంపీ నామా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించినస్థాయిలో నిధులు రావడంలేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లిని కలిశారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న నిధులకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు. మిషన్ భగీరథ, హర్ ఘర్ జల్ పథకం కింద కేంద్రం నిధులు కేటాయించాలని పార్లమెంట్ తొలి సమావేశాల్లో ప్రస్తావించానని నామా తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విభజన హామీలపై పోరాడుతానని నామా చెప్పారు.

## కొనసాగుతున్న బీఈడీ కౌన్సెలింగ్

### 22 వరకు సర్టిఫికెట్ల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 22 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. రాష్ట్రంలోని 200 బీఈడీ కాలేజీల్లో మొత్తం 17,550 సీట్లకుగాను కన్వీనర్ కోటాలో 13,455 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

### 26 నుంచి పీఈసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

రాష్ట్రంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో సీట్ల భర్తీకి ఈ నెల 26 నుంచి 28 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కన్వీనర్ తెలిపారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ, వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

**కొత్తగూడెం క్రైం:** ఏండ్ల తరబడి అజ్ఞాతంలో ఉంటూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ముగ్గురు మావోయిస్టులు శనివారం ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. విశాఖ రేంజ్ డీఐజీ ఎల్కేవీ రంగారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ డివిజన్ ఏరియా (కాఫీ కమిటీ) డీసీఎం బోడా అంజయ్య అలియాస్ భాస్కర్ అలియాస్ నవీన్ అతడి భార్య సింద్రి కాంద్రి అలియాస్ జీవని అలియాస్ సావిత్రి అలియాస్ జ్యోతి (ఏసీఎం)తోపాటు కొర్రా వెంకటరావు అలియాస్ శ్రీకాంత్ (ఏసీఎం, టెక్నికల్ టీం) పోలీసుల ఎదుట లొంగిపోయారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరికి చెందిన నవీన్ 2004లో మావోయిస్టు పార్టీలో చేరాడు. తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలో పలునేరాలకు పాల్పడి డీసీఎంగా ఎదిగాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొయ్యూరు మండలానికి చెందిన కాంద్రి, శ్రీకాంత్ 2010, 2103 సంవత్సరాల నుంచి మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ పలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు. నవీన్‌పై రూ.6 లక్షల రివార్డు, కాంద్రిపై రూ.4 లక్షల రివార్డు, శ్రీకాంత్‌పై రూ.4లక్షల రివార్డు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. రివార్డులను మావోయిస్టులకే అందజేస్తామని.. అంతేకాకుండా వారికి ప్రభుత్వ ప్రయోజనాలు కూడా కల్పిస్తామని డీఐజీ తెలిపారు.


SNIST SREENIDHI INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
AUTONOMOUS
YAMNAMPET, GHATKESAR, HYDERABAD-501 301. Ph : 9640666612/13, 9848768681, 9951506283, Website: www.sreenidhi.edu.in
ADMISSION NOTIFICATION FOR CATEGORY "B" SEATS
For M.TECH and MBA Courses
for the Academic Year 2019-20
Course details - Intake – No of Seats in Category "B"
Electrical Power Engineering (18)-(5), CAD/CAM (18)-(5), Thermal Engineering (24)-(7), Digital Systems & Computer Electronics (24) – (7), Computer Science & Engineering (24)-(7), Computer Science (24)-(7), Computer Networks & Information Security (24)-(7) and Master of Business Administration 60 – (18)
Applications are called for Admission into M.Tech and MBA Courses on or before 23.08.2019 in the college. Please bring all Originals Certificates along with Tuition Fee. For M.Tech Rs. 52,500/- per Semester and for MBA Rs 85,000/- Per Year and Special fee.
Date: 17.08.2019 Secretary/ Correspondent

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం, 18 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM

# మోదీ-షా ప్రైవేట్ లిమిటెడ్

విశ్లేషణ



డాక్టర్ నాగేందర్ మాధవరం

వాజపేయి మరణించిన ఏడాదిలోపు ఆగస్టు నెలలోనే తెలంగాణ ఆప్తురాలు సుష్మాస్వరాజ్ మరణించారు. దీంతో వాజపేయి చివరి అవశేషం కూడా అంతరించినట్లయింది. రాజకీయ ప్రయోజనాల కంటే దేశం గొప్పదని భావించే వాజపేయి ఆలోచనాసరళికి చెందినవారు ఆమె. విదేశాంగ మంత్రిగా మతభేదం లేకుండా భారతీయులందరికీ సమానదృష్టితో సేవలందిచా రు. తెలంగాణ ఏర్పాటు సమయంలో అనేక అంతర్గత ఒత్తిడులను ఎదుర్కొని లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడానికి కృషిచేశారు. అప్పుడు మోదీయే ప్రతిపక్ష నాయకునిగా ఉన్నట్లయితే తెలంగాణ బిల్లు ఆమోదం పొంది ఉండేదా అని బీజేపీ నాయకులే సందేహిస్తున్నారు. ఎందుకంటే ఆయన అనుసరించిన విధానాల వల్ల తెలంగాణ చాలా నష్టపోయింది. 2014 ఎన్నికల్లో 'తల్లిని చంపి బిడ్డను విడదీశార'ని తన పార్టీ అనుసరించిన విధానం పైననే మండిపడ్డాడు. అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి మంత్రివర్గ సమావేశంలోనే ఏడు మండలాలను తెలంగాణ ప్రమేయం లేకుండానే తీసుకొని భద్రాద్రి రామున్ని అనాథను చేశాడు. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను విస్మరించాడు. ఉన్నతాధికారులను కేటాయించడానికి సంవత్సరం కాలయాపన చేశాడు. రాష్ట్ర ప్రాజెక్టులకు 24,000 కోట్లు ఇవ్వమని సాక్షాత్తు నీతి ఆయోగ్ చెప్పితే ఒక్క పైసా కేటాయించకుండా విగ్రహాలకు వేల కోట్లు, గుజరాత్ బుల్లెట్ రైలుకు లక్ష కోట్లకు పైగా కేటాయించుకున్నాడు. పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూసి భాజపా కాస్త మోదీ జనతా పార్టీగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బీజేపీ 'మోదీ-షా ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీగా మారిందనే వాదన కూడా బలంగానే విన్పిస్తున్నది. మారిన పార్టీ విధానాలను గమనిస్తే.. ఈ వాదనే సహేతుకం అన్పిస్తున్నది.

దశాబ్దాలు కష్టపడి పార్టీని నిర్మిస్తే ఇద్దరు వ్యక్తులు ప్రైవేట్ కంపెనీగా మార్చారు కదా అని వ్యవస్థాపకులు బాధపడుతున్నారు. ఈ కంపెనీలో ఇద్దరే వాటాదారులు, మిగతావారంతా ఉద్యోగ భద్రతలేని నిమిత్తమాత్రులు! ఒక ప్రైవేట్ కంపెనీ పార్టీ మిగతా పార్టీలను కుటుంబ పార్టీలని నిందించడమే హాస్యాస్పదం. ఇక్కడొక సారూప్యత ఉన్నది. ఈస్టిండియా కంపెనీ 1612లో సూరత్ నుంచే దేశంలోకి ప్రవేశించి 200 ఏండ్లు దేశాన్ని పీడించింది. మోదీ-షాల మూలాలు కూడా గుజరాత్‌లోనే ఉన్నాయి. ఎన్నికలలో సహాయం చేసిన కార్పొరేట్లకు అన్నిరకాల సహాయాలు చేస్తున్నాడు. దొడ్డిదారిన పరిశ్రమలకు ఇచ్చిన ముప్పై లక్షల కోట్ల రుణాలు వసూలు చేయడానికి వీలులేనివిగా చేశాడు. బ్యాంకుల్లో డబ్బు కొరత తీర్చడానికి డీమానిటైజేషన్ తెచ్చి ఆర్థిక ఎమర్జెన్సీ పెట్టి ప్రజల డబ్బును నిర్బంధంగా బ్యాంకులకు తరలించాడు. 50 రోజులలో డీమానిటైజేషన్ సత్ఫలితాన్నివ్వకపోతే ఉరి తియ్యమని సవాలు చేశాడు. ఫలితంగా 100 మంది ప్రాణాలు కోల్పోయారు. మోదీ పాలనలో కొత్త ఉద్యోగాలు సృష్టించబడలేదు సరికదా యాభై లక్షల ఉద్యోగాలు పోయాయి. 2014లో చైనాకు 16.4 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరుగగా దిగుమతులు 58.4 బిలియన్లు. 2017లో 16.34 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరుగగా దిగుమతులు 68.10 బిలియన్లు. 300 మిలియన్ల ఎగుమతులు పెరిగితే 10 బిలియన్ల దిగుమతులు పెరిగాయి. మోదీ ఊదరగొట్టుతున్న ఉత్పత్తి ఏ రంగంలోనూ జరుగలేదు. ప్రపంచ జీడీపీ ర్యాంకింగ్‌లలో దేశం 7వ ర్యాంక్‌కు పడిపోయింది. డాలర్ విలువ 62 రూపాయల నుంచి 72కు ఎగబాకింది. చైనా నుంచి దిగుమతులు తగ్గించామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. కానీ చైనా తెలివిగా హాంకాంగ్ మీదుగా ఇండియాకు ఎగుమతులు చేస్తూ వాస్తవాలను మరుగుపరుస్తున్నదని ఎకనామిక్ టైమ్స్ ఓ కథనం ప్రచురించటం గమనార్హం.

కశ్మీర్‌లో 370, 35ఏ తొలిగించడం ఎంత సబబో అనుసరించిన విధానం తర్వాత జరుగుతున్న ప్రచారం అంత అభ్యంతరకరం. మెజారిటీ ఉన్నప్పుడు రాజ్యాంగ నిబంధనలను పాటించి చేయవలసిన మార్పును పేరు రావాలని కక్కుర్తిపడి చేసినట్లుగా కన్పిస్తున్నది. ఏ రాష్ట్రాన్నైనా విడగొడ్తాం, ఆ రాష్ట్ర ప్రమేయం లేకుండా సరిహద్దులను మారుస్తామనే హెచ్చరిక కన్పిస్తున్నది. ఆక్రమిత కశ్మీర్‌లో ఒక్క అంగుళం భూమిని కూడా తేకుండా శత్రుదేశాన్ని జయించినంత భారీగా సంబురాలు జరుపుకోవడం ఆశ్చర్యకరం. చైనా పహారాలో ఉన్న సిక్కిం దేశాన్ని దేశంలో 22వ రాష్ట్రంగా నేర్పుగా కలిపినప్పుడు కూడా ఇందిరాగాంధీ ఇంతటి ప్రచారం చేసుకోలేదు. మోదీ, షాలు తెలంగాణలో పాగా వేయటానికి మతాన్ని వేదికగా ఎంచుకున్నారు. అసదుద్దీన్‌ను వెయ్యి తలల రాక్షసునిగా చూపించి కేసీఆర్ అసదుద్దీన్‌ల స్నేహం హిందు మత వ్యతిరేకమని ప్రచారం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రచారం కొంతవరకు ప్రభావాన్ని చూపింది. అద్వానీ, జిన్నా సమాధిని సందర్శించి జిన్నాను పొగడగా, పిలువకుండానే పాక్‌కు వెళ్ళి నవాజ్ షరీఫ్ ముందు మోదీ సాగిలపడ్డాడు. 2014లో పాక్ గడ్డ మీద భారత ముస్లింల గురించి పాకిస్థానీయులు దిగులు చెందాల్సిన అవసరం లేదని, మీరు మీ దేశంలో ఉన్న తీవ్రవాదం గురించి ఆందోళన చెం దండని అసదుద్దీన్ చెప్పాడు. 1947లోనే మేం భారత్‌ను మాతృభూమిగా ఎంచుకున్నాం. న్యాయవ్యవస్థ గుజరాత్ అల్లర్ల దోషులను శిక్షిస్తున్నది. మా సమస్యలను మేము పరిష్కరించుకుంటాం మీ సమస్యలను మీరు చూసుకొండని కరాఖండిగా చెప్పిన అసదుద్దీన్‌ను జాతి వ్యతిరేకిగా చూపిస్తున్నారు. మజ్లిస్ పార్టీ సిద్ధాంతాలతో విభేదించేవారు కూడా ముస్లింలకు ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకం కలిగించడం లో ఆ పార్టీ నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తున్నదన్న విషయాన్ని విస్మరించలేరు. గమనించవలసిన విషయమేమంటే ఇంతవరకు మజ్లిస్ నాయకులెవ్వరు టెర్రరిజానికి సంబంధించిన గొడవలలో అరెస్టు కాలేదు. మక్కామసీద్ బాంబు పేలుళ్లలో అరెస్టయిన వారు ఎలా నిర్దోషులగా విడుదలయ్యారు? తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి ఎందుకు రాజీనామా చేశాడు? అనేది ఎప్పటికీ తేలని ప్రశ్నలే. బాబ్రీ మసీదు కూల్చివేతలో ప్రధాన సాక్షి అయిన రామమందిరం పూజారి బాబాలాల్ దాస్ హత్య ఇం కా మిస్టరీనే.

మైనారిటీలు, లౌకికవాదులు కేసీఆర్ విధానాలను ప్రశ్నించడానికి ఆస్కారం ఉన్నది. ఆధునిక భారతదేశంలో యజ్ఞయాగాల, పూజల ద్వారా నయా బ్రాహ్మణవాదాన్ని పునరుద్ధరిస్తున్నాడని కొంత చర్చ జరుగుతున్నది. కానీ హిందుమతాన్ని రాజకీయంగా ఉపయోగించుకొని పదవులు పొందే వారు కేసీఆర్ హిందు మత నిబద్ధత గురించి ప్రశ్నిస్తున్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి హిందూ మతానికి ఇవ్వనంతటి ప్రాధాన్యం కేసీఆర్ ఇచ్చాడు. ప్రస్తుతం 14 రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వా లు అధికారంలో ఉన్నాయి. ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనైనా 1,800 కోట్ల రూపాయలు మందిర నిర్మాణానికి బడ్జెట్‌లో కేటాయించారా? కేసీఆర్ ఎక్కువగా యాగా లు చేస్తున్నాడని ప్రధాని మోదీయే ఆరోపించాడు. తెలంగాణ ప్రభుత్వం యాదాద్రి గుడికి 1,800 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించింది. 2018-19 బడ్జెట్‌లో దేవాలయాల నిర్మాణం కోసం 550 కోట్లు కేటాయించింది. కొత్తగా ఏర్పడిన జిల్లాలలో నాలుగింటికి హిందూ దేవుళ్ళ పేర్లు పెట్టారు. 80 శాతం తెలంగాణ ప్రజల అవసరాల తీర్చే ప్రాజెక్టుకు కాళేశ్వరం అని, ఖమ్మంలో ఒక ప్రాజెక్టుకు సీతారామ అని, 25,000 కోట్లతో నిర్మిస్తున్న పవర్‌ప్లాంట్‌కు యాదాద్రి అని నామకరణం చేశారు. నేపాల్ తర్వాత ప్రభుత్వ ప్రాజెక్టులకు హిందూ దేవతల పేర్లు తెలంగాణలోనే ఎక్కువగా కన్పిస్తాయి. ఇదంతా మతదృష్టితో కాదు, సంస్కృతికి పెద్దపీట వేయటంగా చూడాల్సిన అవసరం ఉన్నది.

అభివృద్ధి పనులు చేయకున్నా కేవలం ప్రచారం ద్వారా ఎన్నికలలో గెలువవచ్చు అని ట్రంప్, నెతన్యాహు, మోదీలు నిరూపించారు. ట్రంప్ రోజుకు సగటున 19.7 అబద్ధాలు చెప్తున్నాడని వాషింగ్టన్ పోస్ట్ లెక్కగట్టింది. ఇప్పటికే 12 వేలకు పైగా అబద్ధాలను, తప్పుడు సమాచారాన్ని ఇచ్చాడు. దేశంలో సాహసం చెసి మోదీ అబద్ధాలను, హమీల ఉల్లంఘనలను లెక్కకట్టే పత్రికలు లేవు. వీరి దాడిలో మొదటి బాధితురాలు 'నిజం'. ఇప్పుడు ఎన్నికలు.. నిజాలు, అబద్ధాలు (ప్రాపగాండ) మధ్యన జరుగుతున్నాయి. ప్రజల స్వల్పకాలిక జ్ఞాపకశక్తియే వీరికి అనుకూలమైన అంశం. ప్రాపగాండతో మిథ్యా వాస్తవాలను సృష్టిస్తారు. ఆచార్య జయశంకర్ చెప్పినట్లు నిరంతర భావజాల వ్యాప్తిచేయడం, ప్రజలను చర్చలలో, నిర్ణయాలలో, అమలులో భాగస్వామ్యం చేయడం ద్వారా మాత్రమే కాలకేయుల ఆక్రమణలను నిలువరించడం జరుగుతుంది. 'పార్లమెంట్ తలుపులు మూసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లును ఆమోదింపచేశారు' అని పార్లమెంట్‌లో అమిత్ షా చెప్పారు. తెలంగాణకు కేంద్రం కేటాయించిన నిధులపై, తెలంగాణ ఏర్పాటుపై మోదీ-షా ద్వయం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలపై గ్రామాలలో సమగ్రమైన చర్చ జరుగాలి. తెలంగాణ పట్ల బీజేపీ అగ్రనాయకత్వ ధోరణిని ఎండగట్టాలి. తెలంగాణ సంస్కృతి, విభిన్నత, స్వతంత్ర పరిరక్షణ కోసం తెలంగాణ సమాజం ప్రయత్నించాలి, పోరాడాలి.

> అభివృద్ధి పనులు చేయకున్నా కేవలం ప్రచారం ద్వారా ఎన్నికలలో గెలువవచ్చు అని ట్రంప్, నెతన్యాహు, మోదీలు నిరూపించారు. ట్రంప్ రోజుకు సగటున 19.7 అబద్ధాలు చెప్తున్నాడని వాషింగ్టన్ పోస్ట్ లెక్కగట్టింది. ఇప్పటికే 12 వేలకు పైగా అబద్ధాలను, తప్పుడు సమాచారాన్ని ఇచ్చాడు. దేశంలో సాహసం చెసి మోదీ అబద్ధాలను, హమీల ఉల్లంఘనలను లెక్కకట్టే పత్రికలు లేవు. వీరి దాడిలో మొదటి బాధితురాలు 'నిజం'. ఇప్పుడు ఎన్నికలు.. నిజాలు, అబద్ధాలు (ప్రాపగాండ) మధ్యన జరుగుతున్నాయి. ప్రజల స్వల్పకాలిక జ్ఞాపకశక్తియే వీరికి అనుకూలమైన అంశం.

**(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకులు, వాషింగ్టన్, డీసీ)**

# బరువు కాదు బాధ్యత

తెలంగాణం



సందీప్ రెడ్డి కొత్తపల్లి


ఆకలిచావులు, ఆత్మహత్యలు, కరువు, కన్నీళ్లు, సాగునీరు కనీసం తాగునీరు లేని దుస్థితి నుంచి పుట్టిందే తెలంగాణ ఉద్యమం. కరువుతో అల్లాడుతూ బోరుబావుల మీద ఆధారపడి బతుకులీడుస్తున్న తెలంగాణ రైతాంగం మీద మోపిన కరంటు భారం చూసి వ్యతిరేకించి కేసీఆర్ మలిదశ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అనేక అవరోధాలను, అవమానాలను ఎదుర్కొని 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ఉద్యమనేతగా ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయ్యారు. 14 ఏండ్ల ఉద్యమంలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు దగ్గరగా చూసిన అనుభవం, ఉద్యమ సమయంలో రోజుల తరబడి తెలంగాణ రాష్ట్రానికి ఏం కావాలన్న మేధోమథన చర్చలు చేశారు. ఆ అవగాహనతో అధికారంలోకి వచ్చినవెంటనే అనేక వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారు. అందులో ముఖ్యమైనవి. సాగునీటి కోసం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తూనే గోదావరి మీద కాళేశ్వరం, కృష్ణానది మీద పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం. తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ పథకం లాంటివాటిని చెప్పుకోవచ్చు.

తెలంగాణ విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం నూతన గురుకులాలు ఏర్పాటుచేశారు. హాస్టళ్లు, పాఠశాలల్లో సన్నబియ్యం అన్నం పెడుతున్నారు. వ్యవసాయం దండుగ అన్న సీమాంధ్ర పాలకుల విధానాలతో విసిగిపోయి ఆత్మవిశ్వాసం కోల్పోయిన రాష్ట్ర రైతాంగం గుండెల నిండుగా ఆత్మవిశ్వాసం నింపుతున్నారు. వ్యవసాయం పండుగ అనిపించేలా రైతులకు వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంటు, పెట్టుబడి కింద ఎకరానికి ఏడాదికి రెండు విడుతలుగా మొత్తం పదివేల నగదు సాయం అందిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం మీద ఆధారపడిన గ్రామీణ పేదల జీవితాలలో వెలుగులు నింపాలన్న ముందుచూపుతో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఎవరూ ఊహించనివి. ఈ దేశంలో ఇంతవరకూ ఏ రాష్ట్రంలో అమలుచేయనివి. ప్రపంచంలో ఏ దేశంలో కూడా ఇంతవరకు రైతాంగానికి ఇంతలా అండగా నిలిచిన ప్రభుత్వం లేదంటే కేసీఆర్ ఆలోచనలు ఎం త ఉన్నతమైనవో, ఆదర్శవంతమైనవో తెలుస్తూనే ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, ప్రభుత్వం ఏర్పడి ఐదేండ్లు పూర్తయింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు నిరాటంకంగా ముందుకుసాగుతున్నాయి. కేసీఆర్ ఆదర్శవంతమైన పాలనను చూసి వరుసగా రెండోసారి తెలంగాణ ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారు. కానీ ప్రజలు ఎన్నికలలో తీర్పు ఇచ్చి హెచ్చరించినా తెలంగాణలోని ప్రతిపక్షాలు మాత్రం ఇంకా తీరు మార్చుకోలేదు. అదే పాత, మూస ధోరణితో గత ఐదేండ్లుగా చేసిన, చేస్తున్న ఆరోపణలతోనే ప్రభుత్వం మీద బురదజల్లి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మన ఇంట్లో పెళ్లి చేయాలంటేనే, మనం ఒక ఇల్లు కొనుక్కోవాలంటేనే అనేకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటాం. అందినచోటల్లా అవసరానికి అప్పుచేసి తిరిగి వీలును బట్టి తీరుస్తూ ఉంటాం. ఒక ఇంటికి సంబంధించిన విషయంలోనే ఇన్ని ఇబ్బందులున్నప్పుడు ఒక ప్రభుత్వాన్ని నడుపడంలో అనేక సమస్యలు ఇమిడి ఉంటాయి. అయినా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా అన్నిపథకాలను అవరోధాల్లేకుండా ముందుకుతీసుకెళ్తున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటిరోజుల్లో 'కడుపు కట్టుకుని పనిచేస్తాం.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషిచేస్తాం' అని చెప్పినట్లు అదే మాటకు కట్టుబడి ముందుకువెళ్తున్నారు. కానీ విపక్షాలు మాత్రం తెలంగాణ ప్రభుత్వం పథకాల మీద ప్రజలకు తప్పుడు సమాచారం చేరవేసి లబ్ధి పొందాలనే ధోరణితోనే వ్యవహరిస్తున్నాయి. ప్రజలు ఎన్నికలలో వీరి ఆరోపణలను తిప్పికొట్టినా తీరు మార్చుకోవడం లేదు.

భూమినే నమ్ముకొని బతుకీడ్చే పేద రైతు కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ రైతుబీమా పథకాన్ని తీసుకువచ్చారు. గత సీమాంధ్ర పాలనలో రైతు మరణిస్తే పట్టించుకున్నవారు లేరు. కరంటు షాక్‌తో మరణిస్తే రూ.20 వేలు చెల్లించి చేతులు దులుపుకునేవారు. అదీ కార్యాలయం చుట్టూ తిరిగితిరిగి బతిమిలాడితే ఎప్పుడోగాని వచ్చేవి కాదు. ఇక స్థానిక ప్రజాప్రతినిధి గట్టిగా తిరిగి ఆపద్బంధు పథకం అమలు చేయి స్తే రూ.50 వేలు ఎన్నటికో గానీ వచ్చేవి కావు. దానికి సవాలక్ష మంది పైరవీకారులు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు నేరుగా చేతికి అందుతున్నది. తెలంగాణ ప్రభుత్వం తను ప్రవేశపెట్టిన పథకాలను బరువుగా కాకుండా తెలంగాణ సమాజం పట్ల ఒక బాధ్యతగా స్వీకరించి అమలుచేస్తుండటం మూలంగానే ఈ రోజు ఇంత మంది బక్కరైతుల కుటుంబాలకు న్యాయం జరిగింది. ఈ ఏడాది కూడా బీమాను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయాన్ని భారంగా భావించిన రైతులు ఈ రోజు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నారంటే ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలే కారణం.


ప్రారంభించిన మూడేండ్లలో తెలంగాణ ప్రభుత్వం ప్రపంచంలోనే ఎత్తయిన ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసింది. ఈ ప్రాజెక్టు గోదావరి నదికి నడకలు నేర్పుతున్నది. ఇన్నాళ్లూ లేకుండా చేసిన వలస పాలకుల ప్రచారానికి కాళేశ్వర నిర్మాణం చెంపపెట్టు. ఈ ప్రాజెక్టు ఫలితాలు కళ్లముందు కనిపిస్తున్న తరుణంలోనూ విపక్షాలు ప్రాజెక్టు మీద విషం కక్కడం మానడం లేదు. అరువై ఏండ్లు అన్యాయమైన తెలంగాణ రైతాంగానికి తెలంగాణ సాధించిన ఫలితాలు వీలైనంత త్వరగా అందించాలన్న కేసీఆర్ పట్టుదల మూలంగానే కాళేశ్వరం శరవేగంగా నిర్మాణమై కళ్లముందు నిలబడింది. దీన్ని బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకొని ప్రణాళికతో పూర్తిచేయడమే దీనికి కారణం. కానీ కరంటు బిల్లును బూచీగా చూపి ఈ ప్రాజెక్టు గొప్పతనం మీద మరకలు రుద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్నేం డ్లు బోరుబావులతో కన్నీరు కార్చిన తెలంగాణ రైతాంగానికి తెలియదా కరంటు ఖర్చెంత? అది కట్టలేదని పాలకులు లాక్కెళ్లిన స్టార్టర్ల విలువెంతనో? ఈ ఐదేండ్లలోనే ప్రభుత్వం రాష్ట్ర ప్రజల తాగునీటి కష్టాలను దృష్టిలో పెట్టుకొని మిషన్ భగీరథ పథకాన్ని మొదలుపెట్టి పూర్తిచేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ పల్లె ప్రజలకు తాగునీరు అందిస్తున్నది. మిషన్ కాకతీయ పథకంతో తెలంగాణ చెరువులు పునర్నిర్మాణం అవుతున్నాయి. అందులో ఉచితంగా చేపపిల్లలను విడిచి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలబడింది. సీమాంధ్ర పాలనలో కాలువ పక్క న ఉన్న రైతులు మోటార్లు పెట్టుకుని సాగునీరు తీసుకుంటే కేసులు పెట్టేవారు. చెరువులు నింపడాన్ని నిషేధించారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల కింద ఉన్న అన్ని చెరువులు నింపేందుకు అనుమతులు ఇచ్చింది. కాలువల పొడవునా రైతులు మోటార్లు వేసుకొని ఆరుతడి పంటలు పండించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ఉచిత కరంటు అన్నీ ప్రజ ల పట్ల బాధ్యతతో చేస్తున్నవే. దేన్నీ ప్రభుత్వం బరువుగా భావించడం లేదు. ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గుర్తెరిగి మసులుకుంటేనే మనుగడ ఉంటది. బురద జల్లడం మూలంగా ఏ విధమైన ప్రయోజనం ఉండదు.

> ప్రారంభించిన మూడేండ్లలో తెలంగాణ ప్రభుత్వం ప్రపంచంలోనే ఎత్తయిన ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసింది. ఈ ప్రాజెక్టు గోదావరి నదికి నడకలు నేర్పుతున్నది. ఇన్నాళ్లూ నీళ్లు లేకుండా చేసిన వలస పాలకుల ప్రచారానికి కాళేశ్వర నిర్మాణం చెంపపెట్టు. ఈ ప్రాజెక్టు ఫలితాలు కళ్లముందు కనిపిస్తున్న తరుణంలోనూ విపక్షాలు ప్రాజెక్టు మీద విషం కక్కడం మానడం లేదు. అరువై ఏండ్లు అన్యాయమైన తెలంగాణ రైతాంగానికి తెలంగాణ సాధించిన ఫలితాలు వీలైనంత త్వరగా అందించాలన్న కేసీఆర్ పట్టుదల మూలంగానే కాళేశ్వరం శరవేగంగా నిర్మాణమై కళ్లముందు నిలబడింది.




కశ్మీర్‌కు మోదీ ఓ నిర్దిష్ట యథాతథస్థితిని కల్పించారు. పాకిస్థాన్ దానికి భంగం కలిగిస్తే పర్యవసానాలు మరోవిధంగా ఉండొచ్చు. కానీ కశ్మీర్‌లో లోతైన సంక్షోభం ఉన్నది. ప్రస్తుత విభజన, సరిహద్దు రేఖలను కొత్తగా గీసే పనిచేయొద్దు. వాటి పరిధిలోనే పరిష్కారాలు కనుగొనాలి.

**శేఖర్ గుప్తా**




మోదీ దార్శనికతతో డిజిటల్ ఇండియాగా నవభారతం మారిపోతున్నది. ఇప్పుడు ప్రజలు డిజిటల్ శక్తితో అవసరమైన ప్రభుత్వ సేవలన్నింటినీ పొందుతున్నారు.

**రవిశంకర్ ప్రసాద్**




ఆర్టికల్ 370ని రద్దు ప్రక్రియను మోదీ, షా ద్వయం చేసిన విధానం వారి నాయకత్వ పని విధానాన్ని తెలియజేస్తున్నది.

**రాజ్‌దీప్ సర్దేశాయ్**



త్రివిధ దళాలకు చీఫ్‌గా సమన్వయకర్తగా నియమించాలన్న నిర్ణయం ఆహ్వానించదగినది. ఈ ప్రతిపాదన 1999 కార్గిల్ యుద్ధం జరిగినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్నది.

**కెప్టెన్ అమరీందర్ సింగ్**




కశ్మీర్‌ను మహారాజా రక్షించలేడు. ఎవరైనా కశ్మీర్‌ను రక్షిస్తారంటే.. వారు ముస్లింలు, కశ్మీరీ పండిట్లు, రాజపుత్‌లు, సిక్కులు మాత్రమేనని 1947లో మహాత్మా గాంధీ అన్నారు. నేటి మహారాజాలు, రాజకీయ, కార్పొరేట్‌శక్తులు కశ్మీర్‌ను రక్షించలేరు.

**రామచంద్ర గుహ**

# ప్రపంచీకరణకు ప్రమాదం

అంతర్జాతీయం



గ్రెగ్ ఇప్

ప్రపంచమంతా కొన్ని ఆర్థిక నియమాల ప్రకారం నడుస్తూ ఉంటుంది. అయితే ఈ నియమాలపై నమ్మకం సడలడం అంటూ మొదలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తలకిందులవుతుంది. చౌక ఇంధనం లభించేకాలం ముగిసిన తర్వాత 1970 దశకంలో ఇదే నేర్చుకున్నాం. దేశాలు దివాలా తీస్తాయనేది 1980 దశకంలో అర్థమైంది. అమెరికా తాకట్టులు, గ్లోబల్ బ్యాంక్‌లు కూడా నమ్మదగినవి కాదని మరో దశాబ్దం తర్వాత అవగాహనకు వచ్చింది. ఇప్పుడు ప్రపంచీకరణపై ఇటువంటి ఆలోచనలే వస్తున్నాయి. అమెరికా మొదలుకొని బ్యూనస్ ఏయిర్స్ వరకు దేశాలన్నీ సరిహద్దుల్లేని వాణిజ్యం పట్ల నమ్మకం పెంచుకున్నాయి. కానీ ఇప్పుడా నమ్మకాలు సడలిపోతున్నాయి. ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలు మార్చుకుంటున్నారు. వ్యాపారసంస్థలు తమ పెట్టుబడుల విషయమై పునరాలోచనలో పడ్డాయి. విధానకర్తలు పరిస్థితులను ఎదుర్కొనడానికి తంటాలు పడుతున్నారు. కానీ ఈ పరిస్థితులన్నీ చివరికి ప్రపంచ ఆర్థికవ్యవస్థను మాంద్యంవైపే తీసుకుపోతున్నాయి.

ప్రపంచంలోనే శిష్టవర్గంగా గుర్తింపు పొందిన ఆర్థిక నిపుణులకు నిలయమైన సెంట్రల్ బ్యాంక్‌లు మాంద్యాన్ని ఎదుర్కొనడానికి తమ శక్తి యుక్తులన్నీ ఉపయోగిస్తారని ఇన్వెస్టర్లు ఆశాభావంతో ఉన్నారు. కానీ ఈ సెంట్రల్ బ్యాంక్‌లు పరస్పర పోటీలోనే నిమగ్నమైపోయాయి. 2016లో జాతీయవాదం, జనాకర్షణ విధానాలు ప్రాచుర్యం పొందాయి. యురోపియన్ యూనియన్ నుంచి బయటపడాలని బ్రిటన్లు తీర్పు ఇచ్చారు. అమెరికా ప్రజలు డొనాల్డ్ ట్రంప్‌ను ఎన్నుకున్నారు. అయితే ఈ పరిణామాల పట్ల మొదట వ్యక్తమైన అభిప్రాయాలు వేరుగా ఉన్నాయి. ప్రపంచీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం, అదుపులేని వలసల మూలంగా ఏర్పడే ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను ఈ ఆర్థికరంగ శిష్టవర్గం పట్టించుకోకపోవడం వల్ల ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతగా ఈ పరిణామాలను కొందరు అర్థం చేసుకున్నారు. కానీ జాతీయవాదం అసలు స్వరూపం ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నది. ప్రపంచీకరణ వాదుల తప్పిదాలను చక్కదిద్దుతారనిపించింది. కానీ వారిని మించిపోవడమే వీరి లక్ష్యం. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలుగాలనుకోవడం ఇందుకు ఉదాహరణ. వాణిజ్య సంబంధాలు దెబ్బతినకుండా బ్రిటన్‌ను బయటికి పంపించాలని ఈయూ భావించింది. కానీ రెండేండ్ల సంప్రదింపుల తర్వాత కూడా జాతీయవాదులు పట్టువీడటం లేదు. కానీ కరడుగట్టిన బ్రెగ్జిట్‌వాది అయిన బోరిస్ జాన్సన్ ప్రధాని అయ్యారు. ఆర్థికరంగంలో నష్టాలు ఎదురైనా సరే, బ్రిటన్‌ను అక్టోబర్ 1వ తేదీలోగా బయటకుతేవాలని దృఢంగా భావిస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారంలోకి రాగానే మొదటి దశలో యురోపియన్ మిత్రదేశాల పట్లనే రక్షిత విధానాలను అవలంబించారు. కానీ ఈ పోకడను దేశంలోని, యూరప్‌లోని శక్తులు తిప్పికొట్టాయి. కానీ చైనాతో చర్చలు విఫలమయ్యాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థల మధ్య ఆర్థిక చర్చలకు ఉండవలసిన ప్రాథమిక నిబంధనలకు అనుగుణంగా ఈ చర్చలు సాగనేలేదు. కనీసం కొత్త నియమావళిని కూడా ఈ రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలు రూపొందించుకోలేకపోయాయి. చివరికి తాత్కాలికంగా ఎవరికి చేతనైన చర్యలు అవి తీసుకున్నాయి. మొరటుగా సుంకాలు విధించుకోవడం, కరెన్సీ విలువను తగ్గించుకోవడం, ప్రతి చర్యలకు దిగడం సాగుతున్నది. అయితే ఇటీవల కొంత ఊరట కలిగించే రీతిలో కొంత అవగాహన కుదిరి తదుపరి చర్యలకు దిగలేదు. ఇటలీలలో ఉప ప్రధాని మేటో సాల్వినీ ఈయూకు, వలసలకు వ్యతిరేకం. ఈయన తమ సొంత ప్రభుత్వాన్నే కూలదోయడానికి యత్నిస్తున్నారు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనేది ఆయన ప్రయత్నం. అమెరికా మిత్ర కూటమిలోని జపాన్, దక్షిణకొరియా మధ్యనే వాణిజ్య యుద్ధం సాగుతున్నది. ఈ రెండుదేశాల మధ్య పాత వైరం పెల్లుబుకుతున్నది. అర్జెంటీనాలో మార్కెట్ కుప్పకూలిపోయింది. జనాకర్షణ, వాణిజ్య రక్షిత విధానాలకు పేరుబడిన రాజకీయవాదులు అధికారం చేపట్టడానికి సిద్ధపడుతున్నారు. గత రెండేండ్లుగా అమెరికా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు జాతీయవాదాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ట్రంప్ పన్నులు తగ్గించడం, వాణిజ్య నిబంధనలను సడలించడం ట్రంప్ రక్షితవిధానాల పట్ల వ్యతిరేకతను కమ్మేసింది. కానీ ఈ విధానాలను ఇంకెంతో కాలం విస్మరించడం సాధ్యం కాదు. అంతర్జాతీయ రంగంలో ఏవైనా వ్యాపార నియమాలు ఇంకా ఉన్నాయా అని వ్యాపార సంస్థలకు, ఇన్వెస్టర్లకు ఆందోళన మొదలైంది. పెట్టుబడులు పెట్టడానికి జంకుతున్నారు.

బ్రిటన్‌లో బ్రెగ్జిట్ సృష్టించిన అనిశ్చితి వల్ల పెట్టుబడులు నిలిచిపోయాయి. దీంతో ఆర్థికవ్యవస్థ కుంచించుకుపోయింది. జర్మనీ కూడా మాంద్యంలోకి కూరుకుపోయే లక్షణాలు కనిపిస్తున్నాయి. రెండవ త్రైమాసికంలో ఆర్థిక రంగం కుంచించుకుపోయింది. అమెరికా, చైనా దేశాల ఎగుమతులు తగ్గిపోయాయి. అభివృద్ధి మందగించింది. ప్రపంచ పరిణామాలకు ఇన్వెస్టర్లు భయాందోళనలు చెందుతుంటే, స్టాక్‌మార్కెట్ ఊగిసలాడుతున్నది. గతేడాది పాటు కాలంలో ప్రపంచంలోని వంద బ్ల్యూచిప్ కంపెనీల లాభాలు మూడు శాతం తగ్గాయి. అయితే అమెరికాపైనే కేంద్రీకరించిన కంపెనీల లాభాలు 5.5 శాతం పెరిగాయి. కొన్ని శతాబ్దాలుగా ప్రపంచీకరణ ఎదురుదెబ్బలు తిన్నది. అయితే ఇప్పుడు పరిస్థితి మరోరకంగా ఉన్నది. ఇంతకాలం ప్రపంచీకరణ విధానాలను ప్రోత్సహిస్తూ, ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుకు పునాదులు వేసిన అమెరికా ఇప్పుడు ఆ వ్యవస్థను కూలదోయడానికి యత్నిస్తున్నది. ట్రంప్ జాతీయ భద్రత పేర ఉక్కు, అల్యూమినియం, ఆటో దిగుమతులపై సుంకాలు విధిస్తున్నారు. ఇది 75 ఏండ్లుగా అమెరికా అనుసరిస్తున్న విధానానికి విరుద్ధమని ప్రముఖ వాణిజ్య ఆర్థికవేత్తలు చాడ్‌బౌన్, డగ్లాస్ ఇర్విన్ ఇటీవల ఫారిన్ అఫైర్స్ పత్రికలో రాశారు. వాణిజ్య అడ్డంకులను నిరోధిస్తున్న డబ్ల్యుటీవో నియమాలను నిర్వీర్యం చేయడానికి జాతీయ భద్రత వాదన బలమైనది. ఈ విషయంలో అమెరికా రష్యా సరసన నిలుస్తున్నదని వారు వివరించారు.

అమెరికా గతంలో మిత్రదేశాలతో ఆర్థిక ఏకీకరణ సాధించడానికి తన ఆర్థిక, సైనిక, నైతికబలాన్ని ఉపయోగించేది. ఉద్రిక్తతలను సడలించేది. మేం వారి భుజాలపై చేయివేసి చర్చించుకుందాం అంటూ వైరి పక్షాలను సముదాయించేవారం అని రీగన్, బుష్ ప్రభుత్వాలలో ఆర్థిక దౌత్యం నెరిపిన డాన్ ప్రైస్ వివరించారు. కానీ ట్రంప్ వ్యవహారసరళి ఇందుకు భిన్నంగా ఉన్నది. బ్రిటన్ ఈయూ నుంచి విడిపోతుంటే ట్రంప్ హర్షం వ్యక్తం చేస్తున్నారే కానీ, సర్దుబాటు చేయడానికి ప్రయత్నించలేదు. జపాన్, దక్షిణకొరియా గొడవల పట్ల కూడా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. 'మన సమిష్టి ప్రయోజనాలు కాపాడటానికి ఒకరున్నారనే భావన గతంలో ఉండేది. చెప్పుకోవడానికి మధ్యవర్తి ఉండేది. కానీ అమెరికా స్వయంగా ఏకపక్ష వాణిజ్య విధానాలను అవలంబిస్తున్నదని ప్రైస్ వివరించారు. అయితే ఇప్పటికీ ప్రపంచమంతా మాంద్యం వ్యాపించే లక్షణాలు పూర్తిగా కనిపించడంలేదు. 1970, 80 దశకాల నాటి పరిస్థితి లేదు. అయినప్పటికీ ఏకపక్ష వాణిజ్య విధానాలు అన్ని కరెన్సీలను, ద్రవ్య విధానాలను ప్రభావితం చేసే అవకాశం ఉన్నది.

ట్రంప్ సుంకాలు విధించి బెదిరిస్తుండటంతో, చైనా తమ కరెన్సీ విలువను తగ్గించింది. దీంతో చైనా దిగివచ్చే సూచనలు లేవని తెలిసిపోయింది. చైనా సంధి కోరుకోవడం లేదని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ ఆర్థిక చరిత్రకారుడు బారీ ఈషెన్‌గ్రీన్ అభిప్రాయపడ్డారు. చైనా, కొరియా, వియెత్నాం దేశాల కరెన్సీ విలువలు తగ్గిపోవడం ట్రంప్ సహించలేరు. ఆయన అదనపు సుంకాలు విధించడం ఖాయం. దీంతో ప్రపంచ వాణిజ్యం మీద నమ్మకం సడలుతుంది. సెంట్రల్ బ్యాంకులు కూడా గాయాలకు లేపనం రాయడం తప్ప చేయగలిగేది ఏమీ లేదు.

> బ్రిటన్‌లో బ్రెగ్జిట్ సృష్టించిన అనిశ్చితి వల్ల పెట్టుబడులు నిలిచిపోయాయి. దీంతో ఆర్థికవ్యవస్థ కుంచించుకుపోయింది. జర్మనీ కూడా మాంద్యంలోకి కూరుకుపోయే లక్షణాలు కనిపిస్తున్నాయి. రెండవ త్రైమాసికంలో ఆర్థికరంగం కుంచించుకుపోయింది. అమెరికా, చైనా దేశాల ఎగుమతులు తగ్గిపోయాయి. అభివృద్ధి మందగించింది. ప్రపంచ పరిణామాలకు ఇన్వెస్టర్లు భయాందోళనలు చెందుతుంటే, స్టాక్‌మార్కెట్ ఊగిసలాడుతున్నది. గతేడాది పాటు కాలంలో ప్రపంచంలోని వంద బ్ల్యూచిప్ కంపెనీల లాభాలు మూడు శాతం తగ్గాయి. అయితే అమెరికాపైనే కేంద్రీకరించిన కంపెనీల లాభాలు 5.5 శాతం పెరిగాయి. కొన్ని శతాబ్దాలుగా ప్రపంచీకరణ ఎదురుదెబ్బలు తిన్నది.

**(వ్యాసకర్త: కెనడియన్- అమెరికన్ పాత్రికేయులు)**

'ఫూల్‌ప్రూఫ్: వై సేఫ్టీ కెన్ బి డేంజరస్ అండ్ హౌ డేంజర్ మేక్ అజ్ అన్‌సేఫ్' (2015), 'నో వే అవుట్? గవర్నమెంట్ ఇంటర్‌వెన్షన్ అండ్ ఫైనాన్షియల్ క్రైసిస్' (2013), 'ది లిటిల్ బుక్ ఆఫ్ ఎకనమిక్స్: హౌ ది ఎకానమీ వర్క్స్ ఇన్ ది రియల్ వరల్డ్' (2010) పుస్తకాల రచయిత.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# జైట్లీ పరిస్థితి అత్యంత విషమం

- లైఫ్ సపోర్ట్‌పై చికిత్స అందిస్తున్న వైద్యులు
- ఎయిమ్స్‌కు వెళ్లి పరామర్శించిన పలువురు నేతలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** ఢిల్లీలోని ఎయిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత అరుణ్‌జైట్లీ ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నది. ఆయనను లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. బీహార్ సీఎం నితీశ్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, హర్షవర్ధన్, బీఎస్పీఅధినేత్రి మాయావతి, కాంగ్రెస్ నేతలు అభిషేక్ సింఘ్వీ, జ్యోతిరాదిత్య సింధియా, బీజేపీ నేత సతీశ్ ఉపాధ్యాయ్, ఎయిర్ చీఫ్ మార్షల్ బీరేందర్ సింగ్ ధనోవా తదితరులు శనివారం ఎయిమ్స్‌కు చేరుకుని జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జైట్లీని లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌పై ఉంచారని, వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వారు తెలిపారు. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఈ నెల 9న జైట్లీ ఎయిమ్స్‌లో చేరారు. 10 నుంచి ఆయన ఆరోగ్య పరిస్థితిపై



ఎయిమ్స్ ఎలాంటి బులెటిన్ విడుదల చేయడం లేదు. రాష్ట్రపతి కోవింద్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, యూపీ సీఎం ఆదిత్యనాథ్ శుక్రవారం ఎయిమ్స్‌కు వెళ్లి జైట్లీ ఆరోగ్యంపై ఆరా తీసిన సంగతి తెలిసిందే.

## హాంకాంగ్‌లో పోటాపోటీ ర్యాలీలు

**హాంకాంగ్:** హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య ఉద్యమకారులు, ప్రభుత్వ మద్దతుదారులు శనివారం పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించారు. ప్రజాస్వామ్య ఉద్యమకారులు ఈ వారం ప్రారంభంలో హాంకాంగ్ విమానాశ్రయంలో చేపట్టిన నిరసనపై విమర్శలు వ్యక్తంకావడం, చైనా తదుపరి చర్యపై ఆందోళనలు పెరిగిన నేపథ్యంలో వారి ఉద్యమంపై సందిగ్ధత నెలకొంది. మరోవైపు వీరి నిరసనలను ఖండిస్తూ ప్రభుత్వ మద్దతుదారులు చైనా జెండాలను చేతబట్టి ర్యాలీ చేపట్టారు.

## అక్రమ వేటతో జీవజాతులకు ముప్పు

### అంతర్జాతీయ సదస్సులో పర్యావరణవేత్తల ఆందోళన

**జెనీవా:** వన్యమృగాలను వేటాడటం, అరుదైన వృక్షజాతులను ఇష్టారీతిన నరికివేయడం వల్ల జీవజాతులకు ముప్పు వాటిల్లుతున్నదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో శనివారం 'కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్‌డేంజర్డ్ స్పీసిస్' (సీఐటీఈఎస్) సదస్సు ప్రారంభమైంది. అంతరించిపోతున్న జీవజాతుల గురించి చర్చించడం, అరుదైన జీవజాతుల ఉత్పత్తుల అక్రమ వ్యాపారాన్ని నిరోధించేందుకు చట్టాలను మరింత కఠినం చేసేలా సూచనలు ఇవ్వడం సీఐటీఈఎస్ ముఖ్య ఉద్దేశం. 12 రోజులపాటు ఈ సదస్సు జరుగనుంది.



## కంటి ఆపరేషన్‌కు వెళ్తే.. చూపు పోయింది

**ఇండోర్:** కంటిపొర శస్త్రచికిత్స చేయించుకునేందుకు దవాఖానకు వెళ్లిన 11 మందికి కంటిచూపు లేకుండాపోయింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గతవారం ఈ ఘటన జరిగింది. ఈ నెల 8న ఇండోర్ నేత్ర చికిత్సాలయ్‌కు 13 మంది వెళ్లారు. అయితే చికిత్స అనంతరం ఇన్‌ఫెక్షన్ సోకడంతో 11 మంది చూపును కోల్పోయారు. ఇదే దవాఖానలో 2010లోనూ 18 మంది చూపును కోల్పోయారు. దవాఖానపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం కమల్‌నాథ్ పేర్కొన్నారు.





అగ్నిప్రమాదం కారణంగా రోగులను వార్డుల నుంచి కారిడార్‌కు తరలించిన సిబ్బంది

## ఎయిమ్స్ దవాఖానలో భారీ అగ్నిప్రమాదం

- వైరాలజీ విభాగం పూర్తిగా దగ్ధం
- 34 అగ్నిమాపక శకటాలతో మంటలు అదుపు




ఎయిమ్స్ దవాఖానలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎయిమ్స్ దవాఖానలో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో వైరాలజీ విభాగం పూర్తిగా దగ్ధమైంది. అందులోని రోగులకు సంబంధించిన రక్త, మల, మూత్ర తదితర శాంపిల్స్, ఆరోగ్య రికార్డులు కాలిపోయినట్లు తెలుస్తున్నది. సమాచారం తెలిసిన వెంటనే 34 అగ్నిమాపక శకటాలతో సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఎవరూ గాయపడలేదని తెలుస్తున్నది. 'సాయంత్రం 5 గంటలకు ఎయిమ్స్ పీసీ, బోధనకు సంబంధించిన బ్లాక్‌లో అగ్ని ప్రమాదం జరిగినట్లు మాకు ఫోన్ వచ్చింది. వెంటనే అగ్నిమాపక శకటాలను అక్కడికి తరలించాం' అని ఢిల్లీ అగ్నిమాపక కేంద్రం అధికారి తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన పీసీ బ్లాకులో మైక్రోబయాలజీ ల్యాబ్‌లు, వైద్యుల గదులు ఉండగా దవాఖానలోని అత్యవసర విభాగం ల్యాబ్‌తో ఈ బ్లాక్ అనుసంధానమై ఉన్నది. దీంతో అందులోని రోగులతోపాటు ఏబీ వార్డులోని రోగులను కూడా ఇతర వార్డులకు తరలించారు. పీసీ బ్లాక్‌లో కొన్ని రోజులుగా విద్యుత్తు సంబంధిత పనులు జరుగుతున్న నేపథ్యంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు అనుమానిస్తున్నారు. పీసీ బ్లాక్ రెండో అంతస్తులో ఉండటంతో కింది ఫ్లోర్‌తోపాటు పైనున్న మూడు, నాలుగు అంతస్తులకు మంటలు వ్యాపించాయి. ఈ బ్లాక్‌కు అనుసంధానంగా ఉన్న అత్యవసర విభాగం ల్యాబ్, బీ బ్లాక్, ఏబీ1 వార్డు, ఆర్థోపెడిక్ సూపర్‌స్పెషాలిటీ విభాగాలకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నది. కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ ఎయిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. మరో భవనంలోని కార్డియో-న్యూరో కేంద్రం ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

# కశ్మీరంలో సొంతిల్లు సాధ్యమా?

**ఇప్పటికీ లోయలో ఉగ్రవాదుల ప్రభావం గణనీయం**

- ముస్లిమేతరులను సహించేది లేదంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- గుబులు పుట్టించే గత ఉదంతాలు
- ప్రైవేటు రంగంలో ఉపాధి అంతంతే..



**శ్రీనగర్, ఆగస్టు 17:** జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని, ప్రత్యేక హక్కులను కల్పించే ఆర్టికల్ 370, 35ఏని కేంద్రం ఈ నెల 5న రద్దు చేయడం తెలిసిందే. వీటి నిర్వీర్యంతో జమ్ముకశ్మీర్‌లో స్థలాలు, ఇండ్లు, భూముల కొనుగోళ్ల గురించి చర్చ మొదలైంది. సోషల్ మీడియాలో ఈ విషయంపై జోరుగా ప్రచారం సాగుతున్నది. ఇంత కాలం స్థానికంగా నివాసం ఉంటున్న వారే అక్కడ ఇంటి స్థలాలు కొనుగోలు చేసేవారు. తాజా నిర్ణయంతో బయటి వారు కూడా జమ్ముకశ్మీర్‌లో స్థలాలు కొనుగోలు చేసే వెసులుబాటు కలిగింది. కొత్త చట్టం, నిబంధనలు అక్టోబర్ 31 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, ఎన్ని చట్టాలు వచ్చినా.. బయటి వాళ్లు కశ్మీర్ లోయలో ఇంటిని లేదా స్థలాన్ని సొంతం చేసుకోవడం అంత సులభం కాదంటున్నారు విశ్లేషకులు.

> ఈ ఏడాది అక్టోబర్ 31 నుంచి కశ్మీర్‌లో కొత్త చట్టం అమల్లోకి రానున్నప్పటికీ.. సుందర కశ్మీర్ లోయలో బయటి వ్యక్తులు ఇంటిని సొంతం చేసుకోవడం అంత సులభం కాకపోవచ్చు. దీని వెనుకున్న కారణాలు అనేకం. ఆ నేపథ్యంపై ప్రత్యేక కథనం..

## కబ్జా చేయరన్న గ్యారెంటీ లేదు

**కేంద్రం** తాజా నిర్ణయంతో లఢక్, జమ్ము ప్రాంతాల్లో స్థలాలను కొనాలనుకునే వాళ్లకు అంతగా ఇబ్బందులు ఎదురుకాకపోవచ్చు. అయితే, కశ్మీర్ లోయలో బయటి వ్యక్తులు స్థలాలు కొనుగోలు చేయడం ఇప్పట్లో సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. గత కొన్నేండ్లుగా లోయలో పాదుకొని ఉన్న ఉగ్రవాదం దీనికి ప్రధాన సమస్యగా చెప్పొచ్చు. 1989 నుంచి లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయి. పాకిస్థాన్ దీనిని వెనకుండి నడిపిస్తున్నది. దీంతో లోయలో నివసించే ప్రజల జీవన విధానాలు, అక్కడి పరిస్థితులు బయటి ప్రపంచానికి భిన్నంగా ఉంటాయి. ఈ కారణంగా బయటి వ్యక్తులు లోయలో నివసించడానికి సానుకూల పరిస్థితులు అంతగా లేవనే చెప్పాలి. అలాగే ఉద్యోగ కల్పన, ఉపాధి మార్గాలు కూడా ఇక్కడ అంతంత మాత్రమే. ప్రభుత్వ ఉద్యోగాలను మాత్రమే అక్కడి వ్యక్తులు ఆదాయ భద్రతగా పరిగణిస్తారు. ప్రైవేటు పెట్టుబడులు చాలా పరిమితం. దీంతో ప్రైవేటు రంగంలో ఉద్యోగ కల్పన అవకాశాలు అతి తక్కువ. ఇలాంటి స్థితిలో బయటి వ్యక్తులు అక్కడ స్థలాలు కొని నివసించాలనుకోవడం ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చు. కశ్మీరీ పండిట్ల బహిష్కరణ ఉదంతం ఇంకా చెరగని జ్ఞాపకంగానే ఉన్నది. ఎవరైనా బయటి వ్యక్తులు లోయలో స్థలాల్ని కొనుగోలు చేసినప్పటికీ, వాటిని ఉగ్రవాద సంస్థలు కబ్జా చేయవన్న గ్యారెంటీ లేదు. 1989లో ఉగ్రవాదం పురుడుపోసుకున్నప్పుడు ఇదే జరిగింది. జిహాద్ పేరిట ప్రారంభమైన ఈ హింసాత్మక ధోరణి అంతకంతకూ ముదిరిపోయింది. ముస్లిమేతర వ్యక్తులు లోయను విడిచి వెళ్లాలని, లేకపోతే బుల్లెట్లకు సిద్ధంగా ఉండాలని ఉగ్రవాద సంస్థలు ఏకంగా దినపత్రికల్లోనే ప్రకటనలు ఇచ్చాయి. కశ్మీర్.. ముస్లింలకు మాత్రమే సొంతమని బాహాటంగానే ప్రకటించాయి. ఈ ఉదంతాలు మళ్లీ పునరావృతం కావని చెప్పలేం.



**ప్రభుత్వ ఆంక్షలు కూడా ఉండే అవకాశం**

కశ్మీర్ లోయలో స్థిరపడాలని లేదా స్థలాలు కొనాలని చూసే ముస్లిమేతర వ్యక్తులను చంపాలని కశ్మీరీలకు కొందరు పాకిస్థాన్ నాయకులు, సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్లు కలిగిన కొందరు వ్యక్తులు పిలుపునిస్తూ విరివిగా ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి అనేక కారణాలు కశ్మీర్ లోయలో బయటి వ్యక్తులు స్థలాలు కొనడానికి అడ్డంకిగా ఉన్నాయి. దీంతోపాటు ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఈశాన్య రాష్ర్టాలు వంటి పర్వత ప్రాంత రాష్ర్టాల్లో స్థలాలు కొనుగోలు చేసే వాళ్లకు కొన్ని ఆంక్షలు ఉన్నట్టే, జమ్ముకశ్మీర్, లఢక్‌లో కూడా ప్రభుత్వం అలాంటి ఆంక్షలను కూడా విధించే అవకాశం లేకపోలేదు. ఇది కూడా కశ్మీర్ లోయలో స్థలాలు కొనుగోలు చేసే వాళ్లపై ప్రభావం చూపొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# పాక్‌కు భంగపాటు

- కశ్మీర్‌ను అంతర్జాతీయ వివాదంగా గుర్తించేందుకు భద్రతామండలి 'నో'
- భారత్-పాక్ ద్వైపాక్షికంగానే పరిష్కరించుకోవాలని అభిప్రాయం
- నిర్ణయాన్ని వెలువరించకుండానే ముగిసిన మండలి సమావేశం
- భారత్‌కే అత్యధిక దేశాల మద్దతు.. అంతర్జాతీయంగా ఒంటరైన పాక్
- ఉగ్రదేశానికి మద్దతిచ్చి పరువు పోగొట్టుకున్న చైనా

**ఐరాస, ఆగస్టు 17:** ఆర్టికల్ 370 రద్దు అంశంలో మొదటి నుంచీ 'అతి'గా ప్రవర్తిస్తున్న పాకిస్థాన్‌కు గట్టి షాక్ తగిలింది. జమ్ముకశ్మీర్‌పై పాక్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఒక్క చైనా తప్ప ప్రపంచదేశాలేవీ నమ్మడం లేదు. కశ్మీర్‌లో ఏదో జరిగిపోతున్నదని.. ఒప్పందాలను భారత్ ఉల్లంఘిస్తున్నదంటూ గొంతు చించుకొని అరుస్తున్నా కనీసం పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. మరోవైపు చైనా సైతం అంతర్జాతీయంగా తన పరువును పోగొట్టుకున్నది. ఉగ్రవాదానికి అడ్డాగా మారిన పాకిస్థాన్‌కు వంత పాడుతూ మరోసారి తన నైజాన్ని బయటపెట్టుకున్నది. తాజాగా ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలిలో సైతం పాక్‌కు భంగపాటు తప్పలేదు. కశ్మీర్ అంశంపై అత్యవసరంగా చర్చించేందుకు శుక్రవారం నిర్వహించిన భద్రతా మండలి సమావేశం.. ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. ఈ అంతర్గత సమావేశానికి ఐదు శాశ్వత సభ్యదేశాలు, పది ఆహ్వానిత సభ్య దేశాల ప్రతినిధులు హాజరైన సంగతి తెలిసిందే. గంటకుపైగా జరిగిన చర్చల్లో కేవలం ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకోవడానికే పరిమితమయ్యారు. ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. కనీసం ఉమ్మడి ప్రకటన కూడా విడుదల చేయలేదు. అయితే జమ్ముకశ్మీర్ అంశం పూర్తిగా ద్వైపాక్షికమని, సమస్యలపై భారత్-పాక్ కలిసి చర్చించుకోవాలని భద్రతామండలి ఒక అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. మండలిలోని శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, ఫ్రాన్స్, రష్యా, జర్మనీతోపాటు ఆహ్వానిత దేశాలైన ఐవరీకోస్ట్, గునియా, డొమినికన్ రిపబ్లిక్ వంటి దేశాలు భారత్‌కు అండగా నిలిచాయి. బ్రిటన్ నేరుగా మద్దతు ఇవ్వకున్నా.. ద్వైపాక్షిక అంశమని తేల్చిచెప్పింది. ఒక్క చైనా మాత్రమే పాక్‌కు మద్దతు పలికింది.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. చర్చల అనంతరం మీడియా ప్రకటన విడుదల చేయాలని చైనా వాదించింది. బ్రిటన్ సైతం ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపింది. అయితే.. 'కశ్మీర్ అంశాన్ని పాకిస్థాన్ అనేకమార్లు ఐరాసలో ప్రస్తావించింది. కానీ.. సమితి ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పుడూ ఇదే విధానాన్ని పాటిద్దాం. చర్చల అనంతరం కశ్మీర్‌పై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోబోవడం లేదు. మీడియా ప్రకటన కూడా లేదు' అని మండలి అధ్యక్షురాలు చైనాకు స్పష్టం చేశారు. 15 సభ్య దేశాల ప్రతినిధుల్లో అత్యధికశాతం మంది కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. సంయుక్త ప్రకటన విడుదల చేసేదిలేదని స్పష్టంచేశారు.

### చైనా-పాక్ కారిడార్ సంగతేంటి?

చర్చల సందర్భంగా సభ్యదేశాల ప్రతినిధుల్లో అత్యధికులు భారత్‌కే మద్దతుగా నిలిచినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా గుర్తించాలన్న పాక్ ప్రతిపాదనను తిరస్కరించాయి. జమ్ముకశ్మీర్ అంశం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, భారత్-పాక్ కలిసి పరిష్కరించుకోవాలని స్పష్టంచేశాయి. 'ఆర్టికల్ 370 పూర్తిగా మా అంతర్గత విషయం. మా రాజ్యాంగ పరిధిలో మార్పులు, చేర్పులు చేసుకోవడం అంతర్జాతీయ సమస్య ఎలా అవుతుంది? పక్కదేశంలో(పాక్‌లో) భద్రతా సమస్యలను ఎలా సృష్టించగలుగుతుంది?' అన్న భారత్ వాదనకు మద్దతు పలికాయి. కశ్మీర్‌లో మానవహక్కుల ఉల్లంఘన గురించి ప్రస్తావనకు రాగా.. 'చైనా గురివింద గింజ మాదిరిగా మానవహక్కుల గురించి మాట్లాడటంతో ఆ విషయంలోనూ పాకిస్థాన్‌కు భంగపాటు తప్పలేదు' అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 'ఒకవేళ 370 అధికరణ రద్దును ఒప్పందాల ఉల్లంఘనగా పాక్ భావిస్తుంటే.. మరి చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) సంగతేంటి?. పాక్ తన దేశంలో భౌగోళికంగా ఎన్ని మార్పులు చేసింది?' అని సభ్యదేశాలు ప్రశ్నించాయి. దీంతో చైనా గొంతులో పచ్చివెలక్కాయ పడింది. పాకిస్థాన్‌ను ఆదుకునేందుకే ఆ ప్రాజెక్టును చేపట్టామని చెప్తూ తప్పించుకున్నది. ఇది మండలి అధికారిక సమావేశం కాదని, అంతర్గత సంప్రదింపులు మాత్రమేనని కాబట్టి.. చర్చలకు సంబంధించి ఎలాంటి రికార్డులు, మినిట్స్ అందుబాటులో ఉండవని ఐరాస వర్గాలు చెప్పాయి. ఈ పరిణామాల నేపథ్యంలో చైనా ప్రతినిధి జాంగ్ జున్, పాక్ ప్రతినిధి మలీహా లోధి కశ్మీర్ సమస్యను భద్రతామండలి అంతర్జాతీయ అంశంగా గుర్తించిందని తప్పుడు ప్రకటన ఇచ్చారు.

## మండలిదే బాధ్యత

### కశ్మీర్ అంశంపై ఇమ్రాన్ వ్యాఖ్య

**ఇస్లామాబాద్:** కశ్మీర్ అంశంపై ఐరాస భద్రతామండలి రహస్య సంప్రదింపులు జరుపడాన్ని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ స్వాగతించారు. భద్రతామండలి దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత కశ్మీర్ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడం ఇదే మొదటిసారి అని, మండలి సమావేశాన్ని తాను స్వాగతిస్తున్నట్లు శనివారం ట్వీట్ చేశారు. వివాదాన్ని పరిష్కరించే బాధ్యత మండలిపై ఉన్నదన్నారు. మరోవైపు కశ్మీర్ అంశంలో భారత్-పాక్ ద్వైపాక్షిక చర్చల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇమ్రాన్‌ఖాన్‌కు సూచించారు. ఈ మేరకు అమెరికా అధ్యక్ష భవనం ఒక ప్రకటనలో తెలిపింది. ఐరాస భద్రతా మండలి భేటీకి ముందు ఇమ్రాన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడినట్టు పేర్కొన్నది.

**నెహ్రూ ఇండియాకు సమాధి : ఖురేషి**

నెహ్రూ భారతాన్ని నరేంద్రమోదీ సమాధి చేశారని పాక్ విదేశాంగ మంత్రి షా మహమ్మద్ ఖురేషి విమర్శించారు. 'దోవల్ సిద్ధాంతం' చుట్టూ భారత దౌత్యవిధానం తిరుగుతున్నదని ఆరోపించారు. అణ్వాయుధాల వినియోగంపై భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. కశ్మీర్ అంశంపై నుంచి ప్రపంచం దృష్టిని మరల్చేందుకు భారత్ దాడి చేసేందుకు అవకాశం ఉన్నదని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉన్నదని ఆర్మీ అధికార ప్రతినిధి మేజర్ జనరల్ అసిఫ్ గఫూర్ తెలిపారు.

## ప్రశాంత కశ్మీర్‌కు.. నాలుగు సూత్రాలు

- ప్రణాళిక రచిస్తున్న కేంద్రం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ అభివృద్ధే లక్ష్యంగా 370 అధికరణను రద్దు చేశామని కేంద్రం చెప్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారీగా భద్రతాబలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూస్తున్నది. అయితే ఈ ఆంక్షలను ఎక్కువకాలం కొనసాగించలేమని, ప్రజలను దీర్ఘకాలం నియంత్రించలేమని కేంద్రానికి తెలుసు. ఈ నేపథ్యంలో కశ్మీర్‌లో పూర్తిస్థాయిలో శాంతి నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నది. ఇందుకోసం నాలుగు సూత్రాలతో వ్యూహాలను సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది.

**1. మూవర్స్ అండ్ షేకర్స్ ఆటకట్టు**

చూడటానికి హుందాగా, మేధావులుగా కనిపిస్తూనే స్వార్థ ప్రయోజనాల కోసం హింసను ప్రేరేపించేవారిని కశ్మీర్ అధికారులు 'మూవర్స్ అండ్ షేకర్స్' అని పిలుస్తుంటారు. హురియత్ నేతలు, రాజకీయ పార్టీల నేతలను ఈ విభాగంలో ఉంచారు. కశ్మీర్‌లో ఘర్షణ జరిగినప్పుడల్లా వారిని గృహనిర్బంధంలో ఉంచుతున్నారు. ఇకపైనా దీనిని కొనసాగిస్తున్నారు.

**2. రాళ్లు విసిరే యువతకు బాండ్**

జమ్ముకశ్మీర్‌లో అశాంతి నెలకొనడం, వారాలపాటు కొనసాగడంలో రాళ్లు విసిరే మూకలది ప్రధాన పాత్ర. ఇందులో ఎక్కువ మంది యువకులే. వీరిని 'ఒప్పందం' ద్వారా నియంత్రించనున్నారు. మరోసారి రాళ్లదాడికి పాల్పడబోమంటూ యువకులతో ఓ బాండ్ రాయించి, వారి కుటుంబ సభ్యులతోపాటు పరిచయస్థులు కనీసం 20 మందితో సంతకాలు చేయించి ప్రభుత్వానికి అప్పగిస్తారు.

**3. ఉగ్రవాదులపై ఉక్కుపాదం**

పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లో హింసను సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. వీరిని నియంత్రించే బాధ్యత పూర్తిగా సైన్యానికి అప్పగించాలని, వారికి స్వేచ్ఛ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నది. మరోవైపు సరిహద్దులో భద్రతను పటిష్ఠం చేయనున్నది. జమ్ముతోపాటు పంజాబ్‌లోని సరిహద్దులో సైన్యం మోహరింపుపై సమీక్షించనున్నది.

**4. దుష్ప్రచారం చేసే మతపెద్దలపై నిఘా**

ప్రజలను ప్రభావితం చేసి తమ స్వార్థం కోసం వినియోగించుకునే మతపెద్దలను ఈ విభాగంలో చేర్చారు. వీరిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. వారిపై నిత్యం నిఘా పెడుతారు. అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అనుమానం వస్తే వెంటనే అరెస్ట్ చేస్తారు.

# ఉత్తరాదిన కుండపోత

- ప్రమాద సూచీ కంటే 12 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తున్న చంబల్ నది
- యమునా నదిలో క్రమంగా పెరుగుతున్న వరద ఉద్ధృతి



ఢిల్లీలో యమునా నది ఉద్ధృతి

**సిమ్లా/జైపూర్:** ఉత్తరభారతాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. పలుచోట్ల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాజస్థాన్, పంజాబ్, జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. రానున్న 48 గంటల్లో జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. కుండపోత వర్షాలకు పంజాబ్‌లోని బాక్రా డ్యాం నిండటంతో 53వేల క్యూసెక్కుల నీటిని అధికారులు కిందకు వదిలారు. రాజస్థాన్‌లో చంబల్ నది ప్రమాద సూచీ కంటే 12 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తున్నది. జమ్ములోని కథువా, సాంబ జిల్లాల్లో వరదలు పోటెత్తాయి. వరదల కారణంగా ఓ వ్యక్తి మరణించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లో కురుస్తున్న వర్షాలకు ఓ బాలుడు మృతిచెందాడు. హర్యానా, ఢిల్లీ గుండా ప్రవహిస్తున్న యమునా నదిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతున్నది. పశ్చిమ బెంగాల్‌లో కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. మరోవైపు, కేరళలో వరదల తీవ్రత తగ్గుముఖం పట్టింది. వరద బీభత్సానికి ఇప్పటివరకూ ఆ రాష్ట్రంలో 113 మంది చనిపోయినట్టు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానదిలో వరద పోటెత్తడంతో 87 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరదలధాటికి కృష్ణా జిల్లాలో ఓ బాలిక చనిపోయింది. దీంతో ఇప్పటివరకూ రాష్ట్రంలో మరణించినవారి సంఖ్య రెండుకు చేరింది.

# భూటాన్ మా ఆత్మీయ దేశం

- ఉన్నత శిఖరాలకు స్నేహబంధం: ప్రధాని మోదీ
- ఆ దేశ ప్రధాని షెరింగ్‌తో విస్తృత చర్చలు
- మాంగ్డెచ్చు జలవిద్యుత్ కేంద్రం ప్రారంభం
- రూపే కార్డు ఆవిష్కరణ
- ఇరుదేశాల మధ్య 10 అవగాహన ఒప్పందాలు



పారో విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలుకుతున్న భూటాన్ ప్రధాని షెరింగ్

**థింపు, ఆగస్టు 17:** భూటాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత ప్రధాని నరేంద్రమోదీ ఆ దేశ ప్రధాని లోటే షెరింగ్‌తో శనివారం విస్తృత చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధన, విమానయానం, విద్య, విద్యుత్, ఐటీ రంగాల్లో రెండు దేశాల మధ్య 10 అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరాయి. 'సమావేశంలో మేం విస్తృత చర్చలు జరిపాం. రెండు దేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరిచేందుకు అపార అవకాశాలు ఉన్నాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రెండోసారి భూటాన్ పర్యటనకు వెళ్లిన మోదీ.. మాంగ్డెచ్చు జలవిద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించారు. రెండు దేశాల మధ్య జలవిద్యుత్ ఉత్పత్తి సంబంధాలకు ఐదు దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో స్మారక స్టాంపులను ఆవిష్కరించారు.

**శాట్‌కామ్ నెట్‌వర్క్ ప్రారంభం**

పురాతన సింటోఖా డ్జాంగ్‌లో కొనుగోళ్లు జరుపడం ద్వారా భూటాన్‌లో రూపే కార్డును ప్రధాని మోదీ ఆవిష్కరించారు.ఇరుదేశాల మధ్య డిజిటల్ చెల్లింపులు, వాణిజ్యం, పర్యాటక రంగాల్లో సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు దోహదపడుతుందన్నారు.'సార్క్ కరెన్సీ స్వాప్ ఫ్రేమ్‌వర్క్'లో భాగంగా భూటాన్‌కు కరెన్సీ మార్పిడి పరిమితిని పెంచేందుకు భారత్ సానుకూలంగా ఉందన్నారు. విదేశీ మారక అవసరాల కోసం అదనంగా 100 మిలియన్ డాలర్లను అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. భారత్‌కు చెందిన నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్, భూటాన్‌కు చెందిన డ్రక్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ అనుసంధానానికి సంబంధించిన ఈ-ఫలకాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అలాగే భూటాన్‌లో దక్షిణాసియా ఉపగ్రహ సేవల వినియోగం కోసం ఇస్రో సహకారంతో అభివృద్ధి చేసిన శాట్‌కామ్ నెట్‌వర్క్, గ్రౌండ్ ఎర్త్ స్టేషన్‌ను సంయుక్తంగా ప్రారంభించారు. భూటాన్ ప్రధాని షెరింగ్ మాట్లాడుతూ.. పరిమాణం పరంగా భూటాన్, భారత్ వేర్వేరైనా విశ్వాసాలు, విలువలు, స్ఫూర్తి ఇరుదేశాలకూ ఒక్కటేనన్నారు. అంతకుముందు, తషిచోడ్జాంగ్ ప్యాలెస్‌లో ప్రధానికి సంప్రదాయ స్వాగతం లభించింది. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యాల్ వాంగ్‌చుక్‌తో ప్రధాని సమావేశమయ్యారు.

నమస్తే తెలంగాణ
# ఆట
8
[ కరీంనగర్ ]
ఆదివారం 18 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM

# సాయి ప్రణీత్‌కు రూ.2లక్షలు



## ఆర్థిక సహాయమందించిన క్రీడామంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ వ్యక్తిగత విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న హైదరాబాదీ పుల్లెంల సాయి ప్రణీత్ గౌడ్‌ను రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. శనివారం సచివాలయంలో ప్రణీత్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరుపున రెండు లక్షల రూపాయల ప్రోత్సాహకాన్ని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అందించారు. ఫిలిప్పీన్స్, బ్యాంకాక్, బల్గేరియా దేశాల్లో జరిగిన ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ టోర్నీల్లో సాయి ప్రణీత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఐస్ స్కేటింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో గత ఐదేండ్లుగా వరుసగా స్వర్ణాలు సాధించడం తో పాటుగా రోలర్ స్కేటింగ్‌లో మెరుగైన ప్రదర్శన చేసి రాష్ట్రానికి ఎంతో పేరు తెచ్చారని ఈ సందర్భంగా మంత్రి ప్రశంసించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రణీత్ తల్లిదండ్రులు పుల్లెంల రవీందర్ గౌడ్, అనుపమ పాల్గొన్నారు.



# నిఖత్ జరీన్‌కు రూ.లక్ష నజరానా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ వస్తున్న రాష్ట్ర యువ బాక్సర్ నిఖత్ జరీన్‌కు నజరానా దక్కింది. శనివారం గచ్చిబౌలి స్టేడియం వేదికగా మొదలైన హైదరాబాద్ అథ్లెటిక్స్ టోర్నీ ప్రారంభోత్సవంలో రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చీఫ్ జగన్‌మోహన్ రావు..జరీన్‌కు లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం అందించారు. రాష్ట్ర ఖ్యాతిని దశదిశలా వ్యాపింపచేస్తూ భవిష్యత్తులోనూ నిఖత్ పతకాలతో రాణించాలని జగన్ మోహన్‌రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర చెస్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ చీఫ్ స్టాన్లీ , జనరల్ సెక్రెటరీ సారంగపాణి, హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రాజేశ్ కుమార్ పాల్గొన్నారు.




జడేజా

# ఖేల్ రత్నకు దీపా మాలిక్

## అర్జున అవార్డుకు తెలుగు షట్లర్ సాయి ప్రణీత్
## జడేజా సహా మరో 18 మంది పేర్లు కూడా

**న్యూఢిల్లీ:** రియో పారాలింపిక్స్ రజత పతక విజేత, అథ్లెట్ దీపా మాలిక్.. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న'కు నామినేట్ అయింది. అర్జున అవార్డుకు తెలుగు షట్లర్ బి.సాయి ప్రణీత్, క్రికెటర్ రవీంద్ర జడేజా సహ 19మంది పేర్లను ప్రతిపాదించారు. ఇందులో హెప్టాథ్లాన్ స్టార్ స్వప్న బర్మన్ పేరు కూడా ఉంది. శనివారం రెండో రోజు సమావేశమైన విశ్రాంత జస్టిస్ ముకుంద కమ్ శర్మ నేతృత్వంలోని 12మందితో కూడిన క్రీడా అవార్డుల ఎంపిక కమిటీ.. తాము ప్రభుత్వానికి సిఫార్సు చేసిన క్రీడాకారుల పేర్లను ప్రకటించింది. తొలి రోజు ఖేల్‌రత్న అవార్డుకు ప్రపంచ నంబర్ వన్ రెజ్లర్ బజరంగ్ పేరును ప్రతిపాదించగా.. దీపా మాలిక్‌ను శనివారం నామినేట్ చేసింది. 2016 పారాలింపిక్స్ షాట్‌పుట్ ఎఫ్53 విభాగంలో దీపా మాలిక్ రజతం సాధించి.. పారాలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది. అలాగే ద్రోణాచార్య అవార్డుకు ముగ్గురు, జీవితకాల సాఫల్య పురస్కారానికి మరో ముగ్గురు, ధ్యాన్‌చంద్ అవార్డుకు ఐదుగురి పేర్లను కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

### ప్రణయ్ అసంతృప్తి

అర్జున అవార్డుకు తనను విస్మరించడంపై మరో తెలుగు షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసలు క్రీడా అవార్డుల ఎంపిక కమిటీ వేటిని ప్రాతిపదికగా తీసుకుందని ప్రశ్నించాడు. అయితే గతేడాది సరైన ప్రదర్శన చేయని కారణంగా ప్రణయ్ దరఖాస్తు పంపినా... తాము పరిగణనలోకి తీసుకోలేదని భారత బ్యాడ్మింటన్ సంఘం అధికారి ఒకరు చెప్పారు.

### బింద్రా ఆగ్రహం

యువ షూటర్లు మనూ భాకర్, సౌరభ్ చౌదరీ, అనీశ్ భన్వాలాకు శిక్షణనిస్తూ.. అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ కోచ్ జస్‌పాల్ రాణా పేరును ద్రోణాచార్య అవార్డుకు పరిగణించకపోవడంపై ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా ఆగ్రహం వ్యక్తం చేశాడు. వ్యక్తిగత విభాగంలో దేశం తరపున ఏకైక పసిడి సాధించిన బింద్రా క్రీడా అవార్డుల కమిటీ తీరును తప్పుపట్టాడు. మరోవైపు తన వ్యక్తిగత కోచ్ చోటేలాల్ యాదవ్ పేరు ద్రోణాచార్య అవార్డుకు సిఫార్సు కావడంతో పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందనే ఉద్దేశంతో స్టార్ బాక్సర్ మేరీకోం శనివారం అవార్డుల ఎంపిక ప్రక్రియకు దూరంగా ఉండిపోయింది.

### అర్జున నామినీలు వీరే

సాయి ప్రణీత్ (బ్యాడ్మింటన్), రవీంద్ర జడేజా(క్రికెట్), పూనమ్ యాదవ్(క్రికెట్), తేజీందర్ పాల్ సింగ్ తూర్ (అథ్లెటిక్స్), అనాస్ (అథ్లెటిక్స్), భాస్కరన్ (బాడీ బిల్డింగ్), సోనియా లాథర్ (బాక్సింగ్), చింగ్లెన్‌సనా (హాకీ), అజయ్ ఠాకూర్(కబడ్డీ), గౌరవ్ సింగ్ (మోటార్ స్పోర్ట్స్), ప్రమోద్ (పారా స్పోర్ట్స్-బ్యాడ్మింటన్), అంజుమ్ మౌద్గిల్ (షూటింగ్), హర్మీత్ (టేబుల్ టెన్నిస్), పూజా దండా (రెజ్లింగ్), ఫౌవా ద్ మీర్జా(ఈక్వెస్ట్రెయిన్), గుర్‌ప్రీత్ (ఫుట్‌బాల్), స్వప్న బర్మన్ (అథ్లెటిక్స్), సుందర్‌సింగ్ (పారా స్పోర్ట్స్-అథ్లెటిక్స్), సిమ్రన్ సింగ్ (పోలో).

## ప్రణీత్... మూడేండ్ల నిరీక్షణ



తెలుగు స్టార్ షట్లర్ భమిడిపాటి సాయి ప్రణీత్ మూడేండ్ల నిరీక్షణ ఫలించింది. అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నా.. ఇంతకాలం అర్జున అవార్డు దక్కని ప్రణీత్.. ఈసారి పురస్కారానికి నామినేట్ అయ్యాడు. 2017లో సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్‌ను ఓడించిన ప్రణీత్ టైటిల్ గెలుకుచుకొని సత్తా చాటాడు. 2018 లోనే అర్జున అవార్డు వస్తుందని అంచనా వేసినా.. అతడికి నిరాశ తప్పలేదు. గతేడాది కాస్త వెనుకబడిన ప్రణీత్... ఈ ఏడాది మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. స్విస్ ఓపెన్ ఫైనల్ చేరడం సహా జపాన్ ఓపెన్‌లో సెమీస్ వరకు వెళ్లాడు. పుల్లెల గోపీచంద్ శిష్యుడైన ప్రణీత్.. ఈ నెల 19 నుంచి స్విట్జర్లాండ్‌లో జరిగే బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ కోసం సన్నద్ధమవుతున్నాడు.

> ఈ గౌరవం పొందడం చాలా సంతోషంగా ఉంది. దీనికోసం మూడేండ్లుగా వేచిచూస్తున్నా. ఈ ఏడాది ఎంతో ఉత్సుకతతో చూశా. చివరికి నా పేరు నామినేట్ అయింది. అసలు రాకపోవడం కంటే ఆలస్యమవడమే మేలు కదా. 2017లో నా ప్రదర్శన బట్టి గతేడాదే అవార్డు వస్తుందనుకున్నా. అయితే ఈ సారి బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు రెండు రోజుల ముందు అవార్డు అందుకుంటే నా ఆత్మస్థైర్యం మరింత పెరుగుతుంది. దేశం కోసం మరింత అత్యుత్తమంగా ఆడేందుకు నాకు ప్రేరణకలిగిస్తుంది. **-సాయి ప్రణీత్**

## బలమైన భవిష్యత్తు వైపు అడుగులు
## వచ్చే రెండేండ్లు పరివర్తన దశ
## కోచ్ రవిశాస్త్రి ఇంటర్వ్యూ

# వారసత్వం వర్ధిల్లాలి!



**అంటిగ్వా:** నిలకడైన ప్రదర్శనతో పాటు బలమైన వారసత్వాన్ని నిర్మించడమే ధ్యేయంగా ముందుకు వెళ్లనున్నట్లు టీమ్‌ఇండియా కోచ్ రవిశాస్త్రి పేర్కొన్నాడు. ప్రస్తుతం జట్టు కనబరుస్తున్న ఆటతీరును మరింత ఉన్నత స్థితికి చేర్చడమే వచ్చే రెండేండ్లలో తన ముందున్న లక్ష్యమని అతడు స్పష్టం చేశాడు. అయితే అక్కడితో ఆగకుండా.. భవిష్యత్తు తరాలు కూడా ఆ వారసత్వాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకుంటానని అతడు అన్నాడు. గత రెండేండ్లుగా భారత హెడ్ కోచ్‌గా పనిచేసిన రవిశాస్త్రి శుక్రవారం తిరిగి రెండేండ్ల కాలానికి కోచ్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. మహామహులు పాల్గొన్న ఎంపిక ప్రక్రియలో కపిల్ దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ (సీఏసీ) రవిశాస్త్రికే ఓటేసింది. భవిష్యత్తు ప్రణాళికలపై స్పష్టమైన అవగాహనతో పాటు దార్శనికత, భావవ్యక్తీకరణ నైపుణ్యంతో సీఏసీ మనసు గెలుచుకున్న రవిశాస్త్రి సొంతగడ్డపై 2021 వరల్డ్ టీ20 వరకు ఈ పదవిలో కొనసాగనున్నాడు. వెస్టిండీస్ టూర్‌లో భాగంగా కరీబియన్ దీవుల్లో ఉన్న శాస్త్రి రెండోసారి కోచ్‌గా ఎంపికైన అనంతరం.. తన ముందున్న లక్ష్యాలు, అందుకు తగ్గ మార్గాల గురించి సవివరంగా తెలిపాడు. ఈ సందర్భంగా కపిల్ దేవ్, అన్షుమన్ గైక్వాడ్, శాంతా రంగస్వామితో కూడిన సీఏసీకి ధన్యవాదాలు తెలిపిన శాస్త్రి.. భారత జట్టుతో కలిసి పనిచేసే అవకాశం మరోసారి రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నాడు. మరిన్ని వివరాలు అతడి మాటల్లోనే..

### పరివర్తన దశ

రాబోయే రెండేండ్లు జట్టు పరివర్తన దశగా భావించొచ్చు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొత్త కుర్రాళ్ల రాక ఆరంభమైంది. టెస్టు క్రికెట్‌లోనూ ఇది కొనసాగనుంది. సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్న మరో నలుగురైదుగురు బౌలర్లను గుర్తించాల్సి ఉంది. తద్వారా 26 నెలల తర్వాత జట్టును సంతోషకరమైన స్థానంలో నిలుపడమే నా ధ్యేయం. అప్పుడే బలమైన వారసత్వాన్ని కొనసాగించే దిశగా అడుగులు పడుతాయి. ఆడుతున్నంత సేపు అత్యుత్తమంగా ఆడాం. ఆ తర్వాత వదిలేశాం అనేలా కాకుండా భవిష్యత్తులోనూ మంచి ప్రదర్శన చేసే విధంగా వారసత్వానికి దిశానిర్దేశం చేయాలి. తర్వాతి తరాలు దీన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి. గతంలో కొన్ని జట్లు ఆటను శాసించినట్లు మన టీమ్ కూడా అలా ఎదగడం ముఖ్యం. అదే నా ఆకాంక్ష. ప్రస్తుతం మేం ఆ దారిలోనే ఉన్నాం. మెరుగయ్యేందుకు ఎల్లప్పుడూ అవకాశం ఉంటుంది. యువతరం రంగప్రవేశం చేస్తున్నది కాబట్టి ఎంతో ఆత్రుతగా ఉంది.

### విఫలమైన చోటే ఆగిపోవద్దు

ఒక్క వైఫల్యంతోనే ఆగిపోవద్దు. ఏదో ఒక రోజు విఫలమయ్యామని అక్కడే ఉండిపోకూడదు. అడ్డంకులను అధిగమించి ముందుకెళ్లడంపై దృష్టి పెట్టాలి. ఆటలో మెళకువలు నేర్చుకుంటూ.. పరిమితులను అధిగమించేందుకు అహర్నిశలు కష్టపడ్డప్పుడే మనలోని అసలు సత్తా ఏంటో తెలుస్తుంది. నిశితమైన దృష్టితో ముందుకు సాగినప్పుడే అది సాధ్యమవుతుంది. అదే ఈ జట్టు ప్రయత్నం. రెండు మూడేండ్లుగా టీమ్‌ఇండియా ఆటతీరు గమనిస్తే.. ఎంత నిలకడగా ఆడుతుందో అర్థమవుతుంది. ఆటగాళ్లు కొన్ని ప్రమాణాలు నిర్దేశించుకున్నారు. ఇప్పుడా పరిమితిని మరింత పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. కొన్నిసార్లు ఫలితాలు బాగున్నప్పటికీ ఏది ఉత్తమ కూర్పో గుర్తించలేం. అందుకే యువతను తీర్చిదిద్దుకోవాలి. వారిపై నమ్మకముంచితే కూర్పులో వెసులుబాటు లభిస్తుంది.

### ఫీల్డింగ్‌లో భేష్

గత నాలుగైదేండ్ల కాలంలో భారత జట్టు ఫీల్డింగ్‌లో గణనీయమైన మార్పు వచ్చింది. టీమ్‌ఇండియా ఫీల్డింగ్ ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయి. ప్రపంచంలోనే అత్యుత్తమ ఫీల్డింగ్ బృందంగా నిలువడమే ఇక మా ముందున్న లక్ష్యం. జట్టులో చోటు ఆశిస్తున్న ప్రతీ ఒక్కరికి ఇదే నియమం వర్తిస్తుంది. జాతీయ జట్టుకు ఆడుతున్నప్పుడు అత్యుత్తమ ఫీల్డర్‌గా ఉండటం అందరి బాధ్యత. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇది అత్యవసరం కూడా. ఇప్పుడున్న నిలకడను మరోస్థాయికి తీసుకెళ్లడమే ఆటగాళ్లు, కోచ్‌లు, యాజమాన్యం ముందున్న లక్ష్యం.

## సీఏసీ ప్రమేయం ఉండదు

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా హెడ్‌కోచ్‌ను ఎంపిక చేసిన క్రికెట్ సలహాదారుల కమిటీ (సీఏసీ).. ఇతర శిక్షణ సిబ్బంది ఎంపికలో పాల్గొనే అవకాశం లేదని బీసీసీఐ అధికారి తెలిపారు. సహాయక సిబ్బంది ఎంపికలోనూ సీఏసీ ప్రమేయం ఉండాలని కమిటీ చీఫ్ కపిల్ దేవ్ అభిప్రాయపడ్డా.. అది సాధ్యపడేలా కనిపించడం లేదు. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ కోచ్‌లను ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ సోమవారం ఎంపిక చేయనుంది. అయితే.. ప్రస్తుతం బౌలింగ్ కోచ్‌గా పనిచేస్తున్న భరత్ అరుణ్‌ను తిరిగి కొనసాగించడం దాదాపు ఖాయంగానే కనిపిస్తున్నది.గత కొన్నేండ్లుగా ఇంటాబయట మన పేసర్లు దుమ్మురేపుతుండటంతో అతడి స్థానానికి ఎలాంటి ఢోకా ఉండకపోవచ్చు. ఈ పదవికి భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్, డారెన్ గాఫ్, సునీల్ జోషి కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఇక ఫీల్డింగ్ కోచ్ స్థానానికి ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్. శ్రీధర్‌కు దక్షిణాఫ్రికా స్టార్ జాంటీ రోడ్స్ నుంచి తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఎటొచ్చి బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ స్థానానికే ఎసరొచ్చేలా కనిపిస్తున్నది.


స్మిత్ (92)

# స్మిత్ మరోసారి

## ఆసీస్‌ను ఆదుకున్న మాజీ సారథి.. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 96/4

**లండన్:** మాజీ సారథి స్టీవ్‌స్మిత్(161 బంతుల్లో 92, 14ఫోర్లు) మరోసారి ఒంటరి పోరాటం చేయడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో మంచి స్కోరు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ తడబడటంతో రెండో టెస్టు రసకందాయంలో పడింది. యాషెస్ సిరీస్‌లో భాగంగా లార్డ్స్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు నాలుగోరోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 4 వికెట్ల నష్టానికి 96 పరుగులతో నిలిచింది. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా.. ప్రస్తుతం ఇంగ్లండ్ 104 పరుగుల ఆధిక్యంలో ఉంది. బెన్ స్టోక్స్ (16), బట్లర్ (10) క్రీజులో ఉన్నారు. రాయ్(2), రూట్(0) మరోసారి నిరాశ పరిచారు. రోజర్ బర్న్స్(29), డెన్లీ(26) కాసేపు పోరాడారు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్, సిడిల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 80/4తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా స్మిత్ అద్వితీయ పోరాటంతో ఆఖరికి 250 పరుగులకు ఆలౌటైంది. వెడ్(6) త్వరగానే ఔటైనా కెప్టెన్ టిమ్ పైన్(23)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆరో వికెట్‌కు 60 పరుగులు జోడించాక పైన్ వెనుదిరిగాడు. జట్టు స్కోరు 203/6 ఉన్న సమయంలో 148 కిలోమీటర్ల వేగంతో ఆర్చర్ వేసిన ఓ బౌన్సర్ నేరుగా స్మిత్ తలకు తాకింది. నొప్పితో విలవిల్లాడి అక్కడే కుప్పకూలిన స్మిత్ రిటైర్డ్‌హర్ట్‌గా పెవిలియన్ చేరాడు. కాసేపటికే సిడిల్(9) ఔటవడంతో.. మరోసారి క్రీజులోకి వచ్చిన స్మిత్.. పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. అయితే సెంచరీకి చేరువైన స్మిత్‌ను వోక్స్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆసీస్ ఇన్నింగ్స్ ముగియడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

### సంక్షిప్త స్కోర్లు

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 258, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 250**(స్మిత్ 92, ఖవాజా 36; బ్రాడ్ 4/65, వోక్స్ 3/61)
**ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 96/4** (స్టోక్స్ 16 నాటౌట్, బట్లర్ 10 నాటౌట్; కమిన్స్ 2/16, 2/19)

### భారత్ శుభారంభం

**టోక్యో:** టోక్యో ఒలింపిక్(2020) టెస్ట్ ఈవెంట్‌లో భారత జట్లు శుభారంభం చేశాయి. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో పురుషుల జట్టు 6-0తో మలేషియాను చిత్తు చేయగా, మహిళల జట్టు 2-1తో జపాన్‌పై గెలిచింది. పురుషుల మ్యాచ్‌లో వరుణ్ (9.ని.) తొలి గోల్ చేయగా... గుర్‌సాహిబ్‌జీత్ సింగ్ (18ని., 56ని.)రెండో గోల్స్‌తో మెరిశాడు. ఇక మణ్‌దీప్ సింగ్ (34ని., 47ని.) కూడా డబుల్ ధమాకా కొట్టగా, చివరి నిమిషంలో సునీల్ బంతిని గోల్ పోస్టులోకి బాదడంతో భారత్ 6-0తో గెలిచింది. భారత మహిళల మ్యాచ్‌లో పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్ గుర్జీత్ కౌర్ (9ని.,35ని.) డబుల్ గోల్స్ చేసి జట్టును గెలిపించింది. తొమ్మిదో నిమిషంలో గుర్జీత్ గోల్ కొట్టగా, జపాన్ క్రీడాకారిణి అకి ముత్సుహాషీ(16ని.) స్కోర్‌ను సమం చేసింది. అయితే 35వ నిమిషంలో వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను గుర్జీత్ అద్భుత షాట్‌తో గోల్‌గా మలిచి భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లింది.






# బోస్ కిరణ్‌కు కాంస్యం

**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రపంచ పోలీస్ క్రీడల్లో తెలంగాణకు చెందిన ఇన్‌స్పెక్టర్ ఎన్. బోస్‌కిరణ్ రెండు కాంస్య పతకాలు సాధించాడు. చైనాలో జరుగుతున్న ఈ పోటీల్లో సైబరాబాద్ కమిషనరేట్ కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ బ్యాడ్మింటన్ (35 ప్లస్ వయోవిభాగం) సింగిల్స్, డబుల్స్‌లో కాంస్యాలు చేజిక్కించుకున్నాడు. ప్రపంచ స్థాయిలో సత్తాచాటిన కిరణ్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

# గెలుపు దిశగా లంక!

## లక్ష్యం 268, ఛేదనలో 133/0


దిముత్ కరుణరత్నే (71)

**గాలె :** స్పిన్‌కు స్వర్గధామంగా మారిన పిచ్‌పై న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఓపెనర్లు అదరగొట్టారు. నాలుగో రోజైన శనివారం 268 పరుగుల లక్ష్యఛేదనలో కెప్టెన్ దిముత్ కరుణరత్నె(71), లహిరు తిరిమన్నె(57 నాటౌట్) తొలి వికెట్‌కు 133 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని జత చేయడంతో లంక విజయం దిశగా సాగుతున్నది. బంతి గిరగిరా తిరుగుతున్న పిచ్‌పై మొదట్లో నెమ్మదిగా ఆడిన ఓపెనర్లు 22వ ఓవర్ వరకు ఒక్క బౌండరీ బాదలేదు. అయితే ఆ తర్వాత కరుణరత్నె స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లు సమర్థవంతంగా ఆడాడు. అప్పటి నుంచి లంక ఓపెనింగ్ ద్వయం అడపాదడపా బౌండరీలు బాది కివీస్ బౌలర్లపై ఒత్తిడి పెంచారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన న్యూడిలాండ్ బౌలర్ ఎజాజ్ పటేల్ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోగా... 20 ఓవర్లు వేసిన సోమర్‌విల్లె పొదుపుగా బౌలింగ్ చేసినా వికెట్ తీయడంలో విఫలమయ్యాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 195/7తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ చివరకు 285 పరుగులకు ఆలౌటైంది. వాట్లింగ్ (77) సహా లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ రాణించారు. శాంట్నర్(12) త్వరగానే ఔటైన ఏడో వికెట్‌కు సౌథీ(23)తో కలిసి వాట్లింగ్ 54 పరుగులు జత చేశాడు. ఆ తర్వాత ఎనిమిదో వికెట్‌కు సోమర్‌విల్లె(40)తో 44 పరుగుల భాగస్వామ్యం నమోదైన తర్వాత లహిరు కుమార్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం బౌల్ట్(26), ఏజాజ్(14) విలువైన పరుగులు జత చేయడంతో కివీస్ లంక ముందు 268 పరుగుల కఠిన లక్ష్యాన్ని ఉంచింది. గాలేలో ఇంత వరకు నాలుగో ఇన్నింగ్స్‌లో 99 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఏ జట్టు ఛేదించలేదు.

# పవన్ పరాక్రమం

## తమిళ్ తలైవాస్‌పై బెంగళూరు బుల్స్ గెలుపు

**ప్రొకబడ్డీలో నేడు**
హర్యానా X తెలుగు టైటాన్స్ 7.30గం.
తమిళ్ తలైవాస్ X పుణె 8.30గం.

**చెన్నై:** సొంతగడ్డపై ఆడిన తొలి మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ నిరాశ పరిచింది. ప్రొ కబడ్డీ లీగ్ 7వ సీజన్‌లో భాగంగా శనివారం నుంచి చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పోటీలు ప్రారంభం కాగా.. మొదటి మ్యాచ్‌లో తలైవాస్ 21-32తో ఓటమి పాలైంది. ఖాతా తెరిచేందుకే నానా తంటాలు పడ్డ తమిళ తంబీలు.. బుల్స్ రైడర్ పవన్ షెరావత్ ధాటికి ఒక్క పాయింట్ కూడా సాధించకుండానే ఆలౌటయ్యారు. ఫలితంగా బెంగళూరుకు ఆరంభంలోనే 10 పాయింట్ల ఆధిక్యం లభించింది. ఆ తర్వాత తేరుకున్న తలైవాస్ కాస్త పోటీనిచ్చినా.. ఎప్పటికప్పుడు ఆధిక్యాన్ని నిలుపుకుంటూ వెళ్లిన బుల్స్ అలవోకగా గెలుపొందింది. బుల్స్ తరపున పవన్ షెరావత్ (11 పాయింట్లు) ఆకట్టుకున్నాడు. బెంగాల్, దబంగ్ ఢిల్లీ మధ్య జరిగిన మరో మ్యాచ్ 30-30తో 'డ్రా'గా ముగిసింది.



ఆధునిక సాహితీరంగంలో బీఎస్ రాములు అద్భుతాలు సృష్టించారని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు 70వ జన్మదినోత్సవ పోస్టర్‌ను శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ రాములుతోపాటు కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, జూలూరు గౌరీశంకర్, ఆంజనేయగౌడ్, నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ మోహన్, ఉత్సవాల కమిటీ కన్వీనర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## రూల్స్‌పాటించని వాహనాలపై కొరడా

- ప్రత్యేక తనిఖీల్లో 75 లారీలు సీజ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిబంధనలకు విరుద్ధంగా అధిక బరువుతో తిరుగున్న లారీలపై రాష్ట్ర రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. విజిలెన్స్ డీటీసీ పాపారావు ఆధ్వర్యంలోని ఐదు ప్రత్యేక బృందాలు శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో 75 లారీలను సీజ్ చేసినట్లు పాపారావు తెలిపారు. నిబంధనలను పాటించకుండా అధిక బరువుతో తిరుగుతున్న లారీలతోపాటు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న లారీపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 15 మంది ఎంవీఐలు, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో 5 బృందాలను ఏర్పాటుచేసి లారీలను తనిఖీ చేయడంతో జరిమానా రూపంలో రూ.10 లక్షలకుపైగా ఆదాయం వచ్చిందని పాపారావు వెల్లడించారు. అక్రమంగా అధిక బరువుతో తిరుగుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గుండెపోటుతో హజ్ యాత్రికురాలు మృతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నుంచి హజ్‌కు వెళ్లిన ఒక యాత్రికురాలు శనివారం గుండెపోటుతో మరణించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన లతీఫ్ ఉన్నిసా (52) ఇటీవల హజ్ యాత్రకు వెళ్లారు. శ్వాస సంబంధ సమస్య తలెత్తడంతో మక్కా నగరంలోని ఓ దవాఖానలో చేర్పించారు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో ఆమె మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని తెలంగాణ మైనార్టీ సంక్షేమశాఖ, రాష్ట్ర హజ్ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది.

## రైతుల కోసం పరిశోధనలు చేయాలి

- వెటర్నరీ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ నరసింహన్ సందేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామీణప్రాంతాల్లో పాడి, మత్స్య, పౌల్ట్రీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న పేదరైతులకు మేలుచేసేలా పరిశోధనలు నిర్వహించాలని గవర్నర్ నరసింహన్ ఆకాంక్షించారు. పశువైద్యంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరుగాలని సూచించారు. పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయ ప్రథమ స్నాతకోత్సవం రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగింది. పశువైద్యశాస్త్రంలో 22 మందికి పీహెచ్‌డీ పట్టాలు, మరో 322 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. తమిళనాడు పశువైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ బాలచంద్రన్, వర్సిటీ వీసీ సందీప్‌కుమార్ సుల్తానియా, రిజిస్ట్రార్ డాక్టర్ వీరోజీరావు, డీన్ డాక్టర్ నర్సింహారెడ్డి, పాలకమండలి సభ్యులు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలకు వీహబ్ అండ

## వ్యాపారరంగంలో మహిళలకు ప్రత్యేక శిక్షణ



శనివారం జూబ్లీహిల్స్‌లో వీ హబ్ నూతన కార్యక్రమాలను వివరిస్తున్న సీఈవో దీప్తి. చిత్రంలో వైస్ ప్రెసిడెంట్ కే శకుంతల, పాలసీ మేనేజర్ దుర్గారవింద్రన్‌కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అన్ని రంగాల్లో ప్రత్యేకతను చాటుకొంటున్న మహిళామణులు, ప్రత్యేకించి గ్రామీణ మహిళలు వ్యాపారరంగంలో నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ఐటీ శాఖ పరిధిలోని వీహబ్ మరో అవకాశాన్ని కల్పించనున్నది. జర్మనీకి చెందిన డచ్ గెచెల్ సాఫ్ట్ ఫుర్ ఇంటర్నేషనల్ జుసంమెనర్బీట్ (జీఐజెడ్-గిజ్).. వీహబ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ఫలితంగా రాష్ట్రంలోని మహిళలందరికీ ఈ అవకాశం అందుబాటులోకి రానున్నది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో మహిళల సాధికారత కోసం కృషిచేస్తున్న 'గిజ్' సంస్థ మన దేశంలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నది. భౌగోళిక, సాంఘిక కారణాల రీత్యా భారత్‌లోని మహిళలను మూడు విభాగాలుగా వర్గీకరించిన ఈ సంస్థ.. మహిళా వ్యవస్థాపకశక్తిలో ముందంజలో ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో వ్యాపార శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని భావించింది. మహిళా సాధికారత కోసం విశేషకృషి చేస్తున్న వీహబ్‌తో కలిసి రెండు సంవత్సరాల ప్రాజెక్టును చేపట్టేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం వీహబ్ ఆధ్వర్యంలో రెండు రకాలైన కార్యక్రమాలు ఏకకాలంలో సాగనున్నాయి. వీటిలో ఒకటి ఇంక్యుబేషన్ కార్యక్రమం కాగా.. మరొకటి యాక్సిలరేషన్ కార్యక్రమం. ఇంక్యుబేషన్‌లో భాగంగా వ్యాపారాన్ని ప్రారంభించేందుకు సరైన ఆలోచనలున్న మహిళలను గుర్తించి వారి ఆలోచనలను ఉత్పాదనలుగా మార్చేందుకు శిక్షణను, మార్గదర్శకాన్ని అందజేస్తుంది. యాక్సిలరేషన్‌లో భాగంగా ఇప్పటికే వ్యాపారాన్ని నిర్వహిస్తున్న మహిళలు ఆ రంగంలో మరింత ఎదిగేందుకు చేయూతనిస్తుంది. వ్యాపారరంగంలో ఎదగాలనే ఆకాంక్ష, అందుకు తగిన ఆలోచనలున్నవారు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని వీహబ్ సీఈఓ దీప్తి రావుల, వైస్‌ప్రెసిడెంట్ (రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) కే శకుంతల, పాలసీ మేనేజర్ దుర్గారవింద్రన్ శనివారం వీహబ్ కార్యాలయంలో 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. శిక్షణ కోసం info-wehub<\@>telangana.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, మీ-సేవా కేంద్రాల నుంచి కూడా దరఖాస్తులు పంపవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో క్షేత్రస్థాయి లోనే ఈ శిక్షణను అందజేస్తామని, మహిళలు ఈ శిక్షణ కోసం హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం ఉండదని వారు స్పష్టంచేశారు.




# సర్కారీ స్కూళ్లు కళకళ

## 6-10 తరగతుల్లో ప్రైవేట్ కంటే ఎక్కువ ప్రవేశాలు నమోదు

- గురుకులాల ఏర్పాటుతో పెరిగిన వలసలు
- వివరాలు వెల్లడించిన విద్యాశాఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రమంగా విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. గత రెండు విద్యాసంవత్సరాలుగా అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సర్కారీ విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. ఈ క్రమంలో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రైవేట్ విద్యాసంస్థలతో పోల్చితే ప్రభుత్వానికి చెందిన విద్యాసంస్థల్లోనే అధిక సంఖ్యలో ప్రవేశాలు నమోదవుతున్నాయని విద్యాశాఖ విడుదల చేసిన లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా ఇంగ్లిష్ బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత మధ్యాహ్న భోజనం, రెండు జతల ఉచిత యూనిఫారాల పంపిణీతోపాటు నాణ్యమైన విద్యావిధానం అందుబాటులోకి వచ్చింది. ప్రతియేటా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతున్నదని ఆ శాఖ అధికారులు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో కొంతవరకు ప్రవేశాలు తక్కువగా ఉన్నప్పటికీ.. గురుకుల విద్యావిధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా భారీగా విస్తరించడం వల్ల 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలు మాత్రం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకులాలు, తెలంగాణ గురుకుల విద్యాలయాలు, కేజీబీవీలతోపాటు మోడల్ స్కూళ్లు.. ఇలా అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. ఈ క్రమంలో గురుకులాలు, మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం విద్యార్థుల మధ్య పోటీ పెరుగుతున్నదని మోడల్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఎస్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

### గత రెండేండ్లలో 6 నుంచి 10 తరగతుల్లో నమోదైన ప్రవేశాలు

| | 2017-18 | | | 2018-19 | | |
|---|---|---|---|---|---|---|
| తరగతి | అన్ని యాజమాన్యాలలో | ప్రభుత్వ స్కూళ్లలో | ప్రైవేటు స్కూళ్లలో | అన్ని యాజమాన్యాలలో | ప్రభుత్వ స్కూళ్లలో | ప్రైవేటు స్కూళ్లలో |
| 6వ తరగతి | 5,75,516 | 3,04,804 | 2,70,712 | 5,69,983 | 2,85,726 | 2,84,257 |
| 7వ తరగతి | 5,73,581 | 3,12,723 | 2,60,858 | 5,63,976 | 3,02,673 | 2,61,303 |
| 8వ తరగతి | 5,54,669 | 3,05,916 | 2,48,753 | 5,48,870 | 3,07,387 | 2,41,483 |
| 9వ తరగతి | 5,35,904 | 2,91,012 | 2,44,892 | 5,40,715 | 2,97,213 | 2,43,502 |
| 10వ తరగతి | 5,18,454 | 2,71,616 | 2,46,838 | 5,33,005 | 2,79,700 | 2,53,305 |

# మహిళల భద్రతకు ప్రాధాన్యం

- పోలీసులపై చెడ్డపేరు పోయేలా కమ్యూనిటీ పోలీసింగ్
- ఎఫ్ఎల్వో 'ఫేస్ టు ఫేస్'లో డీజీపీ మహేందర్‌రెడ్డి



ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ముఖాముఖిలో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పౌరుల భద్రత, ప్రత్యేకించి మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని, పెట్టుబడులు వస్తాయన్న సీఎం కేసీఆర్ విశ్వాసానికి ప్రతీకగా ఈ ఐదేండ్లలో ఫలితాలు వస్తున్నాయన్నారు. తెలంగాణ ఏర్పడిన తొలి రోజు నుంచే సీఎం కేసీఆర్ శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, పోలీస్ శాఖకు అవసరమైన వనరులు సమకూర్చి బలోపేతానికి చర్యలు తీసుకున్నారని చెప్పారు. శనివారం పార్క్‌హయత్ హోటల్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డితో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్వో) 'ఫేస్ టు ఫేస్' నిర్వహించింది. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తీసుకుంటున్న చర్యలను వివరించారు. టెక్నాలజీని ఫోర్స్ మల్టిప్లయర్‌గా వాడటంతో ఫలితాలు వస్తున్నాయని, ఏ మూలన తప్పుచేసినా శిక్షలు తప్పవన్న భయాన్ని నేరస్థుల్లో తేవడంతో నేరాలు అదుపులోకి వచ్చాయని చెప్పారు. వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతూ 24 గంటలు ప్రజల రక్షణలో ఉంటున్నప్పటికీ పోలీసులపై ప్రజల్లో మంచి పేరు లేదని, అందుకే ప్రజలతో మమేకమయ్యేందుకు కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్‌సేఫ్టీ వింగ్ ఇంచార్జి స్వాతి లక్రా, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సోనాచత్వాని, తదితరులు పాల్గొన్నారు.




టీఎన్జీవో హైదరాబాద్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు రాయకంటి ప్రతాప్ తదితరులు ఉన్నారు

## ప్రభుత్వంతో చర్చించి పీఆర్సీ సాధిస్తాం

ఏపీలోని రాష్ట్ర ఉద్యోగులను తీసుకొస్తాం: టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యోగుల అంశంలో ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని, త్వరలో తీపి కబురు వస్తుందని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. టీఎన్జీవో హైదరాబాద్ అధ్యక్షుడు రాయకంటి ప్రతాప్ అధ్యక్షతన శనివారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో పీఆర్సీ సాధిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. కొంతమంది ఉద్యోగులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపిచ్చారు. ఏపీలో పని చేస్తున్న తెలంగాణ ప్రాంత ఉద్యోగులను రాష్ట్రానికి తీసుకొస్తామని చెప్పారు. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, అసోసియేషన్ నేతలు నిరంజన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింగరావు, వెంకటేశ్వర కుమార్, శ్రీరాం, విజయమోహన్‌రావు, బాలరాజు, కృష్ణ, విఠల్‌బాబు, రేవతి, వినోద్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడిలో బందీ ఏనుగులు!

- నిర్వహణ తీరు సరిగా లేకపోవడమే కారణం
- ఏనుగుల వల్ల ఒక్క కేరళలో 274 మంది మృతి
- సీసీఎంబీ అధ్యయనంలో పలు విషయాలు వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆసియా దేశాల్లో ఏనుగులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక పరమైన ప్రత్యేక గుర్తింపు ఉన్నది. దాదాపు 20 శాతానికిపైగా ఆసియా ఏనుగులు నిర్బంధంలో ఉండి పర్యాటక, ఆధ్యాత్మిక, అటవీ శాఖ అవసరాల కోసం పనిచేస్తున్నాయి. మనుషులను అంబారీపై ఎక్కించి తిప్పడం కూడా ఇందులో భాగమే. ఇలాంటి ప్రక్రియల వల్ల భౌతిక, మానసిక ఒత్తిడికి ఏనుగులు గురవుతున్నాయని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనివల్ల బందీగా ఉంటున్న ఏనుగుల ప్రవర్తనలో మార్పు, దీర్ఘకాలిక మనుగడపై ప్రభావం పడుతున్నదని స్పష్టంచేశారు. కేరళ సంప్రదాయ వేడుకల్లో ఏనుగులకు ప్రత్యేక స్థానం ఉన్నదని, అయితే బందీగా ఉన్న ఏనుగులు పలు సందర్భాల్లో అదుపుతప్పి ప్రవర్తించడం వల్ల 1989 నుంచి 2003 వరకు 274 మంది.. ఏడాదికి సగటున పది మంది మరణించినట్టు పేర్కొన్నారు. బందీలుగా ఉన్న ఏనుగుల ఆరోగ్యంపై సీసీఎంబీకి చెందిన అంతరిస్తున్న జాతుల సంరక్షణ ప్రయోగశాల ముఖ్య శాస్త్రవేత్త జీ ఉమాపతి అధ్యయనం జరిపారు. 87 ఏనుగుల్లో గ్లూకోకోర్టికాయిడ్ మెటబాలిజం (స్ట్రెస్ హార్మోన్) స్థాయిని పరిశీలించారు. వినోద్‌కుమార్, ముత్తులింగం, ప్రదీప్స్, ఆదిశేషు, రాజశేఖర్ భాగస్వాములుగా జరిపిన ఈ పరిశోధన నివేదిక ఇటీవల ఈ జర్నల్ ఆనిమల్స్‌లో ప్రచురితమైంది. అలా జరుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా తమ నివేదికలో సూచించారు. మతపరమైన వ్యవహారాలు, ఊరేగింపులు, అటవీ శాఖ ప్రక్రియల్లో ఏనుగుల భాగస్వామ్యాన్ని తగ్గించాలని, వాటి సంతానోత్పత్తిపై ప్రభావం పడకుండా 20-55 ఏండ్ల వయస్సున్న ఆడ ఏనుగులను ఒత్తిడి ఎదుర్కొనే పనుల్లో వినియోగించవద్దని పేర్కొన్నారు. మగ ఏనుగులను 3-4 గంటలు వినియోగించుకోవచ్చని, అనంతరం తప్పక ఒకట్రెండు రోజులు విశ్రాంతి ఇవ్వాలన్నారు. ఏనుగుల ఒత్తిడిపై ఇప్పటివరకు పెద్దగా అవగాహన లేదని, ఈ సూచనలు వాటి అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతాయని సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా ఈ సందర్భంగా చెప్పారు.










# విద్యుత్ బిల్లులపై అపోహలొద్దు

## సోషల్ మీడియా ప్రచారంపై విద్యుత్ శాఖ వివరణ


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరంట్ మీటర్ రీడింగ్ ఆలస్యంగా ఇచ్చినందుకు ఎక్కువ బిల్లు వస్తున్నదని ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఎస్పీడీసీఎల్ అధికారులు అభయమిస్తున్నారు. రీడింగ్ తీయడంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచిస్తున్నారు. గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఎస్పీడీసీఎల్ అధికారులు ఒక ప్రకటన జారీ చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి, వాస్తవ పరిస్థితులకు ప్రజలు సందేహాలకు లెక్కల రూపంలో వివరణ ఇచ్చారు. విద్యుత్ కార్మికులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో పని చేస్తున్నారని, ఆధారం లేని అపోహలతో వాళ్లను కించపరచకుండా సహకారం అందించాలని అధికారులు సూచించారు.

**ఇదీ స్లాబ్ విధానం:**

క్యాటగిరీ 1ఏ (నెలకు 100 యూనిట్ల వాడకం లోపల ఉంటే) 0-50 యూనిట్ల వరకు రూ.1.45, 51-100 యూనిట్ల వరకు రూ.2.60, క్యాటగిరీ 1బీ (i) (నెలసరి విద్యుత్ వాడకం 100 నుంచి 200 యూనిట్ల మధ్య ఉంటే) 0 -100 యూనిట్ల వరకు రూ.3.30, 101-200 యూనిట్ల వరకు రూ.4.60, క్యాటగిరీ 1బీ (ii) (నెలసరి విద్యుత్ వాడకం 200 యూనిట్ల పైబడి ఉంటే) 0-200 కు రూ. 5.00, 201-300 యూనిట్లకు రూ. 7.20, 301-400 యూనిట్ల వరకు రూ. 8.50. ఒక ఇంట్లో నెలలో 199 యూనిట్ల వాడకం ఉంటే వచ్చే బిల్లు (క్యాటగిరీ 1బీ (i)) 0-100=100x3.3=రూ.333/-,101-199=99x4.30=రూ.425.70/-. మొత్తం విద్యుత్ చార్జీలు రూ.333+425.70=రూ.758.70. దీనిపైన రూ. 60-75 వరకు కనీస చార్జీలతో కలిసి రూ.830 వరకు బిల్లు వస్తుంది. మీటరు రీడింగ్ మూడురోజులు ఆలస్యంగా తీయడం వల్ల స్లాబ్ మారి బిల్లు ఎక్కువగా వస్తున్నదనేది తప్పుడు ప్రచారం. నెలకు బదులుగా 33వ రోజు 208 యూనిట్లుగా రీడింగ్ వచ్చిందనుకొంటే.. 33 రోజులకు అనుగుణంగా స్లాబ్ రేట్లు కూడా మారుతాయి. సరిగా 30 రోజులకు రీడింగ్ తీసినప్పుడే స్లాబ్ రేట్లు వర్తిస్తాయి. 0-110 యూనిట్లకు రూ.3.30, 111-220 యూనిట్లకు రూ.4.30 చొప్పున బిల్లు లెక్కిస్తే 0-110=110x3.3=రూ.363/-, 111-208=108X4.3=రూ.464.40. మొత్తంగా విద్యుత్ చార్జీలు రూ.827.40గా వస్తాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ప్రకారం లెక్కిస్తే బిల్లు 200 యూనిట్లు దాటితే క్యాటగిరీ 1బీ (ii) లో చేరి 0-200=200x5=రూ.1,000/-, 201-208 = 8x7.2=రూ.57.60/-. మొత్తంగా రూ.1057.60 గా బిల్లు వస్తుంది. ప్రతి ఇంటికి 30 రోజుల వ్యవధిలో బిల్లు ఇవ్వడం సాధ్యపడదని, పండుగలు, సెలవులు ఇతర కారణాలతో ఆలస్యంగా రీడింగు తీసినా బిల్లు ఎక్కువ రాదని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని, విద్యుత్ సంస్థలు చాలా ఏండ్లుగా ఇదే విధానాన్ని ఆచరిస్తున్నాయని విద్యుత్‌శాఖ అధికారులు స్పష్టంచేశారు.

## గురుకుల టీచర్లకు చైల్డ్ కేర్ లీవ్‌లపై హామీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గురుకుల టీచర్లకు చైల్డ్ కేర్ లీవ్‌లను వర్తింపచేయడానికి విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలంగాణ గురుకుల విద్యాలయాల సొసైటీ టీచర్ల సంఘం రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్బారావు, రవిచందర్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, గురుకుల విద్యాలయాల సంస్థ సొసైటీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డితో విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి చర్చించారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే పాలకమండలి సమావేశం ఏర్పాటుచేసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.



నమస్తే తెలంగాణ

# జిందగీ

ఆదివారం 18 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



- **సినిమాలు కాకుండా మీకు ఇష్టమైనవి..**
- డ్యాన్స్ చేస్తాను. పుట్‌బాల్ ఆడతాను. పెయింటింగ్స్, రచనలు.. ఇలా చాలా పనులు చేస్తుంటాను. కొత్త విషయాల గురించి తెలుసుకోవడం అంటే ఇష్టం.

# అక్క సలహాలు ఇవ్వదు

**నటనకు పుట్టినిల్లు ఆమె కుటుంబం. నాన్న కమల్‌హాసన్ దిగ్గజ నటుడు. సోదరి శృతిహాసన్ స్టార్ హీరోయిన్. ఈ ఘనమైన వారసత్వాన్ని ఉపయోగించుకొని సినిమాల్లో అడుగుపెట్టి సులభంగా పేరుప్రఖ్యాతుల్ని సంపాదించుకోవచ్చు. అక్షరహాసన్ మాత్రం అందుకు భిన్నంగా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. కమల్‌హాసన్ తనయ అనే ముద్రతో కాకుండా స్వీయ ప్రతిభతో చిత్రసీమలో రాణించేందుకు తపిస్తున్నది. సహాయ దర్శకురాలిగా కెరీర్‌ను ఆరంభించిన ఆమె ఆ తర్వాత కథానాయికగా అరంగేట్రం చేసింది. ప్రయోగాత్మక ఇతివృత్తాలతో తండ్రికి తగిన తనయగా ప్రతిభను చాటుకుంటున్నది. తన సినీ ప్రయాణం, తల్లిదండ్రులతో అనుబంధాన్ని గురించి 'జిందగీ'తో అక్షరహాసన్ పంచుకున్న ముచ్చట్లివి..**

- **మీ సోదరి శృతిహాసన్ కమర్షియల్ సినిమాలతో మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు. మీరు మాత్రం భిన్నంగా ప్రయోగాలు చేస్తున్నారు? ఎందుకలా?**
- అక్కాచెల్లెళ్లమే అయినా మా ఇద్దరి అభిరుచులు, అభిప్రాయాల్లో వైరుధ్యాలు కనిపిస్తాయి. శృతిహాసన్‌కు హెవీమెటల్ మ్యూజిక్ అంటే ఇష్టం. నేను హిప్‌హాప్, ఆర్ అండ్ బీ సంగీతాన్ని ఇష్టపడతాను. అక్క కమర్షియల్ సినిమాలు చేస్తున్నది. అలాంటి సినిమాలకు నేను వ్యతిరేకం అని చెప్పడం లేదు. కమర్షియల్ సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయి. నటన, సినిమాల గురించి మరింత నేర్చుకున్న తర్వాత వాటిలో నటిస్తాను. చిన్నతనం నుంచి అందరిలా కాకుండా విభిన్నంగా ఆలోచించడం అలవాటైంది. సినిమాల ఎంపికలో ఆ ప్రభావం కనిపిస్తుంది. సినిమాల్ని పక్కనపెడితే జీవితంలో మాత్రం ఇద్దరం ఒకే విలువల్ని పాటిస్తాం.

- **అక్కతో మీ అనుబంధం ఎలా ఉంటుంది?**
- అక్కాచెల్లెళ్లలా కాకుండా స్నేహితుల్లా కలిసుంటాం. అమ్మానాన్నల తర్వాత తనే నా బిగ్గెస్ట్ సపోర్ట్. నా జీవితానికి సంబంధించిన ప్రతి విషయాన్ని తనతో పంచుకుంటాను. మేం కలుసుకునేది తక్కువే. మ్యూజిక్, సినిమాలతో శృతి చాలా బిజీ. కలిసినప్పుడు మాత్రం సరదాగా మాట్లాడుకుంటాం. వయసులో పెద్ద, సీనియర్ అనే భావనతో శృతి నాకెప్పుడూ సలహాలు ఇవ్వదు.

- **నటనపై మీకు ఎలా ఇష్టం మొదలైంది? అమ్మానాన్నల స్ఫూర్తితోనే కథానాయికగా మారారా?**
- ఇరవై ఏళ్ల వరకు నటనలో నాకున్న పరిజ్ఞానం శూన్యం. అమ్మానాన్నలు నటించగా చూడడం తప్పితే ఎప్పుడూ ప్రయత్నించలేదు. కథానాయికగా మారుతానని ఊహించలేదు. నా స్నేహితురాలు రూపొందిస్తున్న ఓ నాటికలో కీలకపాత్ర పోషిస్తున్న నటి గాయపడడంతో ఆ క్యారెక్టర్ నేను చేయాల్సి వచ్చింది. డైలాగ్స్ లేకుండా నృత్య ప్రధానంగా సాగే ఆ చిన్న పాత్ర కోసం మూడు రోజులు పాటు రిహార్సల్స్ చేశాను. ఆ శిక్షణ నటన పట్ల నాలో అంతర్లీనంగా దాగిఉన్న ఇష్టాన్ని తట్టిలేపింది. నాటకాలు, వర్క్‌షాప్‌లలో పాల్గొని అభినయపరంగా మెళుకువలు నేర్చుకున్నాను. బాలీవుడ్ చిత్రం 'షమితాబ్'లో యాదృచ్ఛికంగా అవకాశం వచ్చింది. ఓ రోజు బాల్కీ నన్ను కలిసి సినిమా, నా పాత్ర గురించి చెప్పారు. నటించగలననే నమ్మకం ఉండడంతో నటిస్తానని ఆయనతో చెప్పాను.

- **దర్శకత్వంపై మక్కువతో సహాయ దర్శకురాలిగా పనిచేశారు కదా? మెగాఫోన్ ఎప్పుడూ పట్టబోతున్నారు?**
- రాహుల్ ధోలాఖియా దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'సొసైటీ కామ్ సే గయా' చిత్రానికి దర్శకత్వ శాఖలో పనిచేశాను. అమ్మ ఆ సినిమాలో నటించింది. ఆమె ద్వారా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. అలాగే నాన్న దర్శకత్వంలో ప్రారంభమైన 'శభాష్ నాయుడు' సినిమాకు దర్శకత్వశాఖలో పనిచేయడమే కాకుండా ప్రొడక్షన్‌కు సంబంధించిన పనులు చూసుకున్నాను. భవిష్యత్తులో తప్పకుండా దర్శకత్వ బాధ్యతల్ని చేపడుతాను. కానీ అది ఎప్పుడు కార్యరూపం దాల్చుతుందో చెప్పలేను. ప్రస్తుతం నటనపైనే ఫోకస్ పెట్టాను. మరింత అనుభవం సంపాదించుకున్న తర్వాతే దర్శకత్వంపై దృష్టి సారిస్తాను. అందుకోసం చాలా సమయం పడుతుంది. రెండు, మూడు కథలకు సంబంధించిన ఐడియాల్ని సిద్ధం చేసుకున్నాను. దర్శకురాలిగా నాన్నతో సినిమా చేయాలనేది నా కల. నటుడిగా నా సినిమాతో ఆయన్ని కొత్తగా ఆవిష్కరించాలనే కోరిక ఉంది.

- **అమ్మనాన్నల్లో ఎవరితో మీరు ఎక్కువ సన్నిహితంగా ఉంటారు?**
- నాకు ఇద్దరూ సమానమే. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువే అనే ఆలోచన రాదు. వారిపై నాకున్న ప్రేమ ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. అమ్మానాన్నలపై ఉన్న ప్రేమను మాటల్లో చెప్పలేను.

- **నాన్న నటించిన సినిమాల్లో మీకు ఇష్టమైన సినిమాలేవి?**
- ఒకటని చెప్పలేను. అన్ని సినిమాలూ ఇష్టమే. దేవర్ గమన్, నాయగన్, విరుమండి, ముండ్రాపిరై ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద లిస్ట్ ఉంది.



- **నాన్న ఎప్పుడైనా సలహాలు ఇస్తుంటారా?**
- అమ్మానాన్న ఇద్దరూ నటులే కాబట్టి మేం సినిమాల్లోకి రావాలని వారు ఎప్పుడూ బలవంతపెట్టలేదు. చిన్నతనం నుంచి అక్కతో పాటు నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. వారి అభిప్రాయాల్ని మాపై రుద్దడానికి ప్రయత్నించరు. మా ఆలోచనల్ని గౌరవిస్తారు. మీ జీవితాన్ని మీకు నచ్చినట్లుగా తీర్చిదిద్దుకోమని అమ్మానాన్న చెబుతుంటారు. సినిమాల్లోకి వస్తామన్నా కాదనలేదు. నిరంతరం మాకు మార్గదర్శకులుగా ఉంటారు. ఒకవేళ తప్పు చేసినా ఆ పొరపాట్లను ఎలా సరిదిద్దుకోవాలో సున్నితంగా అర్థమయ్యేలా వివరిస్తారు.

- **కమల్‌హాసన్ కూతురు అనే ముద్ర మీకు ప్లస్ అనుకుంటున్నారా?**
- కమల్‌హాసన్ కూతురు అనే ఇమేజ్ సినిమాల్లోకి రావడానికి మాత్రమే ఉపయోగపడింది. ఆ పేరుతో విజయాలు సులువుగా వస్తాయని అనుకోవడం అపోహ మాత్రమే. బయటి వారితో పోలిస్తే వారసత్వంతో ఇండస్ట్రీలోకి వచ్చేవారు రెట్టింపు కష్టపడాలి. కమల్‌హాసన్ తనయ అనగానే మా నుంచి ప్రేక్షకులు చాలా ఆశిస్తారు. ఆ అంచనాల్ని అందుకోవడానికి నిరంతరం కష్టపడతాను. నాన్న వల్లే నాకు, అక్కకు అవకాశాలు వస్తున్నాయని అంటే అంగీకరించను. ప్రతిభ ఉంది కాబట్టే రాణించగలుగుతున్నాం.

- **రియల్ లైఫ్‌లో ఎలా ఉంటారు?**
- పెద్ద నటుడి కూతురును కాబట్టి సెట్స్‌లో నన్ను ప్రత్యేకంగా చూస్తానంటే ఒప్పుకోను. అందరితో సరదాగా కలిసిపోతాను. సింపుల్ లైఫ్‌ను ఇష్టపడతాను. నా పనులన్నింటిని నేనే చేసుకుంటాను. ముంబాయి వెళితే స్నేహితులతో కలిసి సినిమాలు, పార్టీలు, డిన్నర్స్‌కు వెళుతుంటాం.

- **విమర్శల్ని ఎలా స్వీకరిస్తారు?**
- నెపోటిజం(బంధుప్రీతి) అనేది ప్రతి రంగంలో ఉంటుంది. దానిని సీరియస్‌గా తీసుకోను. నాపై వచ్చే విమర్శల్లో కొన్నింటిని చూసి వదిలేస్తాను. మరికొన్నింటిని సీరియస్‌గా తీసుకొని నాలోని తప్పుల్ని సరిదిద్దుకుంటాను.

...నరేష్ నెల్కి, సిఎం. ప్రవీణ్

## సేంద్రియ వ్యవసాయం.. అర్చన ఫలసాయం!



**సేంద్రియ ఆహార పదార్థాలతో ఆరోగ్యమే కాదు, పర్యావరణానికీ మేలు జరుగుతుంది. అందుకే ఆర్గానిక్ పంటలు నగరాల్లోనూ పండించే నూతన విధానానికి ఓ మహిళ శ్రీకారం చుట్టింది. పట్టణవాసులకు మిద్దె పంటలపై అవగాహన కల్పిస్తూ సరికొత్త పథకాన్ని ప్రవేశ పెట్టింది. తక్కువ ఖర్చుతో సేంద్రియ కూరగాయలందించే ప్రయత్నం చేస్తున్నది.**

జైపూర్‌కు చెందిన అర్చన మిశ్రా టీచర్‌గా పని చేసి రిటైర్ అయింది. మిశ్రా అమెరికాలో ఉండే తన కుమార్తె దగ్గరకు వెళ్లింది. అక్కడ సేంద్రియ కూరగాయలు కొనడానికి పెద్ద మొత్తంలో ఖర్చయ్యేది. ఇంట్లోనే ఆర్గానిక్ కూరగాయలు పండిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కలిగింది. అందుకోసం జైపూర్ వచ్చాక ప్రయోగాత్మకంగా మిద్దెపై ఉన్న ఖాళీ స్థలంలో ప్లాస్టిక్ బాక్స్‌లు ఏర్పాటు చేసి అందులో కొంత మట్టి వేసింది. ఆ మట్టిలో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు నాటింది. నీరు వృథా కాకుండా చిన్న పైపులు ఏర్పాటు చేసి వాటి ద్వారా మొక్కలకు అందేలా చూసింది. కొద్దిరోజులకే ఆమె చేసిన ప్రయోగం ఫలితాలనిచ్చింది. ఈ విధానాన్ని 'పోర్టబుల్ ఫార్మింగ్ సిస్టమ్' అంటారు. ఇదే పథకాన్ని ఉపయోగించి ఎవరికి కావాల్సిన కూరగాయలు వారే సాగుచేసుకునేలా ఓ స్టార్టప్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయింది. ప్రవాస భారతీయుడైన ప్రతీక్ తివారీ పెట్టుబడి పెట్టడంతో 'లివింగ్ గ్రీన్స్' పేరుతో స్టార్టప్‌ను ప్రారంభించింది. పట్టణాల్లోని ఇండ్లపై ఉండే ఖాళీ ప్రదేశాలు, మిద్దెలపై ప్లాస్టిక్ బాక్సులు అమర్చి పోర్టబుల్ ఫార్మింగ్ సిస్టమ్‌పై జనాలకు అవగాహన కల్పించింది. మొదట్లో ఆర్గానిక్ వ్యవసాయం చేయడానికి అవసరమైన పరికరాలను అద్దెకిచ్చారు. ఈ ప్రయోగం పట్ల ఎక్కువ మంది ఆకర్షితులయ్యారు. కొన్నాళ్ల తర్వాత సాగుకు అవసరమైన పరికరాలను అమ్మడం ప్రారంభించారు. దీంతో 'లివింగ్ గ్రీన్స్' స్టార్టప్‌కు ఆదరణ పెరిగింది. ప్రస్తుతం జైపూర్‌లోని 400 కుటుంబాలు పోర్టబుల్ ఫార్మింగ్ సిస్టమ్ ద్వారా సేంద్రియ కూరగాయలు పండించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. లివింగ్ గ్రీన్స్ పంజాబ్, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి రాష్ట్రాలతోపాటు విదేశాల్లోనూ సేవలందిస్తున్నది.

## భర్త వీర మరణం... సైన్యంలోకి భార్య!



**కశ్మీర్‌లోని లైన్ ఆఫ్ కంట్రోల్ దగ్గర సైనికుడు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలొదిలాడు. అతని భార్య ఇప్పుడు సైన్యంలోకి చేరడానికి సిద్ధమై సరైన నివాళిని అర్పించింది.**

కౌస్తుభా రాణె కశ్మీర్‌లోని బందిపోర జిల్లా పరిధిలోని లైన్ ఆఫ్ కంట్రోల్ దగ్గర విధులు నిర్వహించాడు. అక్కడ జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరమరణం పొందాడు. భార్య కనికా రాణెకు అతను తరచుగా చెప్పే మాటలే ఆమెను వీరవనితను చేశాయి. 'విధి నిర్వహణలో నేను ప్రాణాలొదిలితే అది నిన్ను వెనక్కి నెట్టి వేయొచ్చు. కానీ నువ్వు ముందుకు సాగడానికి సత్తువ తెచ్చుకోవాలి. ధైర్యంగా ఉండు' అని చెప్పేవాడు. ఈ మాటలు ఆమెను ఎంతో ప్రభావితం చేశాయి. అందుకే 29 ఏండ్ల కనిక ఇటీవల జరిగిన సర్వీస్ సెలక్షన్ పరీక్ష రాసింది. మెరిట్‌లో విజయం సాధించింది. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో 11 నెలల ట్రైనింగ్ తర్వాత ఇప్పుడు విధుల్లోకి చేరబోతున్నది. 'నా భర్త సైన్యంలో చేరి దేశసేవ చేశాడు. అతని మరణం నన్ను కదిలించింది. నేను కూడా సైన్యంలో చేరడమే నా భర్తకు ఇచ్చే సరైన నివాళి' అంటున్నది కనిక.

## ప్లాస్టిక్ కప్పులను పడేస్తున్నారా?

**కాగితం వాడి పడేస్తే అది సులభంగానే విచ్ఛిన్నమవుతుంది. కానీ, ప్లాస్టిక్‌ను పడేస్తే అది ఎన్నో ఏండ్ల తర్వాత కూడా అలానే ఉంటుంది. అలా అని ప్లాస్టిక్ సీసాలు, కప్పులు, గిన్నెలు, బ్యాగులు వాడకుండా ఉండలేకపోతున్నారు. వీటినే మళ్లీ మళ్లీ వాడొచ్చు. ఎలానే తెలుసా?**



- మార్కెట్లో పెరుగు కొనుగోలు చేసినప్పుడు కప్పుల్ని శుభ్రంగా కడిగి బాత్ రూంలో టూత్ బ్రష్‌లను పెట్టుకోవడానికి వాడుకోవచ్చు. మళ్లీ దానికోసం కొత్తది కొని డబ్బుని వృథా చేసుకోవడం ఎందుకు. ఈ కప్పులకు రంగులు వేస్తే కలర్‌ఫుల్‌గా ఉంటుంది.
- చిల్లర చాలాసార్లు అవసరం పడుతుంటుంది. దానికోసం వెతికేటప్పుడు చిరాకు పడుతుంటారు. వాటిని అవసరం లేని ప్లాస్టిక్ కప్పులో భద్రపరుచుకుంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు వెతకనవసరం లేదు. పెట్టిన చోటుని గుర్తు పెట్టుకుంటే సరి.
- మహిళలు ఇయర్‌రింగ్స్ ఎక్కడ పడితే అక్కడ పెడుతుంటారు. అవి కనిపించకపోతే ఇబ్బంది పడుతుంటారు. వీటన్నింటినీ పేపర్లో చుట్టి ప్లాస్టిక్ కప్పుల్లో పెట్టుకుంటే ఎటువంటి టెన్షన్ ఉండదు.
- ప్లాస్టిక్ కప్పులను తిరిగి వాడడానికి ఇదొక మంచి మార్గం. మొక్కలను పెంచే అలవాటు ఉంటే.. ప్లాస్టిక్ కప్పుల్లో మట్టి నింపి విత్తనాలు నాటాలి. ఆకులు వస్తున్న క్రమంలో వాటిని పెద్ద కుండీలోకి మార్చండి. కప్పులకు చిన్న రంధ్రాలు చేయడం మరువవద్దు.
- కప్పులో సింపుల్‌గా రాళ్లను నింపేసి పేపర్ వెయిట్‌గా వాడుకోవచ్చు. రోడ్డుపై దొరికే రాళ్లు అయినా పర్వాలేదు. ఇంకా అందంగా కనిపించాలంటే హోం డెకర్ షాపుల్లో రంగురంగుల రాళ్ళు కూడా లభిస్తాయి.

## ఇంట్లోనే స్పా

**ఈ రోజుల్లో ఉదయం లేచి, ఆఫీసుకి వెళ్లి, ఆ తర్వాత పిల్లలు ఇలా పనులన్నీ చక్కబెట్టుకునే మహిళలకు అందం విషయంలో జాగ్రత్తలు తీసుకునే తీరిక ఎక్కడుంటుంది. ముఖ్యంగా పాదాలు. ఇంట్లోనే తక్కువ టైంలో పూట్ స్పా చేసుకోవడం తెలుసుకోండి.**

- కాలి వేళ్లకు నెయిల్ పాలిష్‌ను రిమూవర్‌తో తొలిగించాలి. ఆ తర్వాత నెయిల్ కట్టర్‌తో గోళ్లను చిన్నవిగా అందమైన ఆకృతి వచ్చేలా కత్తిరించాలి. గోళ్లకు గరుకుతనం పోయేలా నున్నగా నెయిల్ ఫిలర్‌తో రఫ్ చేయాలి.
- చిన్న టబ్ నిండా గోరువెచ్చని నీరుని తీసుకొని అందులో పాలు, లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్, నిమ్మరసం జోడించాలి. ఈ నీటిలో పాదాలను కనీసం 20 నిమిషాల వరకు నానబెట్టాలి. ఆ తర్వాత బయటకు తీసి టవల్‌తో తుడువాలి. ఇలా చేస్తే చర్మానికి మృదుత్వాన్ని ఇవ్వడమే కాకుండా పోషణ కూడా అందుతుంది.
- పాదాలను టవల్‌తో తుడిచిన తర్వాత మరింత నునుపుగా చేసేయాలంటే.. చక్కెర, ఆలివ్ ఆయిల్, నిమ్మరసాన్ని బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసి మర్దన చేయాలి. కాసేపటి తర్వాత నీటితో పాదాలను శుభ్రపరిచి పొడి బట్టతో తుడువాలి.
- ఓట్ మీల్, తేనె, పాలు మిశ్రమంలా కలుపాలి. దీన్ని పాదాలకు అప్లై చేసి 20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచాలి. టవల్‌తో పాదాలను తుడుచుకోవాలి.
- పాదాలను మాయిశ్చరైజ్ చేయడం కోసం, అరచేతిలోకి బాదంనూనె తీసుకొని గోరువెచ్చగా అయ్యేవరకు చేతుల మధ్య రుద్దాలి. ఆ తర్వాత పాదాలకు 10 నిమిషాల పాటు మర్దన చేయాలి. దీంతో తేమను పొంది, పోషణ అందిస్తుంది.



నమస్తే తెలంగాణ
# చింతన
[ కరీంనగర్ ]
ఆదివారం 18 ఆగస్టు 2019

## పర్వదినాలు



- బలరామ జయంతి (21వ తేది)
- శ్రావణ సోమవారం (19వ తేది)
- మంగళగౌరీ వ్రతం మూడో మంగళవారం (20వ తేది)
- శ్రీ కృష్ణ జయంతి స్మార్తులకు (23వ తేది)
- శ్రీ కృష్ణ జయంతి శ్రీవైష్ణవులకు (24వ తేది)

## అపురూప అవకాశం




ఇలా చేద్దాం


భారతీయుల్లో ప్రత్యేకించి వైదిక సంప్రదాయ పరులలో కృష్ణుడు, రాముడు అంటే ఇష్టపడని వారుండరు. ఈ శుక్ర, శని వారాలు (23, 24వ తేదీలు) రెండు రోజులూ స్మార్త, శ్రీవైష్ణవ సాంప్రదాయ పరులైన శ్రీకృష్ణపరమాత్మ భక్తులంతా జన్మాష్టమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. ఈ సందర్భంగా 108 రకాల నైవేద్యాలు స్వామికి నివేదన చేయడం అత్యంత విశేషం. ప్రపంచ వ్యాప్తంగా ఏటా జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకొంటాయి. శ్రీకృష్ణుడు జన్మించిన ఈ అపురూప సమయం భారతీయ వైదికులందరికీ ఒక దివ్యమైన వేడుక. ముఖ్యంగా శ్రీమహావిష్ణువు ఆరాధకులకు, ఆధ్యాత్మిక సాధకులకు ప్రతి ఏటా వచ్చే ఈ పండుగ విశేష తృప్తిని మిగులుస్తుంది. మన తెలుగు రాష్ర్టాల్లోని అనేక దేవాలయాలలో ఈ సందర్భంగా ఆ రెండు రోజులూ ప్రత్యేక అర్చనలు, ఉత్సవాలు జరుగుతాయి. హైదరాబాద్ జంటనగర వాసులకు బంజారాహిల్స్ (రోడ్ నంబర్ 12)లోని 'హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్'లో ఈ రెండు రోజులూ జరిగే వేడుకలైతే ఒక అపురూప అవకాశమనే చెప్పాలి. ఇక్కడ రెండ్రోజులు ఉదయం, సాయంత్రం రెండు పూటలు, శనివారమైతే అర్ధరాత్రి వేళ మహామంగళ హారతి, జూలాన్ సేవ (Jhulan Seva) ను కండ్లనిండా చూసి తీరవలసిందే. ఎటూ ఎవరికి వాళ్లం ఇళ్లలో కృష్ణాష్టమి వేడుకలను ఇంత వైభవంగా జరుపుకోలేం. కనుక, ఈ సందర్భంగానైనా ఆలయాలకు వెళ్లి స్వామి దివ్యాశీస్సులకు పాత్రులమవుదాం.

మల్లాది వెంకట కృష్ణమూర్తి

తీర్థయాత్ర 17



# నర్మద పరిక్రమ



## కాశీయాత్రలా నదీ ప్రదక్షిణ

(గత సంచిక తరువాయి)

### కాలినడకకు అయిదు మార్గాలు

పూర్వం నర్మద నది పరిక్రమను కాలినడకన చేసేవారు. ఈనాటికీ ఉత్తర భారతదేశ సన్యాసులు సన్యాసదీక్షను తీసుకొన్నాక కాలినడకన నర్మద పరిక్రమను చేస్తారు. మనం కాశీ వెళ్లడానికి ఎంతటి ప్రాముఖ్యాన్నిస్తామో అలాగే, ఉత్తర భారత దేశీయులు నర్మద పరిక్రమకు అంత ప్రాముఖ్యాన్నిస్తారు.
పరిక్రమను మూడుచోట్ల ప్రారంభిస్తారు. ఒకటి నర్మద నది పుట్టే మధ్యప్రదేశ్‌లోని అమర్‌కంటక్ నుంచి అంటే శిరస్సు నుంచి మొదలుపెడతారు. రెండోది 'బే ఆఫ్ కాంబే' (బే ఆఫ్ ఖంబట్టా)లో నర్మద నది అరేబియా సముద్రంలో కలిసే ప్రదేశం నుంచి, అంటే నది పాదాలనుంచి ప్రారంభిస్తారు. ఇది గుజరాత్‌లోని బరౌచికి గంటలోపు ప్రయాణదూరంలో ఉంది. మూడోది నాభి (మధ్య)నుంచి, అంటే నాపేశ్వర్ నుంచి దక్షిణతీరంలో మొదలుపెట్టి, పాదాలైన 'బే ఆఫ్ కాంబే'కి, వెళ్లి, తర్వాత శిరస్సు స్థానమైన అమర్‌కంటక్‌కు వెళ్లి, తిరిగి నాపేశ్వర్‌కు వచ్చి అక్కడ పూర్తి చేస్తారు.
నాలుగో మార్గం దత్త సాంప్రదాయం వారు అనుసరించేది. గుజరాత్‌లోని దత్త క్షేత్రాలైన నాగేశ్వర్ లేదా గరుడేశ్వర్‌ల నుంచి పరిక్రమ మొదలుపెట్టి, బరౌచి, అమర్‌కంటక్‌లకు వెళ్లి తిరిగి తాము మొదలుపెట్టిన చోటుకు వచ్చి పూర్తి చేస్తారు. నాగేశ్వర్‌లో దత్తభక్తుడు వాసుదేవానంద సరస్వతి, గరుడేశ్వర్‌లో రంగావధూతల సమాధులు ఉన్నాయి. అయిదో మార్గం ఓంకారేశ్వర్‌లో మొదలుపెట్టి బరౌచి మీదుగా అమర్‌కంటక్‌కు వెళ్లి, మళ్లీ ఓంకారేశ్వర్ దగ్గర పూర్తి చేస్తారు.

* * *

మేం చేసేది అయిదో పద్ధతిలోనే. ఎక్కడ మొదలుపెట్టినా ముందు పాదాలవైపు, అంటే బరౌచివైపు వెళ్లి తర్వాత శిరస్సువైపు అంటే అమర్‌కంటక్ వైపు పరిక్రమ సాగాలి. నది పరిక్రమకు మొత్తం దూరం 2,600 కి.మీ. పైనే. నడకదారిలో జబల్‌పూర్, బద్వాని, హోషంగాబాద్, హర్దా, నర్మదానగర్, ఓంకారేశ్వర్, దేవాస్ (నేమావర్, కిటీ, పింప్రీ), మాండ్లా, మహేశ్వర్, రాజ్ పిప్లా, బరౌచి అనే ఊళ్లు, జోగా కా ఖిల్లా, బాజీరావు పీష్వా ఛత్రి అనే చారిత్రాత్మక ప్రదేశాలు, దూద్ ధార, ధర్ధి ఫాల్స్, ఖేర్ ఘాట్, దూస్ ధార, కపిల్‌ధార, సహస్ర ధార లాంటి జలపాతాలు తారస పడతాయి. మేం చేసిన 'బస్సు పరిక్రమ'లో చాలా ప్రాచీన ఆశ్రమాలను, గుళ్లను చూడలేకపోయాం.


అమర్‌కంటక్‌లోని ఆధునిక ఆలయాలు

**ఎక్కడ మొదలుపెట్టినా ముందు పాదాలవైపు, అంటే బరౌచివైపు వెళ్లి తర్వాత శిరస్సువైపు అంటే అమర్‌కంటక్ వైపు పరిక్రమ సాగాలి.**

దీక్ష తీసుకొన్నాక అక్కడనుంచి పది నిమిషాల నడకదూరంలో ఉన్న మామ్‌లేశ్వర్ ఆలయానికి వెళ్లి ఆయన దర్శనం చేసుకొన్నాం. ఓంకారేశ్వరుడు ఆ ద్వీపంలో ఉంటే, మామ్‌లేశ్వర్ ఇవతలి గట్టున ఉన్నది. ఇదీ పురాతన క్షేత్రమే. అక్కడ వినాయకుడి గుడికూడా ఉన్నది. మళ్లీ నడిచి పది నిమిషాల దూరంలో ఉన్న గజానన్ మహారాజ్ గెస్ట్‌హౌస్‌కు చేరుకొన్నాం.
గెస్ట్‌హౌస్ ముందు చాలా ఖాళీ స్థలం ఉంది. ఓ చోట క్యాంటీన్, దాని ఎదురుగా ఆలయం, భజన మందిరం ఉన్నాయి. ఆలయంలో అరగంటసేపు జపం చేసుకొన్నాను. అవకాశం దొరికిన ప్రతీచోటా నేను జపం చేసుకోవడానికి కారణం, నర్మద నది ఒడ్డున చేసుకొనే జపం మిగిలిన చోట్లకన్నా ఎక్కువ రెట్లు ఫలితాన్నిస్తుందని ఓ శ్లోకం చెప్తున్నది.
ఎనిమిదికి భోజనం పెట్టారు. అన్నం, రోటీ, బీన్స్, ఆలూ కలిపి చేసిన కూర, అన్నం పాయసం, పప్పు, పులుసు. నార్త్‌లో పప్పును పులుసులా బాగా నీళ్లలా చేస్తారు. నర్మద నదీ పరిక్రమ మొదలైంది కాబట్టి, ఈరోజునుంచి నిత్యం మాకు పెట్టే ఆహారాన్ని దేశాయ్ తన గురువు నారాయణ స్వామికే కాక, నర్మద మాతకు నైవేద్యం పెట్టాకే దాన్ని ప్రసాదంగా మాకు ఇవ్వసాగారు. ఈరోజు నుంచి నిత్యం సాయంత్రం ఆదిశంకరాచార్య రాసిన 'నర్మదాష్టకం' పాడుతూ నర్మద మాతకు హారతిని క్రమం తప్పకుండా ఇచ్చారు. ఇందుకోసం నర్మద మాత విగ్రహం ఒకటి బస్సులో ఉంచారు.

-సశేషం

## శ్రీకృష్ణ పరమాత్మ
# అవతరించిన వేళ..

**'దుష్టశిక్షణ-ధర్మరక్షణ'కు దివ్యమైన ముహూర్తం 'కృష్ణ జన్మాష్టమి'. ఈ విశిష్ట పర్వదినం సందర్భంగా ప్రత్యేక రచనలు చదవండి.**

## అద్భుత ఆదర్శమూర్తి!


కష్టాలను అధిగమిస్తూ, జీవితంలో ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ విజయాలు సాధించే వాడే వీరుడు. శ్రీకృష్ణుడు వీరుడే కాదు, ధీరుడు కూడా. శ్రీరాముడు పుట్టిన తర్వాత కష్టాలను అనుభవిస్తే శ్రీకృష్ణునికి తల్లి దేవకి గర్భంలో ఉన్నప్పట్నుంచే కష్టాలు మొదలైనాయి. తానే స్వయంగా పరమాత్మ స్వరూపం కాబట్టి, అవన్నీ ఆయనకొక లెక్కా! అలాగే, ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడైతే, నిలువెత్తు సనాతన ధర్మమే శ్రీకృష్ణుని అవతారం.

ఎక్కడి చెరసాల? ఎక్కడి రేపల్లె? ఎక్కడి ద్వారక? ఎక్కడి హస్తిన? ఎక్కడి రణరంగం? ఇవన్నీ శ్రీకృష్ణుని లీలా విన్యాసాలకు వేదికలైనాయి. భాగవతంలో కృష్ణకథ ఆసాంతం ఆశ్చర్యకరమేకాక అత్యంత ఆసక్తికరం కూడా. శ్రీకృష్ణుడు సామాన్యుడుగానే జన్మించాడు. కానీ, అసామాన్య శక్తులకు ప్రతినిధి అయినాడు. జీవిత గమనంలో మనిషి ఎక్కడ ఒదిగి ఉండాలో, ఎక్కడ ఎదిగి పోవాలో అద్భుతంగా, ఆచరణాత్మకంగా తెలియజేసిన మహానుభావుడాయన.
లోకంలో ఇంత శాంతస్వభావుడు, సమదర్శనుడు మరొకరు కనిపించరు. కౌరవుల పాలిట అతనొక మాయావే. కానీ, పాండవాది ప్రేమికులకు ఎందరికో హృదయవల్లభుడు. భీష్మాదులు తనను అవతార పురుషునిగా గౌరవిస్తే, దుర్యోధనాదులు అనేక అవమానాలకు గురిచేశారు. మానావమానాలు, కష్టాలు, దు:ఖాలను అన్నింటినీ సమానంగా భావిస్తూ, వాటిని అధిగమించేవారే ఎప్పటికైనా 'ఉత్తమ మానవులు'గా జన్మసార్థకతకు అర్హులవుతారని తన స్వీయ జీవితానుభవాల ద్వారానేకాదు, గీతోపదేశంతోనూ శ్రీకృష్ణుడు ఉపదేశించాడు.
జీవితం యుద్ధం లాంటిదే. అందుకే కృష్ణుడు యుద్ధరంగంలోనే గీతాబోధ చేశాడు. చేజారిన గాండీవాన్ని అర్జునుని చేతికి అందించాడు. ఆత్మానాత్మల వివేకాన్ని, జీవిత లక్ష్యాన్ని తెలియజేయడం ద్వారా విజయుణ్ని విజయపథంలో నడిపించాడు. నిజానికి శ్రీకృష్ణుడు గీతామృతాన్ని లోకానికంతటికీ అందించాడు. అందుకే, ఆ మహానుభావుడు జగద్గురువు అయ్యాడు. అతని పేరు కేవలం భారత భాగవతాది గ్రంథాలలోనే కాక ఉపనిషత్తులలోనూ శిఖరాయమానమైందంటే, దానికి కారణం ఆయన్ని మించిన పరమాత్మ వేరెవరూ లేరనే. పూర్వం వామనదేవుడు మాత్రమే నిత్యాగ్ని హోత్రియై 120 సంవత్సరాలు జీవించినట్లు ఉపనిషత్తులు పేర్కొనగా, అట్లే శ్రీకృష్ణుడు పూర్ణాయుష్కుడైనట్లు ఛాందోగ్యోపనిషత్తు తెలియజేసింది.
శ్రీకృష్ణ పరమాత్మను వర్ణించడానికి మాటలు సరిపోవు. తనను మించిన జితేంద్రియుడు, మహావీరుడు మరెవరూ లేరు. అత్యంత ధర్మజ్ఞుడు, లోకంలోనే పరమోన్నత పురుషోత్తముడు. పరిపూర్ణజ్ఞాని. అన్నింటికీ మించి అద్భుత యోగీశ్వరుడు. సత్యవాక్పరిపాలకుడు. సమస్త మానవాళికి ఆయన చూపిన మార్గమే ఆదర్శం.

### జీవితసారమే గీతోపదేశం

ధర్మమే తానై నిలిచిన శ్రీకృష్ణుడు తన జీవితసారాన్నే గీతోపదేశంగా తెలియజేయడం అద్భుతం. శ్రేష్ఠుడైన వాడు దాన్ని ఆచరిస్తే, ఆ శ్రేష్టులను ఇతరులు అనుసరిస్తారు. ఇది శ్రీకృష్ణుని ఆచార్యత్వాన్ని తెలియజేసే అతిగొప్ప మాట. మనిషన్నవాడు ఏ ప్రాణినీ ద్వేషించకూడదు. ఎందుకంటే, అందరిలోనూ పరమాత్మ ఉన్నాడు. అతనే కదా ఉపాస్యదైవం. ఇంతేకాదు, ప్రతి ఒక్కరికీ 'ఆత్మసాక్షాత్కారమే' అసలైన యోగం. ఈ యోగబలమే అన్ని బలాల్లోకెల్లా గొప్పది. అందుకు జ్ఞానయోగాన్ని అనుష్ఠించమని చెప్పిన శ్రీకృష్ణుని మాటలు ఒక్క అర్జునుణ్ణి ఉద్దేశించినవే కావు. సమస్త మానవకోటికీ శిరోధార్యాలు.


వేళా విశేషం



ఆచార్య మసన చెన్నప్ప
సెల్: 98856 54381



## అంతుచిక్కని మర్మజ్ఞాని!


**చాలామందికి తెలియని విషయమేమిటంటే 'అసలు జన్మంటూ లేనివాడు' శ్రీకృష్ణుడు. ఆయన ఒక సంప్రదాయానికో, విష్ణువు అవతారానికో, దేవకీ వసుదేవుల పుత్రుడుగానో పరిమితం కాదు. మిగిలిన అవతారాలన్నీ భగవంతుని అంశావతారాలైతే, శ్రీకృష్ణుడు మాత్రం 'స్వయంగా భగవంతుడే' అని సాక్షాత్తు వేదవ్యాసులంతటి వారు ప్రవచించారు.**

దేవాధిదేవుడైన శ్రీకృష్ణుడు సృష్టిలోని సమస్తానికి మూలాధారం. ఈతడే పరబ్రహ్మం, పరంధాముడని 'భగవద్గీత' కొనియాడుతున్నది. మహర్షులు, దేవతలకు సైతం అంతుచిక్కని మర్మమితడు. సమస్త జీవులకు ఆశ్రయంగా ఉన్న ఆయన వైభవాన్ని వర్ణించడం ఎవరికీ సాధ్యం కాదు. శ్రీకృష్ణుడు తన లీలావిన్యాసాలను చిన్ననాటి నుండే ప్రదర్శించాడు. తాను కేవలం కొన్ని నెలల పసికందుగా ఉన్నప్పుడే స్థన్యాలకు విషాన్ని అంటించుకొని స్త్రీ రూపంలో పాలివ్వడానికి వచ్చిన రాక్షసి పూతనను మట్టుబెట్టాడు. పాలను తాగుతూనే ఆ రాక్షసి ప్రాణాల్నీ హరించివేశాడు.
ఏడు రోజులపాటు గోవర్ధన పర్వతాన్ని తన ఎడమచేతి చిటికెన వేలుతో ఒక పుట్టగొడుగులా ఎత్తి పట్టుకొన్నప్పుడు శ్రీకృష్ణుడు ఏడేండ్ల పిల్లవాడే. ఇదే శ్రీకృష్ణుని విశిష్ఠ గుణం. శ్రీకృష్ణుడు స్వతహాగానే భగవంతుడే. తన సోదరుడు బలరామునితో కలిసి భక్తరంజకులై అమోఘమైన లీలలను ప్రదర్శించారు.
ప్రపంచంలోని వివిధ మతాలన్నీ వారి సంస్కృతి, భాషానుసారం భగవంతుణ్ణి వివిధ నామాలతో కీర్తిస్తుంటాయి. ఆ నామాలన్నీ నిస్సందేహంగా భగవంతుణ్ణి ఉద్దేశించినవే. భగవంతుడు అనే పదానికి అత్యంత సరళమైన ఒక నిర్వచనం 'జన్మాద్యస్య యత:' అంటే ఎవరి నుంచైతే సర్వం ఆవిర్భవిస్తుందో (శ్రీమద్భాగవతం: 1.1.1) అని అర్థం. ప్రామాణిక వైదిక వాఙ్మయాన్ని పరిశీలిస్తే, భగవంతుడు అన్న పదానికి వేదవ్యాసుల తండ్రి పరాశర ముని ఒక చక్కటి నిర్వచనాన్ని అందించారు. 'జ్ఞాన, బల, ఐశ్వర్య, కీర్తి, సౌందర్య, వైరాగ్యాలు' (విష్ణుపురాణం: 6.5.47) అనే ఆరు విభూతిలన్నింటినీ సంపూర్ణంగా కలిగి ఉన్న భగవంతుడు సహజంగానే 'సర్వాకర్షితుడు'గా ఉంటాడు. 'సర్వాకర్షితుడు' అనే పదానికి సంస్కృత పరిభాషలో సమానార్థం వచ్చే పదమే 'కృష్ణ'. కాబట్టి, భగవత్ తత్వాన్ని సంపూర్ణంగా సంక్షిప్తరీతిలో తెలుపుతున్నదే కృష్ణనామం. అందువల్ల ఆ పరిపూర్ణ అవతార పురుషుడినే సకల వేద వేదాంగాలు 'శ్రీకృష్ణ' అని సంబోధించాయి.

### భగవంతుడంటే ఎవరు?

ఒకానొక సందర్భంలో 'హరేకృష్ణ' ఉద్యమ సంస్థాపనాచార్యులైన ప్రభుపాదుల వారివద్దకు ఒక ఆధ్యాత్మిక సాధకుడు వచ్చాడు. 'ఎవరో ఒక స్వామీజీ తానే భగవంతుడినని అన్నాడు. నిజమేనా?' అనడిగాడు. ప్రభుపాదుల వారు బదులిస్తూ, ''ఐతే, నువు ఆయన్ని రెండు ప్రశ్నలడుగు. ఒకటి: నువు నీ మనసులో ఒక తీపి పదార్థాన్ని ఊహించుకొని అదేమిటో చెప్పమను. (సకలజీవుల్లోని పరమాత్మ అతనే అయితే, నిజమైన సమాధానం చెప్పాలి). రెండు: ఎదురుగా వున్న పర్వతాన్ని ఎత్తి పట్టమను, చిటికెన వేలుతో. (ఎందుకంటే, చిన్నారి కన్నయ్య ఆ పనిచేశాడు కనుక). అప్పుడు ఆయనను దేవుడని నమ్మవచ్చు' అన్నారు. ఆ వ్యక్తి సరాసరిగా ఆ స్వామీజీ వద్దకు వెళ్లి ఈ రెండు ప్రశ్నలూ అడిగాడు. ఆయన నుండి అసహనం, క్రోధావేశాలే చూశాడు కానీ, ఆశించిన సమాధానం మాత్రం లభించలేదు. జరిగింది ప్రభుపాదుల వారికి వివరించగా, అప్పుడు 'భగవంతుడంటే ఎవరో' సవివరంగా అతనికి చెప్పారాయన.

శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభుజీ
హరేకృష్ణ మూవ్‌మెంట్
హైదరాబాద్ అధ్యక్షులు,
అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షులు,
(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్)



ధర్మ సందేహం

## స్వేచ్ఛగా బతకకూడదా?

ఆచారాలు, సంప్రదాయాలు పాటించకపోతే ఏమవుతుంది? మన ప్రాచీనులు ఏది చెబితే అది గుడ్డిగా ఆచరిస్తూ పోవాలా? ఎవరికి వాళ్లు స్వేచ్ఛగా బతకవచ్చు కదా? వంటి ప్రశ్నలు కొందరు సంధిస్తారు. ఈ ప్రశ్నల తీరునుబట్టి ఆ అడిగిన వ్యక్తి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆచారాలు, సంప్రదాయాలు మన సంస్కృతి, వారసత్వాల నుంచి అందిపుచ్చుకొన్నవి. తెలుసుకోవాలనే హృదయం ఉన్నవాళ్లకు సరైన శాస్త్రీయ, సహేతుక సమాధానాలు తప్పక లభిస్తాయి. 'య: శ్శాస్త్ర విధిముత్సృజ్య వర్తతే కామకారత:/ న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్' (భగవద్గీత: 23-16) అని శ్రీకృష్ణ పరమాత్మ ఇచ్చిన సందేశాన్ని అర్థం చేసుకొంటే వాస్తవం తెలుస్తుంది. విచ్ఛలవిడిగా వ్యక్తిస్వేచ్ఛతో కూడిన పాశ్చాత్య సంస్కృతిలోని విలువలకు, మన భారతీయ ధార్మిక జీవన విధానాలకూ మధ్య ఉన్న మౌలిక తేడాలను గ్రహిస్తే ఉదాత్త సమాజానికి ఉత్తమ వ్యక్తుల అవసరం తెలుస్తుంది. కాబట్టి, ధర్మబద్ధమైన వ్యక్తి స్వేచ్ఛను మాత్రమే అందరం అంగీకరించాలి.


-సావధానశర్మ

## మహాఘోష!

**అటు మన దేశ స్వాతంత్ర్యానికి, ఇటు సమస్త మానవాళి ధార్మిక ప్రగతికీ మరీ ముఖ్యంగా కృష్ణాష్టమికి అరవింద్ ఘోష్‌తో విడదీయలేని అవినాభావ సంబంధం ఉంది. కనుకే, ఈ చిన్న ప్రస్తావన.**

తత్వదృష్టి

మన భారతదేశం ఇటీవలే 73వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకొన్నది. అలాగే, ఈవారం మరో అయిదు రోజుల్లో పరిపూర్ణ అవతార మూర్తి శ్రీకృష్ణ పరమాత్మ జయంతి (కృష్ణాష్టమి) పండుగనూ దేశప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోబోతున్నారు. ఈ రెండు సందర్భాలనూ కలిపే ఒకే ఒక సందర్భోచిత గొప్ప వ్యక్తి అరవిందులు (అరబిందో ఘోష్). అటు రాజకీయంగా, ఇటు ఆధ్యాత్మికంగా భారతీయులంతా మనస్ఫూర్తిగా ఆరాధించ వలసిన మహోన్నత వ్యక్తి ఆయన! వారిని ఇవాళ మనం ఏ మాత్రం తలచుకొంటున్నామో చెప్పనక్కర్లేదు.
అరవిందులు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15న (క్రీ.శ.1872)న జన్మించడం కాకతాళీయమే అయినా తదనంతరం ఇదొక ఘన సందర్భమే అయ్యింది. మన స్వరాజ్య సాధనకోసం ఆయన ఎంతగా తపించారో అంతేస్థాయిలో కృష్ణతత్వంలో వారు లీనమైనారు. అందుకే, వారిని దేశప్రజలు రాజకీయంగానేకాక ఆధ్యాత్మికంగానూ హృదయపూర్వకంగా తలచుకోవలసి ఉంది. కానీ, వీరితోసహా నాటి, ఏనాటికో చెందిన ఎందరో మన మహానుభావుల్ని అటకెక్కించిన ఘనతను మన భారత జాతి సొంతం చేసుకోవడం ఎంతవరకు సవ్యమో అన్ని తరాల వారూ ఇకనైనా ఆలోచించాలి.
దేశ విభజనను వ్యతిరేకించిన అరవింద్ ఘోష్ అఖండ భారతావని కోసం కన్న కలలు ఇన్నీ అన్నీ కావు. ఇంచుమించు సగం జీవితాన్ని స్వరాజ్య పోరాటానికే ధారాదత్తం చేసిన ఆయనను బ్రిటిష్ వలస పాలకులు వేటాడి, వెంటాడి, జైలు పాల్జేసి, ఆఖరుకు అన్యాయంగా ద్వీపాంతర శిక్షకు సైతం గురిచేసినా వారిలోని ఆత్మనిబ్బరం చెక్కు చెదరలేదు. భారతీయుల బానిస సంకెళ్ల బంధవిముక్తి కోసం ఆయన ఎన్ని త్యాగాలు చేశారో ఆ భగవంతుడికే తెలియాలి. బెంగాలీ కవి-పండితునిగా, సాహితీవేత్తగా అక్షరాల్లోనేకాదు, భరతమాత ముద్దుబిడ్డగా విప్లవజ్యోతుల్ని రగిలించిన ఆయన చాలా చిత్రంగా మన సనాతన ధర్మాన్ని తలకెత్తుకున్న తీరు అనితరసాధ్యం. బాహ్యప్రపంచంలోని అణువణువులోనూ ఆయన 'కృష్ణశక్తి'ని దర్శించిన విధానం అద్భుతం. రాజకీయంగా ఎటూ ఆయన లక్ష్యానికి అందనంత దూరానికి ఇవాళ దేశం చేరుకున్నది. కానీ, ధార్మికంగానైనా భారతావనిని ప్రపంచంలోనే సమున్నత శిఖరానికి చేర్చాలన్న వారి ఆధ్యాత్మిక ఘోషనైనా అందరం అర్థం చేసుకొని ఆచరణలో పెడుదాం.



అష్టకాల విద్యాచరణ్ శర్మ

# నిపుణ
# విద్య ఉద్యోగ సమాచారం

### నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో

**గాంధీనగర్‌లోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్)లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- ప్రాజెక్టు అసిస్టెంట్-20 ఖాళీలు
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ లేదా అగ్రికల్చర్/లైఫ్ సైన్స్‌లో పీజీ. **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **జీతం:** రూ.25,000/- (కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** ఆగస్టు 22న నిర్వహించే ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో లేదా ఈ మెయిల్ ( jobs@nifindia.org)లో
- **వెబ్‌సైట్:** www.nifindia.org

**తిరువనంతపురంలోని లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ (ఎల్‌పీఎస్సీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నీషియన్ అప్రెంటిస్‌ల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.**



### లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్‌లో

- **టెక్నీషియన్ అప్రెంటిస్-87 ఖాళీలు**
- **విభాగాలవారీగా ఖాళీలు:** మెకానికల్-53, ఎలక్ట్రికల్-7, ఎలక్ట్రానిక్స్-13, కెమికల్-1, కంప్యూటర్ సైన్స్-5, సివిల్-6, ఆటోమొబైల్-2
- **అర్హత:** సంబంధిత ఇంజినీరింగ్ విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 ఆగస్టు 30 నాటికి 35 ఏండ్లకు మించరాదు.
- **స్టయిఫండ్ :** నెలకు రూ. 3542/- చెల్లిస్తారు
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీ:** సెప్టెంబర్ 7 (ఉదయం 9.30- సాయంత్రం 5 వరకు)
- **వెబ్‌సైట్:** www.lpsc.gov.in

### ఐఎల్‌బీఎస్‌లో నర్స్ పోస్టులు

**న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ & బిలియరీ సైన్సెస్ (ఐఎల్‌బీఎస్)లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**



- మొత్తం ఖాళీలు: 196 (కాంట్రాక్టు ప్రాతిపదికన)
- ఎగ్జిక్యూటివ్ నర్స్-95,
- జూనియర్ ఎగ్జిక్యూటివ్ నర్స్-101
- **అర్హత:** జీఎన్ఎం ఉత్తీర్ణతతోపాటు నాలుగేండ్ల అనుభవం ఉండాలి. **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** సెప్టెంబర్ 16
- **వెబ్‌సైట్:** www.ilbs.in

### ఈసీఐఎల్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

**హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**




- టెక్నికల్ ఆఫీసర్-20 పోస్టులు (ఈసీఈ-13, ఈఈఈ-2, మెకానికల్-1, సీఎస్ఈ-4) (తాత్కాలిక ప్రాతిపదికన)
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత బ్రాంచీలో బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్షతోపాటు ఏడాది అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** 23,000/- (కన్సాలిడేటెడ్ పే)
- **వయస్సు:** 2019 జూలై 31 నాటికి 30 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీ:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

epaper.ntnews.com

# ఆమె మానవబాంబు!

## భార్య విదేశాలకు వెళ్లకుండా ఆపేందుకు పోలీసులకు చెన్నైవాసి ఫేక్‌కాల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** విదేశాలకు వెళ్తున్న తన భార్యను నిలువరించేందుకు ఓ యువకుడు పిచ్చిచర్యకు పాల్పడ్డాడు. దర్యాప్తులో నిజం బయటపడటంతో అతడు ఊచలు లెక్కిస్తున్నాడు. చెన్నైలో నసీరుద్దీన్ అనే యువకుడు బ్యాగుల తయారీ కంపెనీ నిర్వహిస్తున్నాడు. తన కంపెనీలో పనిచేసే రఫియా అనే యువతిని ప్రేమించి పెండ్లిచేసుకున్నాడు. దంపతులు బాగానే ఉన్నారు. కానీ రఫియా గల్ఫ్‌లో ఉద్యోగం చేయాలనుకున్నది. ఈ విషయం భర్తకు చెప్పింది. అందుకు నసీరుద్దీన్ నిరాకరించాడు. ఈ విషయంలో వారి మధ్య గొడవ జరిగింది. ఆమెను ఆపేందుకు చేసిన ప్రయత్నాలు అన్నీ విఫలమయ్యాయి. ఈ నెల ఎనిమిదిన గల్ఫ్‌కు వెళ్లేందుకు రఫియా ఇంటినుంచి ఢిల్లీ విమానాశ్రయానికి బయలుదేరింది. ఆమె విదేశాలకు వెళ్లకుండా అడ్డుకొనేందుకు నసీరుద్దీన్ పోలీసులకు ఓ


నసీరుద్దీన్

అగంతకుడిగా ఫోన్‌చేశాడు. రఫియా అనే ప్రయాణికురాలు ఆత్మాహుతి దాడికి పాల్పడే ఉగ్రవాది అని, ఢిల్లీ విమానాశ్రయంలో బాంబు పెట్టేందుకు వెళ్తున్నదని, దుబాయ్ లేదా సౌదీఅరేబియా వెళ్లే విమానాన్ని పేల్చేందుకు ఆమె ప్రయత్నిస్తున్నట్టు తెలిపాడు. అప్రమత్తమైన పోలీసులు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చారు. విమానాశ్రయ సిబ్బంది వెంటనే అంతర్జాతీయ విమానాల రాకపోకలను నిలిపివేసి విస్తృత తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబులు, అనుమానాస్పద వ్యక్తులు లేకపోవడంతో ఆ ఫోన్‌కాల్ నకిలీదని గుర్తించారు. దానిపై దర్యాప్తు చేపట్టారు. భార్య విదేశాలకు వెళ్లడం ఇష్టం లేని నసీరుద్దీన్ ఆమెను ఆపేందుకు ఈ ఫోన్‌చేసినట్టు గుర్తించారు. నసీరుద్దీన్‌ను అరెస్టుచేసి జైలుకు పంపారు.

# 71 గొర్రెలివ్వు.. ఆయన భార్యను తీసుకెళ్లు

- ప్రేమ వ్యవహారంలో యూపీలో పంచాయతీ పెద్దల విచిత్ర తీర్పు
- ప్రియుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు

**లక్నో:** ప్రియుడే కావాలని ఓ వివాహిత కోరుకోవడంతో అక్కడి గ్రామ పెద్దలు విచిత్రమైన తీర్పు చెప్పారు. యువతి భర్తకు 71 గొర్రెలు ఇవ్వాలంటూ ప్రియుడ్ని ఆదేశించారు. ప్రియుడి తండ్రికి తీర్పు నచ్చక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గత నెల 22 నుంచి ఈ వివాదం కొనసాగుతున్నది. ఈ విచిత్ర పంచాయతీ ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగింది. గోరఖ్‌పూర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి స్థానిక యువతితో ఇటీవల పెండ్లి జరిగింది. కొద్దిరోజులకే ఆమె ప్రియుడితో కలిసి పారిపోయింది. ఇటీవల గ్రామంలో భర్త, ప్రియుడు ఒకరికొకరు ఎదురుపడటంతో ఘర్షణ మొదలైంది. విషయం పంచాయతీ పెద్దల వరకు వెళ్లింది. ప్రియుడే కావాలని వివాహిత కోరుకోవడంతో భర్తకు పరిహారంగా ప్రియుడి వద్ద ఉన్న 142 గొర్రెల్లో సగం ఇవ్వాలని తీర్పునిచ్చారు. దానికి అతడు ఒప్పుకొన్నాడు. యువతి భర్తకు 71 గొర్రెలను ఇచ్చేశాడు. అయితే ప్రియుడి తండ్రి ఈ తీర్పును ఒప్పుకొనేది లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గొర్రెలను తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశాడు. ఇంత జరుగుతున్నా ఆ యువతి తన ప్రియుడితోనే కలిసి ఉంటానని చెప్తున్నారు. చివరకు కేసు పరిష్కారం భాద్యత ఖోరాబర్ పోలీసులపైకి చేరింది.



# ఆర్టికల్ 370 ఉగ్రవాదుల రక్షణ కవచం

- జమ్ముకశ్మీర్ ప్రజల శ్రేయస్సు దృష్ట్యా దాన్ని రద్దు చేశాం
- కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడి



**నాగ్‌పూర్, ఆగస్టు 17:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 ఉగ్రవాదులకు, వారిని ప్రోత్సహిస్తున్న వారికి రక్షణకవచంగా మారిందని, సాధారణ ప్రజల శ్రేయస్సు దృష్ట్యా దాన్ని రద్దు చేసినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో శనివారం జరిగిన రాష్ట్ర న్యాయ సేవా సంస్థల 17వ అఖిల భారత సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'జాతీయ ప్రయోజనాల కోసమే తాత్కాలిక నియమమైన ఆర్టికల్ 370ని రద్దు చేశాం. దేశ రక్షణతోపాటు జమ్ముకశ్మీర్ ప్రజల కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నది. జమ్ముకశ్మీర్ అభివృద్ధి చెందాలని మేం కోరుకుంటున్నాం' అని అన్నారు. అవినీతి నిరోధక చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, మరుగుదొడ్లను మనుషులు శుభ్రపరచడాన్ని అడ్డుకునే చట్టం వంటివి అక్కడ ఎందుకు అమలు కావడం లేదు? ఇదేం కశ్మీర్? అని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో బాలాకోట్ వంటి దాడికి భారత్ సిద్ధమవుతున్న పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా.. 'వారు చెప్పే ప్రతి మాటను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. పాక్ ఎలాంటి చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తాం. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ రక్షణకు అప్రమత్తంగా ఉన్నాం. ఎలాంటి ఉగ్రవాద చర్యలనైనా సమర్థవంతంగా తిప్పికొడతాం' అని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు.

# రక్షణ కొనుగోళ్ల విధానంపై సమీక్ష

## ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ ఆమోదం

**న్యూఢిల్లీ:** రక్షణశాఖ కొనుగోళ్లలో ఎటువంటి జాప్యం లేకుండా చూడటానికి, ఈ మేరకు ప్రస్తుతం ఉన్న 'రక్షణ కొనుగోళ్ల విధానం–2016' (డీపీపీ)ని సమీక్షించేందుకు ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేశారు. దీనికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆమోదం తెలిపారు. విధానపరమైన కారణాలతో ఆయుధాల సేకరణ ఆలస్యమవుతున్నందున ఈ సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి కమిటీ సిఫారసులు చేయనున్నది. తద్వారా డీపీపీ 2016కు సవరణలు చేయనున్నారు. 'డీపీపీ 2016, డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ 2009ను సమీక్షించేందుకు డైరెక్టర్ జనరల్ (అక్విజిషన్) అధ్యక్షతన కమిటీ ఏర్పాటుకు రక్షణశాఖ మంత్రి ఆమోదం తెలిపారు. సంయుక్త కార్యదర్శి హోదా కంటే తక్కువకాకుండా లేదా ఆర్మీలో మేజర్ జనరల్‌తో సమాన హోదా కలిగిన 11 మంది సభ్యులు ఇందులో ఉంటారు. కమిటీ తమ సిఫారసులను ఆరునెలల్లో అందజేయనుంది' అని రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. ప్రస్తుతం ఉన్న విధానాన్ని సరళతరం చేయడంతోపాటు దేశంలో రక్షణ పారిశ్రామిక స్థావరాలను అభివృద్ధి పరిచి, రక్షణరంగంలో వాటి భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు, ఆయుధాల సేకరణను వేగవంతం చేసేందుకు ఈ ఉన్నతస్థాయి కమిటీ పలు సిఫారసులు చేయనుంది. భారతీయ స్టార్టప్‌లను ప్రోత్సహించడంతోపాటు పరిశోధన, అభివృద్ధి విషయాల్లోనూ కమిటీ సూచనలు ఇవ్వనుంది.

# లోయలో స్వల్ప ఊరట

## కశ్మీర్‌లో పాక్షికంగా ఆంక్షల సడలింపు.. 50వేల ల్యాండ్‌లైన్ సేవలు పునరుద్ధరణ


- సోమవారం నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు, కార్యాలయాలు
- జమ్ములోని ఐదు జిల్లాల్లో 2జీ ఇంటర్నెట్ సేవలు ప్రారంభం


ఆంక్షల ఎత్తివేత నేపథ్యంలో శనివారం శ్రీనగర్‌లో వాహనాలు తిరుగుతున్న దృశ్యం

**శ్రీనగర్/జమ్ము, ఆగస్టు 17:** జమ్ముకశ్మీర్‌లో క్రమంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇప్పటికే జమ్ములో ప్రజల కదలికలపై ఆంక్షలు ఎత్తివేయగా.. తాజాగా కశ్మీర్‌లోయలోని కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలను తొలగించారు. ల్యాండ్‌లైన్ సేవలను పునరుద్ధరిస్తున్నారు. శనివారం లోయలోని 35 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆంక్షలను తొలిగించినట్టు డీజీపీ దిల్బాగ్ సింగ్ తెలిపారు. మొత్తం 96 టెలిఫోన్ ఎక్స్ఛేంజీలకుగానూ 17 ఎక్స్ఛేంజీల పరిధిలో ల్యాండ్‌లైన్ సేవలను పునరుద్ధరించినట్టు రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి రోహిత్ కన్సల్ చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత కొనసాగిస్తున్నామన్నారు. రోడ్లమీద బారికేడ్లు ఉన్నాయని, అయితే తనిఖీ అనంతరం పౌరులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు అనుమతి ఇస్తున్నామని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో వ్యాపారులు దుకాణాలను తెరిచారన్నారు. అయితే చాలావరకు పెట్రోల్ బంక్‌లు ఇంకా మూసే ఉన్నట్టు వెల్లడించారు. రోడ్లపై ప్రైవేట్ వాహనాల సంఖ్య పెరిగిందని, కొన్నిచోట్ల అంతర్ జిల్లాల సర్వీసులు కూడా మొదలయ్యాయని చెప్పారు. సోమవారం లోయవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు తెరుచుకోనున్నాయని, ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తాయని తెలిపారు. 17 టెలిఫోన్ ఎక్స్ఛేంజీల పరిధిలో ల్యాండ్‌లైన్ సేవలు పునరుద్ధరించామని, మరో 20 ప్రాంతాల్లో త్వరలో పునరుద్ధరిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం 50 వేల ల్యాండ్‌ఫోన్లు పనిచేస్తున్నాయన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిస్థాయిలో నడుస్తున్నదని తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని చెప్పారు. శ్రీనగర్‌లోని కంటోన్మెంట్, ఎయిర్‌పోర్ట్, రాజ్‌భాగ్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ల్యాండ్‌లైన్ సర్వీసులు పునరుద్ధరించినట్టు వివరించారు. సెంట్రల్ కశ్మీర్‌లోని బుదామ్, సోన్‌మార్గ్, మనిగమ్, ఉత్తర కశ్మీర్‌లోని గురెజ్, తంగ్‌మార్గ్, యూరి కెరన్ కర్ణ, తాంగ్ధర్, దక్షిణ కశ్మీర్‌లోని కాజీగండ్, పహల్గాంలో ల్యాండ్‌లైన్లు పనిచేస్తున్నాయని చెప్పారు. ఆదివారం సాయంత్రానికి అన్నిచోట్ల ల్యాండ్‌లైన్ సేవలను పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

**జమ్ములో టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు**

జమ్ము ప్రాంతంలో అన్నిచోట్ల ల్యాండ్‌లైన్, సెల్‌ఫోన్లు పనిచేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి రోహిత్ కన్సల్ తెలిపారు. ఐదు జిల్లాల పరిధిలో 2జీ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించామన్నారు. శనివారం జమ్ములోని పూంచ్, బనిహల్, కిస్త్వార్, భదేర్వా పట్టణాల్లో ఆంక్షలను ఎత్తివేశామని, దీంతో జమ్ము వ్యాప్తంగా ఆంక్షలను తొలిగించినట్టయిందని డీజీపీ తెలిపారు. నేతలను ఎప్పుడు విడుదల చేస్తారన్న ప్రశ్నకు బదులిస్తూ.. స్థానిక అధికారులు అక్కడి శాంతి భద్రతల పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. జమ్ము, సాంబా, కరువా, ఉదంపూర్, రేసి జిల్లాల్లో 2జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని, దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలపై మరోసారి సమీక్షించిన తర్వాత పరిస్థితులను బట్టి 3జీ, 4జీ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరిస్తామన్నారు. పూంచ్, రాజౌరీ, కిస్త్వార్, దోడా, రంబన్ జిల్లాల్లో ఇప్పటికీ ఇంటర్నెట్‌పై నిషేధం కొనసాగుతున్నదన్నారు. పట్టణ ప్రాంతాలతోపాటు పలు గ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని, ఇదొక శుభ పరిణామమని అధికారులు తెలిపారు.


ఆంక్షల ఎత్తివేత నేపథ్యంలో ల్యాండ్‌లైన్ ఫోన్ మాట్లాడుతున్న సాధారణ పౌరుడు



# ఇంజినీర్‌ను బలిగొన్న చైనా మాంజా

- ద్విచక్ర వాహనంపై వెళ్తూ మృత్యువాత.. ఢిల్లీలో దారుణం

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** చైనా మాంజా ఓ ఇంజినీర్‌ను బలిగొన్నది. ఢిల్లీలోని పశ్చిమ విహార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. బుధ్ విహార్‌కు చెందిన మానవ్‌శర్మ గురువారం తన ఇద్దరు సోదరిలతో రాఖీ కట్టించుకున్నాడు. అనంతరం వారితో కలిసి స్కూటర్‌పై బంధువుల ఇంటికి వెళ్తుండగా పశ్చిమ విహార్ ప్రాంతంలో ఎగురుతున్న ఓ గాలిపటం మాంజా ఆయన మెడకు చుట్టుకున్నది. గొంతు కోసుకుపోవడంతో వాహనం నుంచి కిందకు పడిపోయాడు. మానవ్‌ను వెంటనే సమీప దవాఖానకు తరలించగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. స్కూటర్‌పైనున్న మానవ్ ఇద్దరు సోదరిలకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మానవ్ శర్మ ఓ ప్రైవేట్ కంపెనీలో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా ఢిల్లీ పరిధిలో గురువారం 'మాంజా' కారణంగా ఎనిమిది మంది గాయపడినట్లు తెలుస్తున్నది. పోలీసులు 17 కేసులు నమోదు చేశారు. పక్షులతోపాటు మనుషులకూ ప్రమాదకారిగా మారిన చైనా మాంజా (గాజు పూతతో కూడిన దారం) కొనడం, అమ్మడం, వినియోగంపై సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఉల్లంఘించిన వారిపై ఐపీసీ 188 సెక్షన్ ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతారు.


తెలంగాణకు హరితహారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా జైలు ఆవరణలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగిన దృశ్యం

# హరిత కారాగారం

- పచ్చదనంతో ఆకట్టుకుంటున్న సంగారెడ్డి జైలు
- సత్ఫలితాలిస్తున్న తెలంగాణకు హరితహారం

**సంగారెడ్డి రూరల్:** సంగారెడ్డి జిల్లా జైలు.. పచ్చదనానికి ఆనవాలుగా నిలుస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ప్రస్తుతం ఎదుగుతూ హరితమయంగా మారుతున్నది. ఎటుచూసినా పచ్చదనంతో కనులవిందు చేస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నది. సంగారెడ్డి జిల్లా జైలులో అడుగుపెడితే చుట్టూ పచ్చని చెట్లు, పూల మొక్కలే దర్శనమిస్తున్నాయి. ఏటా హరితహారం కార్యక్రమంలో భాగంగా జైలు అధికారులు ఇక్కడ వేలసంఖ్యలో మొక్కలు నాటారు. ప్రత్యేకంగా ఆరుగురు ఓపెన్ జైలు ఖైదీలతో మొక్కలను సంరక్షిస్తున్నారు. రోజువారీగా వాటికి అవసరమైన నీటిని పోసి నర్సరీలను అందంగా తీర్చిదిద్దారు. ఇతర రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను బతికించుకుని జైలును పచ్చని నందనవనంలా తీర్చిదిద్దారు. జిల్లా జైలు మొత్తం 40 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, ఇందులో 20 ఎకరాల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇప్పటివరకు జిల్లా జైలులో 600 మామిడి మొక్కలను నాటారు. అవి వృక్షాలుగా ఎదగడంతో.. వాటి ద్వారా వచ్చిన మామిడిపండ్లను అమ్మి జైలు శాఖ లాభాలను ఆర్జిస్తున్నది. వీటితోపాటు జైలు ఆవరణలో 13 వేల టేకు చెట్లు ప్రత్యేక రక్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 200 మామిడి మొక్కలు, 200 టేకు మొక్కలను నాటారు. రెండో దఫాగా మరో వెయ్యి మామిడి మొక్కలు, 100 టేకు మొక్కలు, 100 శ్రీగంధం మొక్కలను నాటనున్నట్టు సంగారెడ్డి జిల్లా జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ తెలిపారు.





# అరచేతిలో పర్యాటకం

- టూరిజంశాఖ మొబైల్ యాప్‌లో ప్యాకేజీలు, ఈవెంట్లు, ఇతర సేవలు
- 'ఐ ఎక్స్‌ప్లోర్ తెలంగాణ'కు విశేష ఆదరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ పర్యాటకశాఖ ప్రారంభించిన 'ఐ- ఎక్స్‌ప్లోర్ తెలంగాణ' యాప్‌కు విశేష ఆదరణ లభిస్తున్నది. అన్నిరకాల సమాచారం అందుబాటులోకి తీసుకొస్తూ.. ప్రత్యేకంగా రూపొందించిన ఈ యాప్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. టూరిజంపై ప్రత్యేక దృష్టిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. టెంపుల్, నేచర్, హెరిటేజ్, వైల్డ్ లైఫ్, అడ్వెంచర్ జర్నీస్, అమ్యూజ్‌మెంట్స్, అర్బన్ ఫారెస్ట్ పార్క్స్, బోటింగ్ యూనిట్స్ ఇలా.. పర్యాటక ప్రాంతాలను విభజించి అభివృద్ధి చేస్తున్నది. దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నది. ఆయా క్షేత్రాలకు చేరుకొనేందుకు గల రవాణామార్గాలు, ప్రయాణ చార్జీలు, సమీపంలోని టూరిజం కేంద్రాలు, సంప్రదించాల్సిన నంబర్లు తదితర సమాచారాన్ని 'ఐ-ఎక్స్‌ప్లోర్ తెలంగాణ' యాప్‌లో పొందుపర్చారు. పర్యాటకశాఖ అందిస్తున్న డెయిలీ, వీకెండ్, ఇంటర్ స్టేట్, ఆన్ డిమాండ్ టూర్ల ప్యాకేజీల గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొనే సౌకర్యం కల్పించారు. మ్యాప్‌లు, వసతి సదుపాయాలు, మెట్రో, ఎంఎంటీఎస్, బస్సులు, రైళ్లు, ఆరోగ్యం, షాపింగ్, పోలీస్, జీహెచ్‌ఎంసీ, వాతావరణ కేంద్రం సేవలను ఈ యాప్‌లో పొందుపరిచారు. సమీపంలోని చైల్డ్ హెల్ప్ లైన్, బ్లడ్ బ్యాంకులు, ఐ బ్యాంకులు, యానిమల్ కేర్, గెస్ట్‌హౌస్‌లు, రిసార్ట్స్, ఎయిర్‌లైన్స్, ఫైర్, అంబులెన్స్‌లు.. ఇలా ముఖ్యమైన అన్ని సేవల వివరాలు యాప్‌లో ఉన్నాయి.

**హస్తకళలు.. పండుగలు**

హస్తకళలకు సంబంధించి ఈ యాప్‌లో 'ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్' పేరిట సమాచారం పొందుపరిచారు. పెంబర్తి బ్రాస్, చేర్యాల్ స్క్రోల్ పెయింటింగ్, నిర్మల్ పెయింటింగ్స్, బాటిక్ పెయింటింగ్స్, బిద్రి క్రాఫ్ట్, డోక్రా మెటల్ క్రాఫ్ట్స్, పోచంపల్లి హ్యాండ్లూమ్స్.. ఇలా పూర్తి సమాచారం ఈ యాప్‌లో ఉంచారు. 'ఫెస్టివల్స్ ఆఫ్ తెలంగాణ' పేరిట తెలంగాణ పండుగలు, ప్రత్యేకతలతో సమాచారాన్ని అందిస్తున్నారు. ఐనవోలు మల్లన్న జాతర, బతుకమ్మ, బోనాలు, సమ్మక్క సారక్క జాతర, కురుమూర్తిస్వామి జాతర తదితరాల గురించి యాప్‌లో వివరిస్తూ.. ఏయే పండుగలను ఎక్కడ జరుపుకొంటారో తెలియజేశారు.




**ఒక్కక్లిక్‌తో అత్యవసర సేవలు**

పర్యాటకులకు ఆరోగ్యం, పోలీసు వంటి అత్యవసర సేవల కోసం ఎక్కడికి, ఎలా వెళ్లాలో తెలియకపోవచ్చు. అందుకే టీఎస్‌టీడీసీ ప్రత్యేక ఫీచర్‌ను ఏర్పాటుచేసింది. ఆరోగ్యం, వసతి సేవలతోపాటు ఆపద సమయంలో ఒక్క క్లిక్ ద్వారా పోలీసులను సంప్రదించే ఫీచర్‌ను రూపొందించింది. మహిళల కోసం 'ఉమెన్ ట్రావెల్ మోడ్ సేఫ్' పేరుతో ప్రత్యేక ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణం చేస్తున్నాం, వాహన నంబర్ నమోదుచేయగానే పోలీసు కంట్రోల్ వ్యవస్థకు అనుసంధానం అవుతుంది. పేర్కొన్న రూట్‌లో కాకుండా వాహనం వేరే మార్గం వైపు వెళ్తే పోలీసులు అప్రమత్తమై క్షణాల్లో సమీపంలోకి చేరుకుంటారు. నగరంలోని విద్యార్థులు, ఉద్యోగం చేసే మహిళలు ఎక్కువగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్టు టీఎస్‌టీడీసీ అధికారులు చెప్తున్నారు.

### యాప్.. పర్యాటకులకు దిక్సూచి



తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచవ్యాప్తం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నది. తెలంగాణలో అద్భుత పర్యాటక క్షేత్రాలు ఉన్నాయి. ఏటా పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. దేశ, విదేశీ పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా, సులువుగా, సురక్షితంగా టూరిజాన్ని ఆనందించాలనే సంకల్పంతో ఐ-ఎక్స్‌ప్లోర్ యాప్‌ను రూపొందించాం. పర్యాటకులకు ఇది దిక్సూచిగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ యాప్‌కు విశేష ఆదరణ లభిస్తున్నది.

**- బుర్రా వెంకటేశం,**
**తెలంగాణ టూరిజంశాఖ కార్యదర్శి**

# పర్యాటక పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- సెప్టెంబర్ నాలుగు గడువు తేదీ
- 12 క్యాటగిరీల్లో అవార్డుల ప్రదానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పర్యాటకానికి మరింత ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో 'తెలంగాణ టూరిజం అవార్డులు' ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. సెప్టెంబర్ 27న వరల్డ్ టూరిజం డే సందర్భంగా పురస్కారాలు ప్రదానంచేయాలని నిర్ణయించింది. సెప్టెంబర్ నాలుగులోగా దరఖాస్తులను పంపించాలని పర్యాటకశాఖ శనివారం ఒక ప్రకటనలో కోరింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, క్లాసిఫైడ్ హోటళ్లు, రెస్టారెంట్లు, ఇండిపెండెంట్ హోటళ్లు తదితర సెగ్మెంట్లను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషిస్తున్నవారిని ఎంపికచేస్తామని, ఎక్స్‌లెన్స్ ఇన్ రైటింగ్ లేదా పబ్లికేషన్, బెస్ట్ ఫిల్మ్ ఆన్ తెలంగాణ టూరిజం లేదా హెరిటేజ్, హోమ్‌స్టే ఎస్టాబ్లిష్‌మెంట్, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ టూరిజం సెక్టార్, రూరల్ టూరిజం, టూరిజం క్లబ్.. ఇలా మొత్తం 12 క్యాటగిరీల్లో అవార్డులు ఇవ్వనున్నట్టు వెల్లడించింది. పూర్తి వివరాలకు www.telanganatourism.gov.in వెబ్‌సైట్ చూడాలని, లేదా జిల్లాల్లోని పర్యాటక కేంద్రాల్లో సంప్రదించాలని కోరింది.

## చంద్రబాబు ఇంటికి నోటీసు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణానది వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో నివాసాన్ని ఖాళీచేయాలని టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడుకు తాడేపల్లి తాసిల్దార్ నోటీసు జారీచేశారు. వరదల వల్ల నివాసంలోకి నీరు వచ్చే అవకాశం ఉన్నందున సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని నోటీసులో కోరారు. ఇంట్లోఎవరూ లేకపోవడతో స్థానిక వీఆర్వో గోడకు నోటీసును అంటించారు.

## 23న పెన్షన్ అదాలత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంట్స్ డైరెక్టర్ కేఎస్సార్సీ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన క్లయింట్లు హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియానికి రావాలని సూచించారు.

# ఎయిడ్స్‌పై అవగాహన పెంచాలి


- హెచ్‌ఐవీ బాధితుల్లో 40 శాతం మంది 15-24 ఏండ్ల మధ్య వయస్కులే
- రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసన్నకుమారి
- కోఠి ఉమెన్స్ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎయిడ్స్‌పై యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉన్నదని, అందుకోసమే ప్రతియేటా ఆగస్టులో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసన్నకుమారి అన్నారు. ఈ ఏడాది అవగాహనా కార్యక్రమానికి 'హెచ్‌ఐవీ గురించి అవగాహన పెంచుకుందాం' అనే నినాదాన్ని ఎంచుకున్నట్టు తెలిపారు. కోఠి ఉమెన్స్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ.. కొత్తగా హెచ్‌ఐవీ సోకుతున్నవారిలో దాదాపు 40 శాతం మంది 15–24 ఏండ్ల మధ్య వయసున్నవారేనని, ప్రతిరోజూ 2,400 మంది యువత హెచ్‌ఐవీ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. హెచ్‌ఐవీపై విద్యార్థినులు అవగాహన పెంపొందించుకుని ఎయిడ్స్ నివారణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఐవీ సోకినవారిని వివక్షకు గురిచేయకుండా వారిపట్ల సానుభూతితో మెలగాలని సూచించారు. హెచ్‌ఐవీ సోకడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న చికిత్స వివరాలను ఈ సందర్భంగా విద్యార్థినులకు తెలియజేశారు. హెచ్‌ఐవీకి సంబంధించిన అంశాలపై వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్, స్లోగన్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులను ప్రదానం చేశారు. కోఠి మహిళా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రోజారాణి, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారులు, సిబ్బందితోపాటు యూనివర్సిటీ మహిళా కళాశాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్లు, టీఎన్జీవోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# దక్షిణ మధ్య రైల్వే జీఎం ఆకస్మిక తనిఖీ

- లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతపై ఆరా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్య శనివారం సికింద్రాబాద్- బొల్లారం- మేడ్చల్ సెక్షన్ మధ్య ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతా ప్రమాణాలను తనిఖీచేశారు. మొదట లాలాగూడ లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద పురోగతిలో ఉన్న రోడ్ అండర్ బ్రిడ్జి పనులను సమీక్షించి నిర్మాణం త్వరగా పూర్తిచేసేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై అధికారులతో చర్చించారు. మల్కాజిగిరి, సఫిల్‌గూడ, బొల్లారం, గుండ్ల పోచంపల్లి, గౌడవల్లి, మేడ్చల్ మార్గంలో కాపలా ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్లను తనిఖీచేశారు. భద్రతా నియమాలను పాటించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గేట్‌మన్‌లతో సంభాషించారు. బొల్లారం రైల్వే స్టేషన్‌లో స్టేషన్‌మాస్టర్ కార్యాలయాన్ని, గుండ్లపోచంపల్లి స్టేషన్ పరిసరాలను పరిశీలించి ప్రయాణికుల వసతుల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికపై అధికారులతో చర్చించారు. పర్యటనలో హైదరాబాద్ డివిజన్ డీఆర్‌ఎం సీతారాంప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడు ఫొటోగ్రఫీ అవార్డుల ప్రదానం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటో పోటీల విజేతలకు ఆదివారం బేగంపేటలోని ఐటీసీ గ్రాండ్ కాకతీయ హోటల్‌లో అవార్డులు అందజేయనున్నట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ అరవింద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారు తెలంగాణ, ఫొటో జర్నలిస్టు, సిటీ అభివృద్ధి, తెలంగాణ పండుగలు అనే క్యాటగిరీలుగా పోటీలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, కన్సోలేషన్ బహుమతుల కింద రూ.10 వేలు, రూ.5 వేల నగదు పారితోషికంతోపాటు ప్రశంసాపత్రం అందజేసి సన్మానించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సీఎస్ ఎస్కే జోషి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
ఆదివారం 18 ఆగస్టు 2019



# వెబ్‌సిరీస్‌లో సమంత

ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో ప్రదర్శితమయ్యే వెబ్‌సిరీస్‌లపై ఇప్పుడు అగ్ర నటీనటులు కూడా ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. కథాంశాలపరంగా విస్తృత సృజనాత్మక వ్యక్తీకరణకు ఈ డిజిటల్ వేదికలు సౌకర్యవంతమైనవని భావిస్తున్నారు. ఇప్పటికే పలువురు బాలీవుడ్ అగ్రతారలు వెబ్‌సిరీస్‌లలో నటిస్తూ తమ అభిరుచిని చాటుకుంటున్నారు. తాజాగా దక్షిణాది అగ్రనాయిక సమంత వెబ్ సిరీలో నటిస్తున్నది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సిరీస్ చిత్రీకరణ చెన్నైలో జరుగుతుందని చెబుతున్నారు. ఇప్పటివరకు దక్షిణాది చిత్రసీమకే పరిమితమైన సమంత ఈ వెబ్‌సిరీస్ ద్వారా తొలిసారి హిందీలో అడుగుపెట్టబోతుండటం విశేషం. వినూత్నమైన కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ సిరీస్‌లో సమంత వైవిధ్యమైన పాత్రలో కనిపించనుందని సమాచారం. ఇటీవలే 'ఓ బేబీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకుంది సమంత. ప్రస్తుతం ఆమె '96' తెలుగులో రీమేక్‌లో శర్వానంద్ సరసన కథానాయికగా నటిస్తున్నది.

వాణిజ్య సమీకరణాలు శర్వానంద్‌కు అస్సలు పట్టవు. నిరంతరం నవ్యమైన కథాంశాల కోసం అన్వేషణ సాగిస్తుంటారు. ప్రయోగాలకు పెద్దపీట వేస్తూ తనని తాను కొత్తపంథాలో ఆవిష్కరించుకోవాలని తపిస్తారు. 'ఓ సినిమా వందకోట్ల వసూళ్లు సాధిస్తే తిరిగి అదే దారిలో ప్రయాణించాలా? నటుడిగా వైవిధ్యత కోసం మరో మార్గాన్ని ఎంచుకోవాలా? అనే సందిగ్ధం ప్రతి నటుడికి ఉంటుంది. అంతిమంగా మన అంతరాత్మ ప్రబోధం మేరకు సినిమాలు చేయాలి' అంటున్నారు శర్వానంద్. దాదాపు పదిహేనేళ్లుగా సాగుతున్న సుదీర్ఘ కెరీర్‌లో విభిన్న పాత్రల్లో రాణిస్తూ విలక్షణతకు చిరునామాగా నిలుస్తున్నారు. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన 'రణరంగం' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విశేషాలివి..

# అంతిమ ఫలితాన్ని నిర్ణయించేది వసూళ్లే!



శర్వానంద్

**'రణరంగం' చిత్రానికి ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన లభిస్తున్నది?**

• విడుదలైన తొలిరోజు మార్నింగ్ షోకు మిశ్రమ స్పందన వచ్చింది. మ్యాట్నీకొచ్చేసరికి ఫర్వాలేదన్నారు. ఫస్ట్‌షో యావరేజ్ అన్నారు. ప్రస్తుతానికైతే ఎబౌ యావరేజ్ దగ్గర ఆగింది (నవ్వుతూ). అయితే సినిమా చూసినవారెవరూ బాగాలేదని చెప్పలేదు. ఓ విభిన్నమైన మేకింగ్‌తో కూడిన సినిమా చూశామనే అనుభూతి మిగిల్చిందని సంతోషం వ్యక్తం చేశారు.

**విడుదలకు ముందు సినిమాపై మీ అంచనాలు ఎలా ఉన్నాయి. ఆశించిన ఫలితానికి చేరువయ్యారని భావిస్తున్నారా?**

• వాస్తవం చెప్పాలంటే మేము అనుకున్న ఫలితం రాలేదు. భారీ ఓపెనింగ్స్ వస్తాయనుకున్నాం. ఈ సినిమా సమీక్షలకు, రాబడుతున్న వసూళ్లకు ఏమాత్రం సంబంధం కనిపించడం లేదు. సమీక్షకులు కొంచెం కనికరించి ఉంటే ఫలితాలు మరింత మెరుగ్గా ఉండేవి కావొచ్చు (నవ్వుతూ). ఏది ఏమైనా అంతిమంగా సినిమా ఫలితాల్ని నిర్ణయించేది వసూళ్లే కాబట్టి రానున్న రోజులు పాజిటివ్‌గా ఉంటాయని ఆశిస్తున్నాం.

**సినిమాలో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించారు. ఓ నటుడిగా ఆ పాత్ర మీకు ఎలాంటి సంతృప్తినిచ్చింది?**

• గతకొంతకాలంగా నేను ఎక్కువగా ఫ్యామిలీ, కామెడీ జోనర్ సినిమాల్నే చేస్తున్నాను. ఒకే మూసలో సాగుతున్న ప్రయాణంలో కొత్త మలుపు తీసుకుంటే బాగుంటుందనిపించింది. గ్యాంగ్‌స్టర్‌గా నా పాత్రలో రెండు భిన్న పార్శ్వాలు కనిపిస్తాయి. కథాపరంగా కూడా నేను ఇప్పటివరకు టచ్ చేయని కోణమిది. అందుకే ప్రేక్షకులందరూ గ్యాంగ్‌స్టర్ పాత్రకు పరిపూర్ణంగా న్యాయం చేశానని ప్రశంసిస్తున్నారు. ఓ నటుడిగా ఇంతకంటే మంచి పాత్రను నేను ఎప్పుడూ ఆశించలేదు.

**ఈ సినిమా విషయంలో విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉంది. మీరు పోషించిన పాత్ర బాగుందని అందరూ ముక్త కంఠంతో ప్రశంసిస్తున్నారు. కథను ఆవిష్కరించిన విధానం మాత్రం విమర్శల్ని ఎదుర్కొంటున్నది?**

• ఓ నటుడిగా నేనేమిటో మీ అందరికి తెలుసు. 'శర్వానంద్ మంచి కథల్ని ఎంచుకుంటాడు' అని ప్రతిసారి మీరు నన్ను మెచ్చుకునేవారు. నా కెరీర్ ఆరంభం నుంచి అదే పంథాను నమ్మాను. అయితే 'రణరంగం' విషయంలో ఓ కొత్త ప్రయత్నం చేద్దామనుకున్నా. నేను మొదటి నుంచి చెబుతున్నట్లు కథను దృష్టిలో పెట్టుకొని చేసిన సినిమా కాదిది. ప్రేక్షకుల ఆదరణ, సమీక్షకుల అభిప్రాయాల మధ్య అంతరం కనిపిస్తున్నది. కలెక్షన్స్ బాగున్నాయి. ఎక్కడ తప్పు జరిగిందనే విషయం మాత్రం అర్థంకావడం లేదు. అంతిమ ఫలితం ఏమిటో తెలుసుకోవాలంటే మరి కొద్ది రోజులు నిరీక్షించాల్సిందే (నవ్వుతూ).

**ఈ సినిమాలో మీరు బ్లాక్‌టిక్కెట్స్ అమ్మేవాడిగా, అక్రమ వ్యాపారం చేసేవాడిగా కనిపించారు. గతంలో మీకున్న ఇమేజ్‌కు ఇలాంటి పాత్ర చిత్రణ ప్రతికూలంగా మారుతుందని అనుకోలేదా?**

• అలాంటిదేమి లేదు. ప్రేక్షకులు ఎప్పుడూ కథేమిటో చూస్తారు. అది తెరపై ఎంత అర్థవంతంగా ఆవిష్కృతమైందో అని ఆలోచిస్తారు. గతంలో నేను 'శతమానం భవతి' సినిమా చేశానని..అదే దృష్టిలోంచి చూస్తే అసలు ఈ సినిమాకు ఎవరూ రారు (నవ్వుతూ). ఓ నటుడిని వైవిధ్యమైన పాత్రల్లో చూడాలనే ప్రేక్షకులు కోరుకుంటారు.

> **• స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే ఓ స్టైలిష్ ఫిల్మ్ తీస్తున్నామని మొదటి నుంచి చెప్పాం. కథగా కొత్తగా ఉంటుందని ఎప్పుడూ అనలేదు. అయితే సినిమాల విషయంలో మన అంచనాలన్నీ నిజమవుతాయని ఎవరూ ఊహించలేరు. అలా అయితే ప్రతి సినిమా హిట్టే. సినిమా విషయంలో నిజానిజాలేమిటో అంతిమంగా కలెక్షన్సే నిర్ణయిస్తాయి.**

**తెరపై మీ పాత్రని చూసుకున్నప్పుడు ఎలాంటి భావోద్వేగాలు కలిగాయి?**

• 'రణరంగం' సినిమాలో నా పాత్రను పరిపూర్ణంగా ఆస్వాదించాను. 'ప్రస్థానం' 'రన్ రాజా రన్' తర్వాత ఓ విభిన్నమైన ప్రయత్నంలా భావించా. ప్రతి ఫ్రేమ్‌లో బాగున్నాననిపించింది.

**రొటీన్ పంథాను బ్రేక్ చేయడానికి స్టైలిష్ యాక్షన్ ఫిల్మ్ 'రణరంగం' చేశానని చెప్పారు. భవిష్యత్తులో ఇదే దారిలో ప్రయాణిస్తారా?**

• 'ప్రస్థానం' తర్వాత నేను కొత్త జోనర్ సినిమాలు చేశాను. 'శతమానం భవతి' అనంతరం మరో కొత్తదారిని ఎంచుకున్నా. ఏదో ఒక ఇమేజ్‌కు బందీ కావడం నాకు ఇష్టం ఉండదు. శర్వా సినిమా అంటే కొత్త కథ ఉంటుందని ప్రేక్షకులు భావించాలి. భవిష్యత్తులో కూడా వినూత్నమైన ఇతివృత్తాల్ని ఎంచుకుంటూ ప్రయాణం సాగిస్తాను.

**ఈ సినిమా ద్వారా బీ, సీ క్లాస్ ఆడియెన్స్‌కు చేరువయ్యానని చెబుతున్నారు?**

• అవును. బీ, సీ కేంద్రాల్లో మంచి కలెక్షన్స్ ఉన్నాయి. థియేటర్లలో ఆక్యుపెన్సీ చూస్తే పై తరగతి టికెట్ల కంటే ముందే క్రింది తరగతి టిక్కెట్లు ఫుల్ అవుతున్నాయి. ఈ ట్రెండ్‌ను ఏరకంగా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు.

**మంచి కథను ఎంచుకోవడం, వాణిజ్యపరంగా దాని ఫలితాన్ని బేరీజు వేసుకోవడం కత్తిమీదసాములాంటిది. ఈ విషయంలో మీ దృష్టికోణం ఎలా ఉంటుంది?**

• అది చెప్పడం చాలా కష్టమైన విషయం. 'రణరంగం' చిత్రానికి వందకోట్లు వచ్చాయనుకో...ఇకముందు నేను అలాంటి సినిమాలే చేయాలా? గతంలో ఒప్పుకున్న మూడు సినిమా చేయాలా? లేదా?..ఇలాంటి సమీకరణాలు అయోమయంగా అనిపిస్తాయి. ఇక్కడ ప్రతి శుక్రవారం పరిస్థితులు మారుతుంటాయి. నావరకైతే ప్రతి సినిమాలో కథ కొత్తగా ఉండాలి. జోనర్ కూడా గతంలో టచ్ చేయనిదై ఉండాలి. ఒకే మూసలో సినిమాలు చేస్తే కొన్నాళ్ల తర్వాత ప్రేక్షకులకే బోర్ కొడుతుంది. కథాంశాల ఎంపికలో ఎలాంటి ప్రమాణాల్ని పెట్టుకోను. నా అంతరాత్మనే అనుసరిస్తాను.

**తదుపరి చిత్రాల గురించి...?**

• ప్రస్తుతం '96' రీమేక్‌లో నటిస్తున్నాను. యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. 'శ్రీకారం' అనే ఓ చిత్రాన్ని చేస్తున్నాను. అదొక అద్భుతమైన కథ. ప్రతి ఒక్కరికి నచ్చుతుంది. అయితే కమర్షియల్‌గా ఎంతవరకు వర్కవుట్ అవుతుందో నాకు తెలియదు. 'శతమానం భవతి' సినిమా చేసినప్పుడు కూడా వాణిజ్యపరంగా ఫలితం ఎలా ఉంటుందో తెలియదు. కథపై నమ్మకంతో సినిమా చేశాను. ఈ రెండు సినిమాలే కాక తమిళ, తెలుగులో ఓ సినిమా చేస్తున్నాను.

# జాన్వికపూర్ తెలుగు అరంగేట్రం?



రామ్ కథానాయకుడిగా నటించిన 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో దర్శకుడు పూరిజగన్నాథ్ మళ్లీ విజయాల బాట పట్టారు. గత కొంత కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'ఇస్మార్ట్ శంకర్' తిరుగులేని విజయాన్ని అందించింది. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో పూరిజగన్నాథ్ క్రేజీ హీరో విజయ్ దేవరకొండతో కలిసి ఓ స్టైలిష్ ఎంటర్‌టైనర్‌ని రూపొందించడానికి సిద్ధమవుతున్నారు. పూరి కనెక్ట్స్, పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై ఛార్మితో కలిసి పూరిజగన్నాథ్ ఈ చిత్రాన్ని తెరపైకి తీసుకురాబోతున్నారు. త్వరలో సెట్స్‌పైకి రానున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌తో శ్రీదేవి కుమార్తె జాన్వికపూర్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానున్నట్లు తెలిసింది. శ్రీదేవి కోరిక మేరకు తెలుగు, తమిళ భాషల్లో నటించడానికి సిద్ధమైన జాన్వికపూర్ తాజాగా తెలుగు చిత్రాన్ని అంగీకరించినట్లు తెలిసింది. కాగా ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేయనున్నారని చిత్ర వర్గాల సమాచారం.





